లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక



# జనబలం

మార్చి, 2021 రూ.10/-

## సెల్యూట్

నరెడ్ల శ్రీనివాస్ స్మృతికి అంకితం ఈ సంచిక




## 9 రోజులు.. 15 సెషన్లు .. 50+ నిష్ణాతులు

Recording... LIVE on YouTube


# మారథాన్‌లా ఐడీఏడబ్ల్యూ 2వ జాతీయ సదస్సు







## 'చట్టబద్ధపాలనపై హైదరాబాద్ డిక్లరేషన్ 2021'



నరెడ్ల శ్రీనివాస్ మృతితో నేను ఓ అత్యంత ఆప్త సహచరుడ్ని కోల్పోయాను. ఆయన మృతి కరీంనగర్, తెలంగాణల్లో వినియోగదారుల ఉద్యమానికి, లోక్‌సత్తాకు, పౌర సమాజానికి పెద్ద లోటు. ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన గొప్ప పౌరుడాయన. నిత్యం ఉత్సాహం, ఆశావాదంతో తొణికిసలాడుతుండేవారు. ఎంత గంభీరంగా ఉందామనుకున్నా కన్నీరు ఆగటం లేదు. ఓంశాంతి.

- డా॥ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు









ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 24 సంచిక 03
మార్చి 2021

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




మనల్ని గెలిపించిన రాష్ట్రాలనుంచట సర్.. అక్కడ కూడా ఇవ్వాలంటున్నారు.

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# కరోనా కాలంలో విద్యారంగం

కరోనా మహమ్మారి మన విద్యారంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. పాఠశాలలను నిరవధికంగా మూసివేయడంతో బోధనాభ్యసన ప్రక్రియకు తీవ్ర అంతరాయం కలిగింది. 2019-20 విద్యా సంవత్సరం చివరి నెలల్లో కోవిడ్ మహమ్మారి విజృంభించడంతో పాఠశాలలను ముందుగానే మూసివేయాల్సి వచ్చింది. దాంతో పరీక్షలను కూడా నిర్వహించలేక పిల్లలందర్నీ పై తరగతులకు ప్రమోట్ చేశారు. 2020-21 విద్యా సంవత్సరంలో పాఠశాల తరగతులకు ప్రత్యామ్నాయంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించే ప్రయత్నం అయితే జరిగింది. కానీ అభ్యసనం నామమాత్రంగానే సాగింది. విద్యా సంవత్సరం చివరి త్రైమాసికంలో పాఠశాలలు తెరిచినా బోధనాభ్యసన సాధారణ స్థాయికి రాలేదు. మొత్తం మీద పిల్లల అభ్యసనా సామర్థ్యాలు ఘోరంగా పడిపోయాయి.

కరోనా మహమ్మారి విద్యారంగంపై చూపిన ప్రతికూల ప్రభావాన్ని అంచనా వేసేందుకు యునెస్కో ప్రయత్నించింది. భారతదేశంలో ఉన్న పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రథమ్ సంస్థ కూడా తన 'అసర్' సర్వే ద్వారా అధ్యయనం చేసింది.

ప్రపంచంలోనే రెండో పెద్ద విద్యా వ్యవస్థ మన దేశంలో వుంది. దాదాపు 15 లక్షల పాఠశాలల్లో 32కోట్ల మంది విద్యార్థులు చదువుతున్నారు. కరోనా కారణంగా పాఠశాలలు మూసివేయడంతో వీరందరి అభ్యసనా ప్రక్రియ అర్థంతరంగా నిలిచిపోయింది. దాదాపు మూడున్నర కోట్ల మంది బడి ఈడు పిల్లలు బడిబైట వుంటున్న మన దేశంలో బడికి వెళ్లే 32 కోట్ల మంది పిల్లల చదువుకు అంతరాయం కలగడం పెను సవాలుగా పరిణమించింది.

బడికి వెళ్లే పిల్లల అభ్యసనా సామర్థ్యాలు అంతంతమాత్రంగా వుంటున్న తరుణంలో ఇంత భారీ స్థాయిలో పిల్లలు బడికి వెళ్లలేక పోవడం వారి అభ్యసనాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. డిజిటలైజేషన్‌కు అత్యంత ప్రాముఖ్యం ఇస్తున్నట్లుగా ప్రభుత్వం ఎంతగా చెబుతున్నా విద్యారంగంలో దాని ప్రవేశం నామమాత్రంగా ఉంది. కరోనా కాలంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహణకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నం చేశాయి. అయితే మన సమాజంలో నెలకొని ఉన్న అంతరాలను ఈ -లెర్నింగ్ ప్రయత్నం మరింతగా వెలుగులోకి తెచ్చింది.

నిరంతరం విద్యుత్ సరఫరా వున్న కుటుంబాల సంఖ్య 47శాతం మాత్రమే కాగా, మన దేశంలో 37శాతం పాఠశాలలకు అసలు విద్యుత్ కనక్షనే లేదు. గత కొన్ని సంవత్సరాలుగా స్మార్ట్ ఫోన్ ఉన్న కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం దేశంలో 62శాతం గృహాలలో స్మార్ట్ ఫోన్ ఉంది. అయితే ఆన్‌లైన్ పాఠాలు విన్నవారి శాతం 32 మాత్రమే! అందులో నేరుగా పాఠాలు విన్నవారు 11శాతం అయితే రికార్డు చేసిన వీడియోలను చూసిన వారు 21శాతం ఉన్నారు. ఇంటర్నెట్ సదుపాయం ఉన్నప్పటికీ విద్యుత్ లేక, సిగ్నల్ లేక వినియోగించుకోలేని విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉందని 'అసర్' సర్వే వెల్లడించింది.

ఆన్‌లైన్ పాఠాలు విన్నవారిలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అత్యధికంగా ఉన్నారనీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కేవలం 8శాతం మంది మాత్రమే ఆన్‌లైన్ పాఠశాలల సదుపాయాన్ని పొందగలిగారని తేలింది. భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు ఒకే విధంగా ఉన్నాయని యునెస్కో పేర్కొన్నది. 150కోట్ల మంది బడిఈడు పిల్లల చదువులు కరోనా కారణంగా దెబ్బతిన్నాయని యునెస్కో పేర్కొన్నది. దశాబ్దాల పాటు విద్యారంగంలో సాగించిన కృషి కరోనా దెబ్బతో కుప్పకూలిందని, తిరిగి విద్యారంగాన్ని గాడిలో పెట్టి, పూర్వపు స్థాయికి తీసుకురావడానికి సమయం పడుతుందని కూడా యునెస్కో హెచ్చరించింది. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు కలసికట్టుగా కృషి చేస్తే జరిగిన నష్టాన్ని పూడ్చగలుగుతాయని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా విద్యను పట్టాల పైకి ఎక్కించగలుగుతామని యునెస్కో అభిప్రాయపడింది.

కరోనా విద్యారంగంపై చూపిన ప్రతికూల ప్రభావాన్ని ముందుగా అంచనా వేయాల్సి ఉంది. బడిఈడు పిల్లల్లో బడి బయట మిగిలిపోయిన వారిని తిరిగి సమీకరించాలి. దానికి సామాజిక తోడ్పాటును, ఉపాధ్యాయుల మద్దతును కూడగట్టాలి. పాలనావ్యవస్థల మధ్య సమన్వయం, తగిన ఆర్థిక వనరుల కేటాయింపు, చట్టాలకూ, విధానాలకు మధ్య పొంతన సమకూర్చడం ద్వారానే విద్యారంగం గాడిన పడుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా విద్యారంగంలో కనిపిస్తున్న డిజిటల్ అసమానతలను తొలగించడానికి ప్రయత్నం జరగాలి. ప్రాంతం, భాష, లింగం, వర్ణం, జాతి వంటి వ్యత్యాసాలు లేకుండా అందరికీ విద్యను అందించేందుకు ప్రభుత్వాలు తగిన ప్రణాళిక రూపొందించాలి. వలసలు, నిర్వాసితులు, మారుమూల ప్రాంతాల కుటుంబాల పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలి. సంప్రదాయాల పేరుతో ఇంకా చాలా ప్రాంతాల్లో బాలికా విద్యపై కొనసాగుతున్న వివక్షను అంతం చేయాలి. కరోనా విసిరిన సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవడం తక్షణ బాధ్యతగా యునెస్కో హెచ్చరిస్తోంది.

డి. సోమసుందర్

# లోక్‌సత్తా శీనన్నా.. ఇక ప్రశ్నించేది ఎవరన్నా?

**-అవినీతి వ్యతిరేక పోరాట యోధుడు నరెడ్ల శ్రీనివాస్‌కు అశ్రునివాళి-**

- నోముల శ్రీనివాస్ రెడ్డి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సభ్యులు, 94413 57274

## "పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా సమాజానికి"

**అన్న కాళోజీ మాటలకు నిలువెత్తు రూపం అతడు.**

**మెరుగైన సమాజం కోసం అనుక్షణం తపిస్తూ అత్యంత ఆత్మనిబ్బరంతో సామాన్య జనాన్ని పోగేసి అవినీతికి వ్యతిరేకంగా అతడు పోరాడిన తీరు ఇతరులు ఎవరికీ సాధ్యం కానిది.**

**ఏ తలుపు తట్టినా న్యాయం లభించని బాధితులు చివరగా ఆయన్ని ఆశ్రయిస్తే వారికి విజయం చేకూరే దాకా వెన్నంటి నిలిచేవాడు. విసుగు విరామం లేకుండా అహర్నిశలు శ్రమిస్తూ మోసపోయిన వినియోగదారుల పక్షాన పోరాడి సాధించిన వందలకొద్దీ విజయాలే ఇందుకు సజీవ తార్కాణాలు.**




సామాన్యుల సమస్యలను అతను ఫిర్యాదుగా మార్చి సంధిస్తే, ఎంతటి అధికారులైనా విని తీరవలసిందే. బాధితుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయడం తప్ప అధికారులకు మరొక మార్గం ఉండేది కాదు.

లోతుగా సమస్య మూలాల్ని శోధించి, విషయ పరిజ్ఞానంతో సమాచార హక్కు లాంటి ఆయుధాలను ఉపయోగించి ఆయన పోరాడే తీరు ప్రజాస్వామికవాదులు అందరికీ ఆదర్శప్రాయం. తుపాకీ చేత పట్టకుండా విషయ పరిజ్ఞానంతో అవినీతిపై పోరులో విజయం సాధించే సైనికుడు ఆయన.

విద్యార్థి దశలోనే ప్రగతిశీల భావాలను పుణికిపుచ్చుకుని నిరంతర పరిశీలన, పఠనంతో సమాజాన్ని చదివి- ఏ హోదాలో ఎక్కడ పనిచేసినా సామాన్యుల పాలిట ఒక ఆపద్బంధుగా నిలిచాడు.

బ్యాంకు ఉద్యోగిగా ఆపన్నులు ఎందరికో అండగా నిలిచి చేయూత అందించిన తీరును కరీంనగర్లో వందలాది మంది నిరుపేదలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు.

వృత్తి-ప్రవృత్తి రెండింటిలోనూ ఆదర్శంగా నిలిచిన విలక్షణ మూర్తిమత్వం అతడిది.

ఉత్తమ చిత్రాలు సమాజ గతిని మార్చగలవు అనే ముందుచూపుతో దశాబ్దాల క్రితమే కరీంనగర్లో ఫిల్మ్ సొసైటీని స్థాపించి నిర్వహించిన తీరు ఎందరినో ప్రభావితం చేసింది.

అలిశెట్టి ప్రభాకర్ అంటే ఆయనకు అభిమానం. అభ్యుదయ సాహిత్య సృష్టి కోసం తాను వ్రాస్తూ, మరెందరినో ప్రోత్సహించడమే కాక అనేక సదస్సుల నిర్వహణ బాధ్యతలను తలకు ఎత్తుకునేవారు.

ఆర్థిక అంశాలు పామర జనానికి అర్థమయ్యేటందుకు ఎకనమిక్ ఫోరం ద్వారా ఆయన నిర్వహించిన సదస్సులు ఎందరినో చైతన్య పరిచాయి. ఎన్నికల సమయంలో పోటీ చేసే అభ్యర్థులను నిఘా వేదికల ద్వారా నిర్మొహమాటంగా, నిర్భయంగా ప్రశ్నిస్తూ ప్రజలకు ఎంతో మేలు చేశారు.

లోక్‌సత్తా ద్వారా స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం ఉద్యమించారు.

విద్యార్థులు సెలవులలో నిర్వహించే జాతీయ సేవా పథకంలో పాల్గొని తన ఉపన్యాసాల ద్వారా వారిని ఉత్తేజితులను చేసేవారు.

లంచగొండి అధికారులను అవినీతి నిరోధక శాఖ వారికి పట్టించిన బాధితులను సమీకరించి, వారిని సన్మానించే వినూత్న కార్యక్రమం ఎందరినో ఆకట్టుకుంది. బాధితులను సన్మానించడంతో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించడమే కాకుండా ఒక ప్రశ్నించే సైన్యాన్ని తయారుచేయగలిగాడు.

పోలీసు అకృత్యాలకు వ్యతిరేకంగా నిలిచి పోరాడటం ఆయనకు మాత్రమే సాధ్యమయింది. బాధితుల పక్షాన మరింత మెరుగ్గా పోరాడాలనే తపన, ఆరు పదుల వయస్సులోనూ ఆయనను న్యాయ విద్యను అభ్యసించుటకు పురికొల్పింది.

ప్రజాహితం కోసం పాటుపడే ఏ సామాజిక కార్యకర్త అయినా అధ్యయనం చేయగలిగితే ఆయన జీవితమే ఒక గొప్ప సందేశం అవుతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే నరెడ్ల శ్రీనివాస్ ఎవరిని ఓట్లు అడగని ఒక గొప్ప ప్రజా నాయకుడు.

# ఉద్యమాల బాటలో అలుపెరుగని బాటసారి...


## అవినీతి, అన్యాయాలతో పోరాడారు.. కరోనాతో పోరాడుతూనే ఓడిపోయారు

## ఒక ఉద్యమ ధ్రువతార గగనాన నిలుస్తుంది

- బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త, 98660 74027

నరెడ్ల శ్రీనివాస్ కరీంనగర్ వాసులకే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సత్తా ఉద్యమానికి పరిచయం అక్కర్లేని పేరు. ఆయన ఇంటిపేరు మారిపోయింది. ఆయనను ఎరిగినవారు లోక్‌సత్తా శ్రీనివాస్‌గానే పిలిచేవారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్‌సత్తా అంటే శ్రీనివాస్, శ్రీనివాస్ అంటే లోక్‌సత్తా అనే నానుడిని నిజం చేశారు. అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్‌లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. వినియోగదారుల హక్కుల సంఘం నుంచి మొదలుకొని కరీంనగర్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపక సభ్యుడిగా ఆ తర్వాత ఆ సంస్థ అధ్యక్షుడిగా పలుసార్లు పనిచేశారు. సమాచార హక్కు కార్యకర్తగా, ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్‌గా, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పలు పదవులు చేపట్టారు. వాటిని పదవులుగా మాత్రమే భావించకుండా బాధ్యతలుగా గుర్తించి పనిచేశారు. సమాజంలోని అవినీతి అక్రమాలపై పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించిన నరెడ్ల శ్రీనివాస్ కరోనా మహమ్మారితో పది రోజులు పోరాటం చేసి జీవితంలో ఓడిపోయారు. 15 ఫిబ్రవరి, 2021 ఉదయం 6 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణం ఒక్క లోక్‌సత్తా ఉద్యమ సంస్థకే కాదు యావత్ కరీంనగర్ జిల్లాతోపాటు రాష్ట్రానికి పూడ్చలేని తీరని లోటు.

ఆయనతో నాకు సుమారు ఇరవై సంవత్సరాల అనుబంధం ఉంది. ఇలా ఆయన గురించి రాయాల్సి వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. కరీంనగర్‌లో జంట ఉద్యమకారులుగా పేరొందిన రాజమౌళి, శ్రీనివాసుల మైత్రికి రాజమౌళి మరణంతోనే గండి పడింది. రాజమౌళి మరణంతో తాను ఒంటరి అయినాననే విచారాన్ని బయటకు కనబడకుండా తనలోనే దాచుకొని ఒంటరిగానే అందరితో కలుపుకొని మళ్లీ ఉద్యమాన్ని నడిపించారు. బృంద నాయకత్వానికి ఒక మంచి ఉదాహరణ శ్రీనివాస్. కరోనాతో మంచమెక్కేదాకా ఆయన గతంలో ఒక్కసారైన అస్వస్థతకు గురైన విషయం మాకు ఎవరికీ తెలియదు. ఉద్యమాల బాటలో అలుపెరగని బాటసారిగా ఆయన పని చేశారు. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ఆయన ఉద్యమాలు నడిపారు. ఏదైతే తాను నమ్మేవారో ఆ సిద్ధాంతాలకు




అనుగుణంగా ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా కొంచెం కూడా తడబడకుండా తాను ఎంచుకున్న ఉద్యమ బాటలో నిలదొక్కుకొని నడిచారు.

**పట్టు పట్టరాదు.. పట్టి విడువరాదు.. పట్టి విడుచుట కంటే....**
**అన్న వేమన పద్యానికి అతికినట్టు ఆయన ఉద్యమాల ఊపు ఉండేది.**

ఉద్యమ సహచరుడి మరణం తీరని లోటు.

ఉద్యమ పథాన నడిచిన ఇరవై సంవత్సరాలలో సుమారు వందసార్లు నేను ఆయనతో కలసి సమావేశాల్లో పాల్గొన్నాను. కరీంనగర్ బస్టాండ్‌కు వంద మీటర్ల దూరంలోనే ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి మొదలుకొని జిల్లా గ్రంథాలయ సంస్థ హాలు, ఆ తర్వాత పర్మినెంట్‌గా ఫిల్మ్ క్లబ్ భవనం వీటిలో ఆయన ఆధ్వర్యంలో నడిచిన వందల సమావేశాలలో ఆయన కీలక పాత్ర వహించారు. అందరి కంటే ముందుగా ఆయనే వచ్చి వచ్చినవారిని సాదరంగా ఆహ్వానించేవారు. అలాగని మీటింగ్‌లకే పరిమితం కాలేదు. జిల్లాలో అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగినా ఆయన ముందుండి పోరాడారు. వినియోగదారుల సంఘంలో ప్రధాన పాత్ర వహించి కొన్ని కోట్ల రూపాయలను

వినియోగదారులకు నష్టపరిహారం ఇప్పించారు. అన్నిటికంటే పెద్దది అయిన ఛాలెంజ్ ఒకటి స్వీకరించారు. కరీంనగర్ జిల్లాలో ఏఎస్ఐ మోహన్ రెడ్డి వడ్డీ వ్యాపారం కేసులో బాధితుల సంఘానికి బాసటగా నిలిచి వారి సమస్యలను కరీంనగర్ నుండి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వరకూ మారుమోగేలా చేశారు. ఆ కేసులో ఆయన మీద ఎన్నో వత్తిడులు వచ్చినా కూడా ప్రాణాలకు తెగించి న్యాయం కోసం నిలబడ్డారు. ఏఎస్ఐ మోహన్‌రెడ్డిని జైలుపాలు చేశారు. అవినీతికి వ్యతిరేకంగా ఎక్కడ ఉద్యమాలు జరిగినా తాను అక్కడ ముందుండి నడిపించారు. అవినీతిపరులను అవినీతి నిరోధక శాఖకు పట్టించిన వారిని కరీంనగర్‌లో పిలిచి మరి సన్మానం చేశారు. నాతో చేయించారు. నీతికి నిలబడే అధికారులను కూడా అలాగే అభినందించారు. చెడుకి శిక్ష, మంచికి అభినందన కావాలనే ఆయన ఆకాంక్ష.

నిబద్ధతకు మారుపేరు శ్రీనివాస్.

యూనియన్ బ్యాంకులో చిన్న ఉద్యోగంతో మొదలుపెట్టి ఆ బ్యాంకు మేనేజర్‌గా ప్రమోషన్ మీద కొద్ది కొద్ది సంవత్సరాలు రాష్ట్రం విడిచిపెట్టే అవసరం వచ్చినప్పుడు కూడా ఆయన ఉద్యమాలను విడిచిపెట్టలేదు. సెలవు రోజుల్లో కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా కూడా ఆయన ఆ సమయాన్ని ఉద్యమాలకే వెచ్చించారు. తన కుటుంబం కన్నా లోక్‌సత్తా, వినియోగదారుల సంఘం, ఫిల్మ్ క్లబ్, ఎన్నికల నిఘా వేదిక కార్యకలాపాలకే ఆయన సమయాన్ని ఎక్కువగా వినియోగించేవారు. కరీంనగర్‌లో అన్యాయానికి గురైనవారు లోక్‌సత్తా ఉద్యమసంస్థ ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా వెంట ఉండి నడిపించేవారు. ఉద్యమ బాటలో అధికారులతో వ్యవహరించే తీరులో శ్రీనివాస్‌గారిది ప్రత్యేక శైలి. నొప్పింపక తానొవ్వక అన్న విధంగా చెప్పాల్సిన విషయాన్ని సూటిగా వారికి విడమరిచి చెప్పేవారు. వినకపోతే అంతే సంగతులు. ఆ విషయాన్ని పైస్థాయి అధికారుల వరకు తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే నైపుణ్యం ఆయనకు ఉండేది. ఉద్యమాల బాటలో పని విభజన కూడా ఒక ముఖ్యమైన అంశం. ఆయన ఒక సమావేశం పెట్టారంటే ఎవరు ఏ పని చేయాలో నిర్ణయించి ఆ పని వారితో చేయించడంలో దిట్ట. సమస్య తీవ్రతను గుర్తించడమే కాదు దానికి పరిష్కారం ఎలా అనే విషయంలో శ్రీనివాస్ గారికి చాలా స్పష్టత ఉండేది. ఉపాయం ఉన్నవాడు అపాయంలో పడడు అన్న చందాన ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో తనదైన శైలిలో ఆలోచించి ఎక్కడా రాజీపడకుండా ఆ సమస్యను పరిష్కరించేవాడు. అలాగని అందరితో శత్రుత్వం పెట్టుకునే మనస్తత్వం కాదు ఆయనది. తప్పు ఉంటే తన వాడినైనా ఎదిరించే తత్వం ఆయనది. కరీంనగర్ లోక్‌సత్తా ఏదైనా సమస్యను పరిగణలోకి తీసుకొని ఫిర్యాదు చేసిందంటే జిల్లా స్థాయి అధికారులు దాన్ని వేరే పరిశీలన ఏమీ లేకుండానే స్వీకరించేవారు. లోక్‌సత్తా క్రెడిబిలిటీకి శ్రీనివాస్ గారు చేసిన సేవ అది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో తిరిగి లోక్‌సత్తా చేపట్టిన అన్ని ఉద్యమాలను విస్తృతంగా ప్రచారం చేశారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ గారు పలుమార్లు కరీంనగర్ జిల్లా సందర్శించడానికి శ్రీనివాస్ కార్యశీలత ఒక కారణంగా చెప్పవచ్చు. అలాంటి లోక్‌సత్తా సహచరుడి మరణానికి వారి కుటుంబానికి సంతాపం తెలుపుతున్నాను. ఆయన సమాజానికి చేసిన సేవలు మరువలేనివి. ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ముందుకు తీసుకుపోవడం మాత్రమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి. అమరుడికి అక్షరాంజలి సమర్పిస్తున్నాను.

## లోక్‌సత్తా శీనన్న వ్యక్తి కాదు, శక్తి.. హుస్నాబాద్‌తో చక్కటి అనుబంధం

**- పందిల్ల శంకర్, హుస్నాబాద్**

కీ॥శే॥ నరెడ్ల శ్రీనివాస్ గారు ఒక వ్యక్తి కాదు.. వారొక శక్తి. వారి జీవితాన్ని పూర్తిగా పరిశీలిస్తే తెలిసివచ్చే అంశం ఇది. బాల్యం నుంచే అనేక ఒడిదుడుకులతో జీవితాన్ని ప్రారంభించి స్వశక్తితో ఎదిగి ఈ సమాజానికి తన వంతుగా ఏదైనా చేయాలనే తపన కలిగి అందులో సంపూర్ణంగా జీవించి అందరి చేతా నీరాజనాలు, నివాళులు అందుకున్న గొప్ప మానవతావాది.

సమాజ సేవకు కావలసింది సంపద, అధికారం, పదవులు కాదు.. ఉదార హృదయం అని నిరూపించిన మహామనీషి.

చేసే పనులకు, సహాయానికి చిన్నపాటి ఎదురుచూపు లేకుండా తనే వ్యయప్రయాసలకు, డబ్బుకు ఓర్చుకుని అవతలివారికి సాయపడ్డ ధీరోదాత్తుడు. ఈ కలికాలంలో.. ఓ ధైర్యవంతుడు, ఓ నిజాయతీపరుడు, ఓ ప్రశ్నించే గొంతు, ఓ బాధ్యత గల పౌరుడు, ఓ నిరాడంబర సేవా గుణవంతుడు ఎవరు అంటే మాలో అనేకమందికి గుర్తుకువచ్చేది శ్రీనివాస్ గారు.

ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో సామాజిక కార్యకర్తలకు భావజాలాన్ని అందించిన మార్గదర్శకుడు. వారికి హుస్నాబాద్‌తో మంచి అనుబంధముంది. 1999, 2004 అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులతో ముఖాముఖి ఏర్పాటు, అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దిన కార్యక్రమాన్ని నిర్వహించటం ప్రారంభించి ఎందరో యువతకు ఉత్తేజాన్ని కలిగించారు. కరీంనగర్‌లో నిర్వహించిన అనేక కార్యక్రమాలలో మాకు చక్కటి భాగస్వామ్యం కల్పించటమే కాకుండా.. హైదరాబాద్‌లో కార్యక్రమాలకు కూడా వెంట తీసుకెళ్లి నాకొక మార్గనిర్దేశనం చేశారు. తెలంగాణ ఉద్యమంలో అపోహల వల్ల లోక్‌సత్తా పట్ల కొంత వ్యతిరేకత ఏర్పడి ఇబ్బంది తలెత్తినా కరీంనగర్‌లో శీనన్న ఫేస్‌వాల్యూ ఒడిదుడుకుల నుండి మమ్మల్ని కాపాడింది. ఆయన లోటును ఎవరూ పూడ్చలేరు. మళ్లీ ఆయనే పుట్టాలి. అంతే.

# బతికితే శీనన్నలా బతకాలి

-శిరమని నరేష్

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపక సభ్యులు, కరీంనగర్ జిల్లాలో లోక్‌సత్తా ఉద్యమాన్ని తిరుగులేని శక్తిగా నిలిపిన నాయకుడు, ప్రజల గొంతుకగా నిలిచిన నరెడ్ల శ్రీనివాస్ గారు కరోనాతో మరణించారు.

1997లో లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటి దాకా, ఏ కార్యక్రమం తీసుకున్నా కరీంనగర్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి మూడు స్థానాల్లో కచ్చితంగా ఉండడానికి శ్రీనివాస్ గారు వేసిన పునాదే కారణం. దివంగత టి.రాజమౌళితో మొదలుకుని ప్రకాష్ హోల్లా, చంద్ర ప్రభాకర్ లాంటి ఎందరో నాయకులని లోక్‌సత్తాకు అందించిన వ్యక్తి శ్రీనివాస్.

ఈ లోకాన్ని వీడిపోయే 15 రోజుల క్రితం వరకు కూడా శ్రీనివాస్ గారు, ప్రతిరోజూ లోక్‌సత్తా కార్యాలయంలో ప్రజలకి అందుబాటులో ఉండేవారు. ప్రతిరోజూ కనీసం ఐదారుగురు సామాన్యులు తమ సమస్యల పరిష్కారం కోసం లోక్‌సత్తా ఆఫీసుకి వచ్చేవారు. వారందరికీ తగిన సలహాలు ఇవ్వడంతోపాటు, సమాచార హక్కుని ఆయుధంగా మార్చి ఎన్నో ప్రజా సమస్యలకి పరిష్కారాలు సాధించారు. కొండగట్టు బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సహాయం అందకపోతే, దాన్ని ప్రశ్నించి బాధితులకి న్యాయం జరిగేలా చేసారు. వందల కోట్ల అవినీతిని అడ్డుకున్నారు. ఇలా ఎంతో సేవ చేసారు. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీనివాస్ గారు కరీంనగర్ ప్రజల గొంతుకగా నిలిచారు.



వామపక్ష విద్యార్థి సంఘం ద్వారా ప్రజాజీవితంలోకి వచ్చిన శ్రీనివాస్ గారు, అనంతరం అనేక రంగాల్లో ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. శ్రీనివాస్ గారు ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పనిచేసారు. తర్వాత వినియోగదారుల హక్కుల పరిరక్షణ యోధుడిగా ఆ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి ప్రధాన పాత్ర పోషించారు. ఉత్తమ విలువలు ఉన్న సినిమాలను ప్రోత్సహించడానికి ఏర్పడిన ఫిల్మ్ సొసైటీ బాధ్యుడిగా మంచి సినిమాల ప్రదర్శన కోసం తన నాయకత్వంలో కరీంనగర్‌లో ఒక థియేటర్‌నే ఏర్పాటు చేయించిన సమర్థుడు శ్రీనివాస్ గారు. శ్రీనివాస్ గారి నుండి ఈతరం నాలుగు లక్షణాలు అలవరచుకోవాలి.

1. ప్రజా ఉద్యమాలు, ప్రజా సమస్యలు అంటూ కార్యక్షేత్రంలో ఎక్కువగా ఉండేవారు, తాము ఉద్యోగం నిర్వహించే కార్యాలయంలో మాత్రం తక్కువగా ఉంటారు. కానీ, శ్రీనివాస్ గారు అలా కాదు, ఉద్యోగ బాధ్యతలని అందరికన్నా మిన్నగా నిర్వహిస్తూ కూడా ఇతర ప్రజాసేవ కార్యక్రమాలు నిర్వహించవచ్చు అని నిరూపించారు. తమ బ్యాంక్ శాఖని సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా, మాది శ్రీనన్న బ్యాంక్ అని ఉద్యోగులు గర్వంగా చెప్పుకునేలా పేరు తెచ్చుకున్నారు. వృత్తి జీవితాన్ని, ప్రజా జీవితాన్ని బాలెన్స్ చేసుకోవడం ఎలాగో శ్రీనివాస్ గారి నుండి నేర్చుకోవాలి.

2. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు, మరోపక్క ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ కూడా, శ్రీనివాస్ గారు ఏనాడూ తన కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయలేదు. తన ఇద్దరు కుమారులని ఉన్నత విద్యావంతులుగా, ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. వ్యక్తిగత జీవితాన్ని, ప్రజా జీవితాన్ని ఎలా బాలెన్స్ చేసుకోవాలో కూడా ఈతరం శ్రీనివాస్ గారి నుండి నేర్చుకోవాలి.

3. ఎన్ని వత్తిడులు ఉన్నా, ఎంత పెద్ద పోరాటం చేస్తున్నా, ఎంత పెద్ద అవినీతిని తవ్వి తీస్తున్నా కూడా శ్రీనివాస్ గారి ముఖంలో ఆందోళన, ఆగ్రహం అనేవి మచ్చుకు కూడా కనిపించేవి కాదు అని ఆయన్ని దగ్గరగా చూసిన ప్రతి ఒక్కరూ చెప్పే మాట. ఇలాంటి స్థితప్రజ్ఞత, ఈతరం శ్రీనివాస్ గారి నుండి నేర్చుకోవాల్సిన మూడవ లక్షణం.

4. రాడికల్ స్టూడెంట్ యూనియన్ నుండి లోక్‌సత్తా దాకా సుదీర్ఘంగా సాగిన శ్రీనివాస్ గారి ప్రజాజీవితంలో, ఆయనకి శత్రువులే లేరంటే, నమ్మడం కష్టం కానీ, అది నిజం. మన పోరాటం విధానాల మీదే ఉండాలి తప్ప, వ్యక్తులపై కాదు అనే స్పష్టత తొలి నుండి కలిగి ఉన్న శ్రీనివాస్ అజాతశత్రువుగా నిలిచారు. అందుకే ఆయన లోకాన్ని వీడిపోతే.. లెఫ్ట్, రైట్, సెంటర్ అనే తేడా లేకుండా ప్రతి రాజకీయ నాయకుడు తన సొంత మనిషిని కోల్పోయినట్లు బాధపడ్డారు. పేద, ధనిక తేడా లేకుండా వందలాది మంది కన్నీళ్లు కార్చారు. ఇలా అందరి మనిషిగా ఉండగలగడం శ్రీనివాస్ గారి జీవితం నుండి ఈతరం నేర్చుకోవాల్సిన నాల్గవ లక్షణం.

సమాజంలో చీలికలు ఎక్కువవుతున్న ఈ సందర్భంలో.. వారధిగా నిలబడగలిగిన సత్తా ఉన్న వ్యక్తుల్లో ఒకరు శ్రీనివాస్ గారు.

అజ్ఞానం, అసహనం అనే చీకట్లు విస్తరిస్తున్న ఈ సందర్భంలో.. దీపస్తంభంగా నిలబడి వెలుగు నింపగల వ్యక్తి శ్రీనివాస్ గారు.

శ్రీనివాస్ గారు మరణించడం.. తెలుగు ప్రజలకి, లోక్‌సత్తా అభిమానులకి తీరని లోటు.


**యువతకు రోల్‌మోడల్**

నరెడ్ల శ్రీనివాస్ మృతి వల్ల ఏర్పడిన వెలితిని భర్తీ చేయాల్సిన బాధ్యతను సమాజం తీసుకోవాలని 'జనబలం' సంపాదకులు సోమసుందర్ అన్నారు. ఆయన అకాల మరణం పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. వ్యక్తిగా, సమష్టిగా ఎలా ఉండాలో శ్రీనివాస్ ఆచరించి చూపారని, యువత ఆయన్ని రోల్‌మోడల్‌గా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# చట్టబద్ధపాలన - సంస్కరణలు - జాతీయ సదస్సు

జాతీయతా భావం, సాంస్కృతిక చారిత్రక వారసత్వం, వనరులు, సాంకేతికత, యువశక్తి ఇలా అన్నీ ఉన్నా కూడా పౌరులందరి కోసం పనిచేసే అర్థవంతమైన ప్రజాస్వామ్య నిర్మాణం కొరవడటం వల్ల భారతదేశం ఆశించిన స్థాయి ప్రగతిని సాధించలేకపోతోంది. అవకాశాల్ని అందుకోలేక, నివారించదగ్గ బాధలను తప్పించుకోలేక కోట్లాది మంది భారతీయులు కన్నీరు కారుస్తున్నారు. అందుకే మన దేశ ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయటానికి ఎక్కడెక్కడ ఏయే కీలక మార్పుల్ని తేవాలో వివిధ కోణాల్లో, ప్రామాణికంగా, ఏకాభిప్రాయ దిశగా చర్చించేందుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)/భారతీ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసింది. వార్షిక జాతీయ సదస్సుల్ని నిర్వహిస్తోంది. ఏటా ఒక మౌలికాంశం మీద జరిగే ఈ సదస్సుల్లో.. 2020లో నిర్వహించిన మొదటి సదస్సు చర్చాంశం 'మనీ పవర్ ఇన్ పాలిటిక్స్' కాగా, 2021లో నిర్వహించిన రెండవ వార్షిక సదస్సు చర్చాంశం– చట్టబద్ధపాలన!

**'చట్టబద్ధపాలన'పై ఫిబ్రవరి 20 నుండి 28 దాకా వెబ్ ద్వారా జరిగిన ఐడీఏడబ్ల్యూ జాతీయ సదస్సు చర్చల్లో.. ఉన్నత స్థాయి న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, ఇతర రంగాల సుప్రసిద్ధ నిష్ణాతులు 50 మందికిపైగా పాల్గొన్నారు. మన న్యాయవ్యవస్థను పీడిస్తున్న నిర్దిష్ట సమస్యలపై కార్యాచరణ దిశగా ప్రసంగించారు,**




**ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్ 2వ జాతీయ సదస్సు చర్చా పత్రం '21వ శతాబ్దంలో చట్టబద్ధపాలన'ను హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేస్తున్న ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్ రామ్మోహనరావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కె.సి సూరి, ఎఫ్‌డీఆర్‌కు చెందిన కె.సుమేధ, శ్వేత చందర్, వ్రితి బన్సల్, శృతి పాతూరి, కేశవరెడ్డి**

ఆఫ్ పబ్లిక్ పాలసీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)తో కలిసి జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (http://idaw.in) వేదికను

**చర్చించారు. కాన్సెప్ట్ వివరాలు..**

ప్రజాస్వామ్య సమాజానికి, రాజ్యాంగబద్ధ పాలనకు వెన్నెముక చట్టబద్ధపాలన! రాజ్యాంగ స్వేచ్ఛలను పరిరక్షిస్తూ శాంతి భద్రతలను కాపాడటం.. సామరస్య సమాజానికి,

INDIAN DEMOCRACY AT WORK
FOUNDATION FOR DEMOCRATIC REFORMS | ISB Bharti Institute of Public Policy | हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో ముఖ్యం. వివాదాలను నిష్పక్షపాతంగా, వేగంగా, సమర్థవంతంగా, తక్కువ ఖర్చులో పరిష్కరించటం పరస్పర విశ్వాసానికి, ఆర్థిక వృద్ధికి కీలకం. వేగంగా పట్టణీకరణ జరుగుతున్న సమాజంలో నేరాలను నియంత్రించటం, శాంతి భద్రతలను పరిరక్షించటం అత్యంత ప్రాధాన్యాంశాలు. కానీ మానవ ప్రవర్తనను నియంత్రించే సామాజిక కట్టుబాట్లు గ్రామీణ ప్రాంతాల్లో బలహీనపడుతుండగా, ఎవరికివారే తరహా జీవనశైలి వల్ల పట్టణ ప్రాంతాల్లో ప్రభావశూన్యమవుతున్నాయి. పట్టణీకరణ పెరుగుతున్నకొద్దీ సివిల్ వివాదాలు, నేరాలు కూడా పెరుగుతుంటాయి. బలమున్నవాడిదే రాజ్యమైతే నేరాలు విజృంభిస్తాయి. అంబేద్కర్ హెచ్చరించిన అరాచక వ్యాకరణం ('గ్రామర్ ఆఫ్ యానార్కీ') పెచ్చరిల్లి ఆర్థిక కలాపాలు, సంపద సృష్టి క్షీణిస్తాయి. వ్యక్తిగత ఆస్తి హక్కులను కాపాడటం, పక్షపాతరహితంగా, సమన్యాయంతో ఒప్పందాల్ని అమలు చేయటం, న్యాయమైన కార్మిక చట్టాలు, సమాజంలో అన్ని వర్గాలకీ అవకాశాల వల్ల.. వ్యాపార, వాణిజ్యాలు విలసిల్లుతూ విస్తరించే సంస్కృతి ఏర్పడుతుంది. చట్టబద్ధపాలన, ఆర్థిక వృద్ధి రెండూ పరస్పరం ఆధారపడి, పరస్పరం పటిష్టపరచుకునేవి.

మన దేశంలో చట్టబద్ధపాలన పేరుకు మాత్రమే ఉంది. వాస్తవంలో మాత్రం తరచూ తీవ్ర చట్టఉల్లంఘనలే. పార్టీ రాజకీయాల ఒత్తిడికి, కొన్నిసార్లు ప్రజల నుంచే ఎదురయ్యే మూకస్వామ్య భావోద్రేకాలకు అతీతంగా పనిచేయగల స్వతంత్రమైన, జవాబుదారీతనమున్న, సమర్థవంతమైన నేర దర్యాప్తు వ్యవస్థ ఉంటేనే.. న్యాయాన్ని సవ్యంగా అందించటం సాధ్యమవుతుంది. దర్యాప్తును సక్రమంగా నిర్వహించి నేరస్తులకు సరైన శిక్ష విధించేందుకు పటిష్టత, స్వతంత్రత, సామర్థ్యం గల ప్రాసిక్యూషన్ ఉండటం నేర న్యాయవ్యవస్థకు, నేరాల నిరోధానికి ఎంతో కీలకం. కోర్టుల్లో సివిల్, క్రిమినల్ కేసుల విచారణలు త్వరితగతిన, అందుబాటు ఖర్చులో, సమర్థంగా జరగటం చట్టబద్ధపాలనకు పునాదులు. ఈ అన్ని కీలక విభాగాల్లోనూ, మన చట్టబద్ధపాలన వ్యవస్థలు బహుముఖంగా విఫలమయ్యాయి.

పోలీసు శాఖనే తీసుకుంటే, సిబ్బంది మీద రకరకాల బాధ్యతల్ని రుద్దుతూ నీరసింప చేస్తున్నారు. పట్టణీకరణ వేగంగా జరుగుతూ నేరాలు పెరుగుతున్నా సరే, మన దేశంలో పోలీసుల సంఖ్య ప్రపంచ ప్రమాణాలతో పోల్చి చూస్తే జనాభాకనిష్పత్తి రీత్యా బాగా తక్కువ. పోలీసులపై రాజకీయ పెత్తనం నేర పరిశోధన విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. దీంతో, ప్రజల్లో నమ్మకం ఉన్నకొద్దీ సడలుతోంది. సింగిల్ పోలీసు విభాగం విధుల్లో మితిమీరిన కేంద్రీకరణ పోలీసులు సమర్థవంతంగా తమ బాధ్యతల్ని నెరవేర్చటానికి అవరోధంగా తయారైంది. కొన్ని సందర్భాల్లో ప్రజల నుంచి ఒత్తిడి, రాజకీయ జోక్యం వల్ల పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని థర్డ్ డిగ్రీ పద్ధతుల్ని అనుసరిస్తున్నారు, ప్రజల సెంటిమెంట్‌ను సంతృప్తి పరిచేందుకు తక్షణ న్యాయాన్ని అమలు చేస్తున్నారు.

లాక్‌డౌన్ నిబంధనల్ని ఉల్లంఘించినందుకు కొన్ని నెలల క్రితం తమిళనాడులో తండ్రీకొడుకులను పోలీసులు దారుణంగా హింసించి హత్య చేయటం భారతదేశంలో పోలీసుల చట్టవిరుద్ధ ప్రవర్తనకి, ఇష్టానుసార బలప్రయోగానికి, హింసకు భయానక ఉదాహరణ. సామాన్యులకందే ప్రభుత్వ సేవలు అధ్వాన్నంగా ఉండటం, బహిరంగ చర్చలు భావోద్రేకాలు, విభజన రాజకీయాలమయమై పోవటం, పాలన, రాజకీయ వైఫల్యాలు తరచూ శాంతి భద్రతల సమస్యలుగా పరిణమిస్తూ పోలీసుల మీద విపరీత భారాన్ని మోపుతున్నాయి. అధికారంలో ఉన్నవారు పోలీసులపై ఉన్న అధికారాన్ని చాలా సందర్భాల్లో రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారు. పోలీసులు చట్టాన్ని అమలు చేసే సేవకులుగా కాకుండా అధికారంలో ఉన్నవారి చేతిలో పావులుగా మారిపోయారు.

న్యాయాన్ని అందించటంలో జాప్యాలు కూడా చట్టబద్ధపాలన సవాళ్లను పెంచుతున్నాయి. ఘోరమైన నేరాలు జరిగినప్పుడు, ప్రజల నుంచి వచ్చే డిమాండ్లు, రాజకీయ నాయకులు ఇచ్చే ఆదేశాలు పోలీసులపై ఒత్తిడిని పెంచి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనుమానితుల కాల్చివేత ఘటనలకు కారణమవుతున్నాయి. ఈ మూక న్యాయ సంస్కృతిని ఎదుర్కోవటమనేది.. సామర్థ్యం, విశ్వసనీయతతో కూడిన నేర పరిశోధన, ప్రాసిక్యూషన్, కోర్టు విచారణ వ్యవస్థలతోనే సాధ్యమవుతుంది. లేకుంటే, మధ్యయుగాలనాటి బందన్యాయ సమాజం స్థాయికి దిగజారిపోతాం.

మన దేశంలో ప్రాసిక్యూటర్లు జడ్జీల కంటే తక్కువ సంఖ్యలో ఉండటం మరో ఆందోళనకర అంశం. పోలీసు విభాగం నుంచి ప్రాసిక్యూషన్‌ను వేరు చేసినా కూడా నేర దర్యాప్తులో కీలక పాత్ర పోషించగల స్థితిలో ప్రాసిక్యూషన్ లేదని దీన్ని బట్టి స్పష్టంగా అర్థమవుతుంది. పోలీసు, కోర్టుల పనితీరులోని అనేక లోపాలు కూడా మన చట్టబద్ధపాలన వ్యవస్థల విశ్వసనీయతను కుంగదీశాయి.

నానీ పాల్కివాలా ఒకసారి వ్యాఖ్యానించినట్లు, తత్వం తెలిగ్గా బోధపడాలంటే మన కోర్టుల్లో సివిల్ వ్యాజ్యం వేస్తే చాలు! స్వతంత్రంగా, నిష్పాక్షికంగా, వేగంగా, సమర్థంగా పనిచేసే న్యాయవ్యవస్థ నాగరికతకు నిర్వచన లక్షణం. అయితే, మన న్యాయవ్యవస్థ, విపరీత భారంతో నత్తనడకతో అసమర్థంగా తయారై ప్రజల్ని తీవ్ర వేదనకు గురిచేస్తోంది. సమాజంలో మంచి ప్రవర్తనను పెంచటానికి, చెడు ప్రవర్తనను నిరోధించటానికి

వేగంగా శిక్షలు విధించటమే ఏకైక విరుగుడు. చట్టాన్ని అమలు చేసి, న్యాయాన్ని అందించటంలో రాజ్యవ్యవస్థకు సామర్థ్యం లేకపోతే, ఎన్ని ఉన్నా చట్టబద్ధపాలన చతికిలపడుతుంది.

మన చట్టాలు, వాటికి వ్యాఖ్యానాలు, కోర్టుల్లో తీర్పులపై వ్యాజ్యాలు పిటిషన్‌దారులకు పెను భారంగా మారి, బతుకుజీవుడా అనుకుంటూ చట్టానికి ఆవల ఇతర మార్గాల్ని ఆశ్రయించేలా పురికొల్పుతున్నాయి. అందుకే బందపద్ధతుల్లో తక్షణ న్యాయం అందించటం ఒక ప్రయివేటు పరిశ్రమగా తయారవుతోంది. స్థానిక కిరాయి మూకలతో తమ వివాదాల్ని చక్కబెట్టుకునే అరాచకత్వం దాదాపు మన నగరాలు, పట్టణాలన్నిటిలో రాజకీయ ఆమోదాన్ని పొందుతోంది. దీనికితోడు, కోర్టులు వాయిదాల మీద వాయిదాలు వేస్తూ, వ్యాజ్యాలను, ఒక దాని తర్వాత ఒకటి అప్పీళ్లను ప్రోత్సహిస్తూండటం వల్ల కేసులు ఖర్చు పెరిగిపోతూ కోర్టులకెళ్లాలంటే భయపడి చాలామంది చట్టవిరుద్ధ పద్ధతుల వైపు మొగ్గు చూపేలా చేస్తున్నాయి. మొత్తంగా, న్యాయం చేయగల సామర్థ్యం కోర్టులకు ఉందన్న విశ్వాసం కొరవడింది.

కోర్టుల్లో విపరీత జాప్యాల వల్ల ఖైదీలతో జైళ్లు క్రిక్కిరిసిపోతున్నాయి. సగానికిపైగా ఖైదీలు పేదరికం కారణంగా విచారణ తెమలక కారాగారాల్లో మగ్గుతున్నవారే! న్యాయవ్యవస్థ వైఫల్యం కారణంగా పేదలకు కనీస స్వేచ్ఛ కూడా లభించకపోవటం మన ప్రజాస్వామ్య రాజకీయ వైఫల్యం.

పరిష్కారాలు వేగంగా అవసరమని ఈ కల్లోల పరిస్థితి మనకు స్పష్టంగా తెలియచేస్తోంది. ఈ పరిష్కారాలు ఆచరణసాధ్యంగా ఉండాలి, ప్రభావం చూపాలి, అదే సమయంలో రాజ్యాంగ మౌలిక సూత్రాలకు అనుగుణంగా ఉండాలి. లా కమిషన్ నివేదికలు, పోలీస్ కమిషన్, పాలనా సంస్కరణల సంఘం నివేదికలు చట్టబద్ధపాలనను బలోపేతం చేయటానికి ఆచరణ సాధ్యమైన సంస్కరణల్ని నిర్దిష్టంగా ప్రతిపాదించాయి. అయితే, ఈ సిఫార్సులను అమలు చేయటానికి ఇప్పటిదాకా జరిగింది మాత్రం బహు స్వల్పం. ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్ రెండవ సదస్సు మన న్యాయవ్యవస్థను పీడిస్తున్న ఈ సవాళ్లను లోతుగా చర్చించింది. ఈ అర్థవంతమైన చర్చల్ని, సంభాషణల్ని కార్యాచరణగా మలచగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది.

కేంద్రీకృత, పక్షపాత రాజకీయాల పెత్తనంలో ఉన్న పోలీసు వ్యవస్థ, బలహీనమైన, అరకొర ప్రాసిక్యూషన్, నత్తనడకనసాగే అసమర్థ న్యాయవ్యవస్థ, కాలం చెల్లిన, సంక్లిష్టమైన ప్రొసీజరల్ చట్టాలు.. ఇలా మొత్తంగా భారత న్యాయవ్యవస్థ వైఫల్యానికి దారితీస్తున్న కారణాలే ఐడీఏడబ్ల్యూ సదస్సు ప్రధాన చర్చాంశాలు. ✦

## 'చట్టబద్ధపాలన'పై ఐడీఏడబ్ల్యూ సదస్సు ప్రధానంగా చర్చించిన అంశాలు:

### పోలీస్

1. నేర పరిశోధనను రాజకీయ జోక్యం నుండి వేరుచేయటం 2. సాంకేతికతలో మెరుగుదల – చలనత, సమాచారం, కంప్యూటరైజేషన్, ఫోరెన్సిక్, శిక్షణ 3. నియామకాలు, సామర్థ్యం పెంపు.. ఎ) పోలీసుల స్థయిర్యాన్ని, పోటీతత్వాన్ని, ప్రజల్లో వారి ఇమేజ్‌ని పెంచటం 4. ప్రజలతో కలివిడిగా (కమ్యూనిటీ) పోలీసింగ్

### ప్రాసిక్యూషన్

1. ప్రాసిక్యూషన్ సామర్థ్యాన్ని పెంపొందించటం 2. ప్రాసిక్యూషన్‌కు సామర్థ్యం, స్వతంత్ర ప్రతిపత్తి 3. నేర దర్యాప్తును నిర్దేశించటానికి ప్రాసిక్యూషన్‌కు సాధికారత

### న్యాయవ్యవస్థ

1. దిగువ కోర్టులపై విచారణ భారాన్ని తగ్గించటానికి స్థానిక కోర్టుల ఏర్పాటు 2. సామర్థ్యాన్ని పెంచటం.. ఎ) జడ్జీల సంఖ్య బి) మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం సి) కోర్టు పాలనా వ్యవహారాలు – అదనపు సిబ్బంది, కేసుల నిర్వహణ వ్యవస్థ 3. పెండింగ్ కేసులను పరిష్కరించటం 4. ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ (ఐజేఎస్)ను ప్రవేశపెట్టటం 5. ఉన్నత న్యాయవ్యవస్థకు జాతీయ న్యాయ ప్రమాణాలు, జవాబుదారీతనం చట్టం 6. శాశ్వత రాజ్యాంగ బెంచ్‌ల ఏర్పాటు

### ప్రొసీజరల్ లా

1. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973 2) సివిల్ ప్రొసీజర్ కోడ్, 1908 3) ఇండియన్ ఎవిడెన్స్ చట్టం, 1872.

మొత్తం 9 రోజుల జాతీయ సదస్సులో ఫిబ్రవరి 20, 21, 27, 28 తేదీల్లో ఈ వ్యవస్థీకృత సంస్కరణలపై చర్చించగా, మిగిలిన రోజుల్లో అసాధారణ చట్టాలు, సోషల్ మీడియాలో నకిలీ వార్తలు, మహిళల భద్రత, సైబర్ క్రైమ్, చట్టబద్ధపాలన–ఆర్థిక వ్యవస్థపై చర్చించారు.

# ఆర్థిక వృద్ధి, ఉపాధికి చట్టబద్ధపాలనే కీలకం: జేపీ

## ఐడీఏడబ్ల్యూ 2వ జాతీయ సదస్సును ప్రారంభించిన జస్టిస్ వెంకటాచలయ్య




అధికార దుర్వినియోగం, ఆధిపత్యాల నుంచి ప్రజల్ని కాపాడటానికి పటిష్ఠ చట్టబద్ధపాలన అవసరమని సుప్రసిద్ధ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్ వెంకటాచలయ్య అన్నారు. సమాజంలో క్షీణధోరణులు కనిపిస్తున్నాయని, దిగువన ఉండే 30 శాతం మంది ప్రజలకు వ్యవస్థ పట్ల నమ్మకం సడలుతోందన్నారు. అత్యుత్తమ ఆలోచనాపరుల్ని తోసిపుచ్చుతున్నారని, కోర్టుల్లో ప్రజలకు న్యాయం అందటం లేదని అన్నారు. సామాన్య ప్రజల్లో అపనమ్మకాన్ని పెంచే ఈ ధోరణులు కొనసాగితే గొలుసుకట్టు పరిణామాలు విధ్వంసకర పరిస్థితులకు దారితీసే ప్రమాదముందన్నారు. 26 ఏళ్లపాటు న్యాయవాదిగా, 22 ఏళ్లపాటు న్యాయమూర్తిగా దాదాపు యాభై ఏళ్ల పాటు న్యాయవ్యవస్థలో ఉన్నానని చెబుతూ.. అందులో పాతుకుపోయిన పెను జాడ్యాలను పలు ఉదాహరణలతో ప్రస్తావించారు.

**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చొరవతో ఏర్పాటైన 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ఎఫ్‌డీఆర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న 9 రోజుల జాతీయ సదస్సును (వెబ్ కాన్ఫరెన్స్) వెంకటాచలయ్య ఫిబ్రవరి 20న ప్రారంభించారు. జేపీ, రిజర్వుబ్యాంకు మాజీ గవర్నర్ డా॥ దువ్వూరి సుబ్బారావు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.రాజశేఖర్, ఐఎస్‌బీ పబ్లిక్ పాలసీ సెంటర్ సారథి అశ్విని ఛత్రే చర్చలో పాల్గొన్నారు.**

జస్టిస్ వెంకటాచలయ్య మాట్లాడుతూ, అమెరికా, సింగపూర్ రెండూ సంపన్న దేశాలే అయినా అమెరికాలో కోర్టు కేసులు ఎక్కువని, అమెరికా ఉదారవాద ప్రజాస్వామిక దేశం కావటమే ఇందుకు కారణమని అన్నారు. మన దేశం శాంతియుతమైన దేశమైనా కూడా కేసులు తక్కువకు అది మాత్రమే కారణం కాదని, ప్రజలు న్యాయవ్యవస్థను విశ్వసించలేకపోతున్నారన్నారు. దాంతోపాటు ప్రజలకు తమ హక్కుల మీద అవగాహన తక్కువన్నారు. ప్రజలకు తమ హక్కులపై, చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. చట్టం ప్రజలకు తెలియాలని, ప్రజలు తెలుసుకోదగినరీతిలో ఉండాలని అన్నారు. చట్టబద్ధపాలన వ్యక్తులకే కాకుండా, ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుందన్నారు. అపరిమిత అధికారాలుంటే ఎంత గొప్ప వ్యక్తినైనా నమ్మలేమని, నియంత్రించటానికి చట్టబద్ధపాలన ఉండాలని అన్నారు. ప్రతి కేసు కూడా చట్టబద్ధపాలనపై కొత్త కోణాల్ని ఆవిష్కరిస్తుందని, కొత్త నిర్వచనాలను ఇస్తుందని అన్నారు. '21వ శతాబ్దానికి చట్టబద్ధపాలన' పేరుతో ఎఫ్‌డీఆర్ పరిశోధనతో ప్రచురించిన చర్చాపత్రం భారత న్యాయవ్యవస్థలోని వైఫల్యాలు, లోపాలకు అద్దం పట్టిందన్నారు. శాంతి భద్రతలు, నేరాల నమోదు, నేర పరిశోధన, ప్రాసిక్యూషన్ తదితర అంశాలలో సంస్థాగత మార్పుల్ని తీసుకురావాలని, ఫోరెన్సిక్ ల్యాబ్‌లను తగినన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. అందరికీ సంక్షోభం గురించి తెలుసని, కానీ మార్పు ఇప్పుడు

INDIAN DEMOCRACY AT WORK
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

కాదు తర్వాత రావాలని కోరుకుంటున్నారని అన్నారు. ‘దేవుడా! నన్ను పవిత్రుడ్ని చెయ్యి. కానీ ఇవాళ కాదు. తర్వాత. ఇప్పుడు నేను చేయాల్సిన పనులు వేరే ఉన్నాయి” అంటే కుదరదన్నారు. జయప్రకాష్ నారాయణ్ గొప్ప ఆశావాదని, కాస్త ఆలస్యంగానైనా మార్పు తప్పదన్నారు.

దువ్వూరి సుబ్బారావు ప్రసంగిస్తూ, భారతదేశంలో సంపన్నత–పేదరికం, ప్రగతి–పేదరికం, ఆహారం–పస్తులు కలిసి సాగుతున్నాయని, దేశంలో దాదాపు 20 కోట్ల మంది 2,000 డాలర్ల తలసరి ఆదాయంతో ఉన్నారని, వీరందరినీ పేదరికం నుంచి బయటపడేయాలంటే చట్టబద్ధపాలన కీలకావసరమని అన్నారు. వనరులు లేక ఎదగలేకపోతున్నామనే భ్రమ నుంచి బయటపడే కొత్త ఆలోచనల్ని పేద, వర్ధమాన దేశాలకు అందించాలన్నారు. ఎటువంటి వనరులు లేని జపాన్ సాధించిన అద్భుత విజయాన్ని ఉదాహరణగా తీసుకోవాలన్నారు. మధ్యయుగ కాలం నాటి పరిస్థితుల నుంచి అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా జపాన్ ఆవిర్భవించటంలో ఇతరత్రా అంశాలతోపాటు వ్యవస్థలు ప్రధాన పాత్ర పోషించాయని, వ్యవస్థల్లో చట్టబద్ధపాలన ముఖ్యమైనదన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత విడిపోయి ఏర్పడిన కొరియాల్లో.. చట్టబద్ధపాలనతో సాగే ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన దక్షిణ కొరియా వేగంగా వృద్ధి చెందగా, చట్టబద్ధపాలన లేకుండా నియంతృత్వంలో ఉన్న ఉత్తర కొరియాలో పేదరికం తాండవిస్తోందన్నారు. రోడ్ల కోసం ప్రభుత్వం డబ్బున్న వారికి అనుకూలంగా డిజైన్ మార్చి పేదల భూములను తీసుకోవటం, బయోటెక్ ల్యాబ్‌లు వంటి సంస్థల పేటెంట్లను తోసిపుచ్చటం, ఒప్పందాలను గౌరవించకపోవటం, పాత ఒప్పందాలను తిరగదోడి పన్నులు వసూలు చేయటం, గత ప్రభుత్వ కాంట్రాక్టుల్ని తిరస్కరించటం వంటివన్నీ చట్టబద్ధపాలన వైఫల్యాలేనన్నారు. చైనా కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేసే ఆర్థికవృద్ధిని సాధించటం వెనుక కూడా చట్టబద్ధపాలన కీలక పాత్ర పోషించిందన్నారు. డెంగ్ జియావోపెంగ్ పగ్గాలు తీసుకోగానే సమష్టి వ్యవసాయ క్షేత్రాల స్థానంలో భూమిపై, ఉత్పత్తిపై వ్యక్తులకు చట్టపరమైన హక్కుల్ని కల్పించారన్నారు. ఆర్థికవృద్ధికి చట్టబద్ధపాలన కీలకమని చరిత్ర కూడా నిరూపించిందన్నారు. ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవం కూడా చట్టబద్ధపాలనతోనే విజయం సాధించిందన్నారు. పేటెంట్లను, ఆస్తి హక్కుల్ని కల్పిస్తూ అప్పటి బ్రిటన్ ప్రభుత్వం చట్టాలు చేసిందన్నారు. విశ్వసనీయత గల నాయకత్వం చట్టబద్ధపాలనకు దోహదం చేస్తుందన్నారు. ఉచిత విద్యుత్తు, నీరు, ఇతర ప్రోత్సాహకాల్ని ఇచ్చినా కూడా చట్టబద్ధపాలన ఉంటేనే పెట్టుబడులు పెరుగుతాయన్నారు. గత కొంతకాలంగా చైనా పట్ల అపనమ్మకం పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడులు భారత్‌కు వస్తాయని భావించారని, కానీ మలేషియా, థాయ్‌లాండ్, ఫిలిప్పిన్స్, వియత్నాం తదితర దేశాలు పరిశ్రమలు మళ్లాయన్నారు. ఆర్థిక వృద్ధి మన దేశానికి ఇప్పుడు ఎంతో అవసరమని, ఇందుకు చట్టబద్ధపాలనను మెరుగుపరచుకోవటం అవసరమని అన్నారు.

జయప్రకాష్ నారాయణ్ ప్రారంభోపన్యాసం

చేస్తూ, చట్టబద్ధపాలనను మెరుగుపరచుకుంటేనే ఆర్థిక వృద్ధి, యువతకు ఉపాధి, ఆదాయావకాశాలు సాధ్యమవుతాయని, చట్టబద్ధపాలనకు సంబంధించి రాజ్యాంగ చట్టం, ఆర్థిక వృద్ధి అనే ప్రధానాంశాలను చర్చించేందుకే ఆయా అంశాల్లో నిష్ణాతులైన జస్టిస్ వెంకటాచలయ్య, దువ్వూరి సుబ్బారావులను ప్రారంభ సమావేశానికి ఆహ్వానించామన్నారు. ఇది ఐడీఏడబ్ల్యూ రెండవ జాతీయ సదస్సు అని, ఈ సదస్సులో రాజ్యాంగపరమైన అన్ని అంశాలనూ చర్చించటం లేదని, ఆచరణసాధ్యమైన, వెంటనే అమలు చేయగల, పెద్ద మార్పులు తేగల పోలీసు, ప్రాసిక్యూషన్, ప్రొసీజరల్ చట్టాలు, న్యాయవ్యవస్థలో సవాళ్లపై మాత్రమే చర్చిస్తున్నామన్నారు. అసాధ్యమైన ఆదర్శం సుసాధ్యమైన మంచికి శత్రువు కాకూడదన్నారు. మన దేశంలో ప్రజలు శాంతిసామరస్యాలను కోరుకునేవారు కావటంతో ఇతర దేశాలతో పోలిస్తే మన వద్ద తక్కువ నేరాలు జరుగుతున్నా కూడా కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మన కిందిస్థాయి కోర్టులలో దాదాపు 3.5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇందులో 99 లక్షల సివిల్ కేసులు, 2.7 కోట్ల క్రిమినల్ కేసులు. హైకోర్టుల పరిధిలో 50 లక్షల పెండింగ్ కేసులున్నాయన్నారు. ఈ కేసులు ఎప్పటికి పరిష్కారమవుతాయో తెలియక బాధితులు వేదన చెందుతున్నారన్నారు. క్రిమినల్ కేసుల సంఖ్య సివిల్ కేసుల కంటే చాలా ఎక్కువగా ఉందని, ప్రజలు సివిల్ వివాదాల పరిష్కారానికి కోర్టులకెళ్లటం కన్నా కోర్టుల బయట పరిష్కారం వైపు మొగ్గుచూపుతున్నారనటానికి ఇది నిదర్శనమన్నారు. హైకోర్టుల్లో సగటున ఒక్కో జడ్జి ఏటా 3,500 కేసుల్లో తీర్పులిస్తున్నారని, దీనివల్ల తీర్పుల్లో నాణ్యత లోపిస్తోందన్నారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, ఎవరికి వారు అనే జీవనశైలి పెరగటం సామాజిక కట్టుబాట్లు బలహీనపడటం మన దేశ చట్టబద్ధపాలనకు పెద్దసవాలుగా మారుతున్నాయన్నారు. కేవలం ఈ సదస్సులో చర్చకే పరిమితం కాకుండా ఇందులో ఏకాభిప్రాయం సాధించిన అంశాల సాధనకు కూడా పాల్గొన్నవారంతా కృషి చేయాలని కోరారు. ఈ మార్పుల్ని సాధించాలని, సాధిస్తామని అన్నారు.

ప్రొఫెసర్ రాజశేఖర్ ఎఫ్‌డీఆర్ ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ.. జాతీయ విద్యావిధానానికనుగుణంగా ఎఫ్‌డీఆర్, ఐఎస్‌బీ, హెచ్‌సీయూ కాంబినేషన్‌లా వాణిజ్యం, సమాజం, విద్యార్జన కలగలసిన కోర్సుల్ని రూపొందించాలన్నారు. నేరాలకు పేదలు, వలస కార్మికులు కారణమనే ధోరణి స్థానంలో చట్టబద్ధపాలనను బలోపేతం చేసి సమాజంలో విశ్వాసాన్ని పెంచాలన్నారు. జేపీ సూచించినట్లు ఆశావాదంతో కూడిన, ఆచరణసాధ్యమైన పరిష్కారాలు ఇప్పుడు ఎంతో అవసరమన్నారు.

చట్టబద్ధపాలన కొరవడటం వల్ల నిజాయతీగా ఆదాయం పొందేవారు నష్టపోతారని అశ్విని ఛత్రే అన్నారు. భారత్‌లో చట్టబద్ధపాలనపై దాదాపు 60 మంది సుప్రసిద్ధ నిష్ణాతులతో ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్ వేదికగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, వర్చువల్‌గా సదస్సును నిర్వహించినా సమావేశంలో పాల్గొన్నవారిలో ఎక్కడా ఉత్సాహం, ఉత్సుకత తగ్గలేదని అభినందించారు.

# పోలీసింగ్‌కు భయం స్థానంలో సహకారం ప్రాతిపదిక కావాలి

చట్టబద్ధపాలన అమలులో ముందు కనిపించేది పోలీసులేనని, కానీ బ్రిటిష్ కాలంనాటి పద్ధతులు, పనితీరుతో ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయని కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి ఎం. పద్మనాభయ్య అన్నారు. పోలీసు వ్యవస్థ ఆధునికీకరణ అంటే కంప్యూటర్లు, సామాగ్రి మాత్రమే కాదని, చట్టబద్ధపాలనను, రాజ్యాంగ పీఠిక స్ఫూర్తిని నిలబెట్టే వ్యవస్థీకృత మార్పులని అన్నారు. పోలీసులు ప్రజలకు గౌరవాన్నిస్తూ, నేరాల్ని, నేరాల పట్ల భయాన్ని తగ్గించాలన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) మొదటి రోజు సమావేశంలో 'ఆధునిక పోలీసింగ్–సవాళ్ల'పై ఫిబ్రవరి 20 మధ్యాహ్నం జరిగిన చర్చకు పద్మనాభయ్య అధ్యక్షత వహించారు. కామన్వెల్త్ సీనియర్ సలహాదారు మజ దారువాలా, ఎస్‌విపి జాతీయ పోలీసు అకాడమీ మాజీ డైరెక్టర్ కమల్ కుమార్, మెట్రోపాలిటన్ పోలీస్ లండన్ చీఫ్ సూపరింటెండెంట్ రాజ్ ఎస్ కోహ్లి, కేరళ మాజీ డీజీపీ జాకబ్ పున్నోస్, ఉత్తరప్రదేశ్ మాజీ డీజీపీ వి.ఎన్ రాయ్ చర్చలో పాల్గొన్నారు.**

శాంతి భద్రతల్ని పరిరక్షించలేని రాజ్యం విఫల రాజ్యమైతే.. అణచివేతను నియంత్రణకు సాధనంగా ఉపయోగించే రాజ్యం పోలీసు రాజ్యమని పద్మనాభయ్య అన్నారు. 1857 తిరుగుబాటు నేపథ్యంలో బ్రిటిష్ పాలకులు 1861లో ఏర్పాటు చేసిన పోలీసు వ్యవస్థనే స్వతంత్రం వచ్చాక కూడా కొనసాగిస్తున్నారన్నారు. 150 ఏళ్ల క్రితం నాటి అణచివేత పద్ధతులే కొనసాగుతున్నాయన్నారు. మాజీ డీజీపీ వేసిన కేసులో 2006లో సుప్రీంకోర్టు స్పష్టమైన సంస్కరణల్ని తీర్పులో సూచించినా ఇప్పటికీ అత్యధిక రాష్ట్రాల్లో పోలీసు వ్యవస్థ ఆధునికీకరణ మొదలవలేదన్నారు. 2011లో కేరళలో పోలీసు సంస్కరణలు మొదలయ్యాయని, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి చోట్ల కూడా మార్పులు తెచ్చారన్నారు. కానీ కేరళలో మాత్రమే సుప్రీంకోర్టు తీర్పుకు తగ్గ స్థాయిలో పోలీసు వ్యవస్థను ఆధునికీకరణ జరిగిందన్నారు. పోలీస్ యాక్ట్‌లాంటి ఒకే రకం చట్టాలతో పనిచేస్తున్నా, పోలీసుల పనితీరు రాష్ట్రాలవారీగా మారిపోతోందన్నారు. పోలీసులు ప్రజాస్వామ్య స్ఫూర్తితో పనిచేసే చర్యల్ని అన్ని రాష్ట్రాలూ అమలు చేయాలన్నారు. పోలీసు వ్యవస్థలో 84 శాతం మంది హెడ్‌కానిస్టేబుల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయిలో పనిచేసేవారేనని, వారికి ఐపీసీ, సీఆర్‌పీసీ, స్థానిక చట్టాలు, ఫోరెన్సిక్ సైన్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానం అందించాలన్నారు. దాదాపు 23% కేసుల్లో వాస్తవాలు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేక కొట్టివేస్తున్నారని, ఇందుకు సిబ్బందిలో నైపుణ్యాల కొరతే కారణమన్నారు. అభ్యర్థులను పాఠశాల విద్య పూర్తయిన వెంటనే రిక్రూట్ చేసుకుని, 3 ఏళ్ల పోలీస్ శిక్షణనివ్వాలన్నారు. ఆ తర్వాత అవసరమైతే మరో 6 నెలల ప్రత్యేక నైపుణ్యాల శిక్షణనిచ్చి వివిధ స్థాయిల్లో పోస్టింగ్ ఇవ్వాలన్నారు. పోలీసుల పనితీరు, గణాంకాలను సమగ్రంగా ప్రజల ముందుంచే వార్షిక నివేదికలు విడుదల కావటం లేదన్నారు. పోలీసు యంత్రాంగం పనితీరును బేరీజు వేయటానికి, వ్యవస్థను మెరుగుపరచటానికి ఎటువంటి చర్యలు కావాలో తెలుసుకోవటానికి అటువంటి నివేదికలు అవసరమన్నారు. నేరస్మృతుల్లో ఉన్న 372 నేరాల్లో 250 నేరాలని పోలీసులు పరిశోధించే కాగ్నిజిబుల్ నేరాలుగా గుర్తించారన్నారు. నాన్‌కాగ్నిజిబుల్ కేసులలో చాలా వరకు డాక్యుమెంట్ల ఫోర్జరీ వంటి వైట్‌కాలర్ నేరాలన్నారు. ఇవి పెరిగిపోతున్నందున నాన్‌కాగ్నిజిబుల్ విభాగం నేరాలపై పునస్సమీక్ష అవసరమన్నారు. పోలీసు వ్యవస్థలో వైఫల్యాలకు కేవలం రాజకీయ నాయకులను నిందించటం తగదని, ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో కృషి చేస్తే కేరళ తరహాలో మార్పుల్ని సాధించవచ్చన్నారు.

మజ దారువాలా కామన్ కాజ్, సీఎస్‌డీఎస్ సర్వే అధ్యయనాలను ఉటంకిస్తూ లోపాల్ని వివరించారు. పోలీసుల పట్ల ప్రజల్లో భయం, అసంతృప్తి ఉండగా, పోలీసులు తమను తాము బలగాలు అనుకుంటున్నారు తప్ప సేవకులు అనుకోవటం లేదని చెప్పారు. కేవలం 15% ప్రజలు మాత్రమే పోలీసు సేవల్ని ఏదోకరకంగా ఉపయోగించుకుంటున్నారని, మిగతావారు పోలీసు స్టేషన్లకు దూరంగా ఉండాలని, తమ భార్య, కూతురు ఠాణాకు వెళ్లకూడదని కోరుకుంటున్నారన్నారు. కులం, మతం, వర్గం, మహిళ ప్రాతిపదికన వివక్షలు, రాజకీయ జోక్యం ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతున్నాయన్నారు. పితృస్వామ్య వ్యవస్థ ప్రభావం కారణంగా సమన్యాయానికి మహిళలు దూరమవుతున్నారన్నారు. అత్యాచారాలపై సోషల్ మీడియా కామెంట్లు చూస్తే ఈ వివక్ష ఎంతగా పాతుకుపోయి ఉందో అర్థమవుతుందన్నారు. చట్టబద్ధపాలన తమ మౌలిక బాధ్యత అని పోలీసులు అనుకోవటం లేదన్నారు. ఎఫ్‌ఐఆర్‌ల కోసం లంచం ఇచ్చామని మూడో వంతు ప్రజలు చెప్పారన్నారు. వ్యవస్థీకృత మార్పులు జరిగితేనే, అవి సంస్కృతిలో భాగమైతేనే పరిస్థితులు మారతాయన్నారు. పోలీసు స్టేషన్లు ప్రజాసేవాకేంద్రాలుగా విలసిల్లే సంస్కరణలు అత్యవసరమన్నారు.

పోలీసు వ్యవస్థలో బయటకు కన్పించని సమస్యల గురించి కమల్ కుమార్ వివరించారు. సిబ్బంది తక్కువ కావటం, బ్రిటిష్ కాలంలోలా సెలవలు లేకుండా పనిచేయటం, వేతనాలు, శిక్షణ, మౌలిక వసతులు, ఫోరెన్సిక్ సదుపాయాల కొరత తదితర అంశాలను ప్రస్తావించారు. వీటి

INDIAN DEMOCRACY AT WORK
FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB | Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

మధ్య తక్షణ ఫలితాలను సాధించటం కోసం పోలీసులు బండపద్ధతులను అనుసరిస్తున్నారన్నారు. వీటికి తోడు ట్రాన్స్‌ఫర్ల భయం వల్ల రాజకీయ నాయకులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. పోలీసుల విధినిర్వహణను ప్రభావితం చేసే రాజకీయ జోక్యాన్ని నిలువరించటానికి, నిజాయతీతో పని చేసే పోలీసు అధికారులు రాజకీయ క్రీడలో బలిపశువులు కాకుండా ఉండటానికి.. పటిష్టమైన సంస్థాగత ఏర్పాట్లు అవసరమన్నారు. ఒక్కో పౌరునికి 340 డాలర్ల చొప్పున అమెరికాలో పోలీసు మీద ఖర్చు చేస్తుంటే మన వద్ద పోలీసు వ్యవస్థను సంస్కరించాలన్న సంకల్పం రాజకీయంలో కొరవడుతోందన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న మహిళలు పోలీసు సిబ్బందిలో కేవలం 10% దాకానే ఉన్నారని, దీనికి రిజర్వేషన్ల పద్ధతికన్నా పోలీసు వ్యవస్థ పనితీరును సంస్కరించటం మేలన్నారు. ఈ దిశగా రాజకీయ నాయకులను, సమాజాన్ని చైతన్యపరచటం అవసరమన్నారు.

పోలీసింగ్‌కు భయం స్థానంలో సహకారం ప్రాతిపదిక కావాలని జాకబ్ పున్నోస్ అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే మాట 1990లలో ప్రారంభమైందని, దీనివల్ల రాజకీయ జోక్యం తగ్గినా పోలీసులు అవినీతిపరులు కాదనే గ్యారంటీ ఉండదని, అంతిమంగా ప్రజల సహకారం ఉంటేనే పోలీసు వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని కేరళ విజయాల్ని వివరిస్తూ చెప్పారు. కేరళలో ప్రజల భాగస్వామ్యం, పార్టీలకతీతంగా రాజకీయ నాయకత్వం స్పందించటం వల్ల పోలీసు వ్యవస్థ ఆధునికీకరణతో మెరుగైందన్నారు. స్థానిక అవసరాలు ప్రాంతానికనుగుణంగా మారుతుంటాయని, ఎక్కడికక్కడ ప్రజల భాగస్వామ్యంతో పోలీసు వ్యవస్థను అనుసంధానించటం వల్ల మంచి ఫలితాలు వచ్చాయన్నారు. తొలుత పోలీసు సంస్కరణల్ని అందరూ సందేహించారని, కానీ వాటి అమలు వల్ల ప్రజలు, పోలీసులు, ప్రభుత్వం ఇలా అందరూ లబ్ధిపొందారన్నారు. ప్రజల భాగస్వామ్యం వల్ల పోలీసుల ఆలోచనాతీరు కూడా మారిందని, ఆత్మవిశ్వాసంతో స్వతంత్రంగా కేసుల్ని పరిష్కరించే సామర్థ్యం ఇనుమడించిందన్నారు. రాష్ట్రంలో పోలీసు స్టేషన్లో పౌరుల హక్కుల్ని స్పష్టంగా పేర్కొని అమలు చేస్తారని, పోలీసు చర్యలపై ఆడియో, వీడియో టేప్‌లను ప్రజలు డిమాండ్ చేయవచ్చన్నారు. ప్రజలు, పోలీసుల మధ్య సహకార సంస్కృతిని పెంచేందుకు పాఠశాలల్లో విద్యార్థి పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు స్వేచ్ఛగా పోలీసు స్టేషన్‌కి వెళ్లగలగటమే ఆరోగ్యకర పోలీసు వ్యవస్థకు సంకేతమన్నారు.

చట్టబద్ధపాలనను ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోవటం లేదని, పోలీసు శిక్షణా సంస్థల్లో పోస్టింగుల్ని శిక్షగా భావిస్తుంటారని వి.ఎన్ రాయ్ అన్నారు. హైదరాబాద్‌లో దిశ కేసులో నిందితుల్ని ఎన్‌కౌంటర్ చేస్తే ప్రజలు సంబరాలు చేసుకున్నారని, మనకు ఎలాంటి సమాజం కావాలో ప్రజలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

రాజ్ కోహ్లి మాట్లాడుతూ, బ్రిటన్‌లో నేరాలు అనే మాటను తీసివేసి సంక్షోభాల పరిష్కారంగా కేసులను దర్యాప్తు చేస్తారని, మూడింట రెండొంతుల పోలీసులు ఇలా పరిష్కర్తలుగా పనిచేస్తారన్నారు. ఎలాంటి పోలీసు వ్యవస్థ కావాల్లో ప్రజల్ని అడగాలని, పోలీసు అధికారిని మార్చాలన్నా ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. చట్టాలతోపాటు సాంస్కృతిక మార్పుల కోసం కృషి చేస్తే పోలీసు వ్యవస్థలో వేగంగా మార్పులు సాధ్యమవుతాయన్నారు.

రాజకీయాలకతీతంగా పార్టీలు, ప్రజలు కలిసి కేరళలో సాధించిన మార్పుల్ని దేశవ్యాప్తంగా తెచ్చేందుకు కృషి చేయాలని చర్చ అనంతరం ప్రశ్నోత్తరాల్లో పాల్గొన్న ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన పోలీసు సేవలు**

వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ సమర్థవంతంగా వినియోగించుకోవటంపై ఉన్నతస్థాయి అధికారులకు అవగాహన ఉండటం లేదని అరుణ బహుగుణ అన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ఎఫ్‌డీఆర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) మొదటిరోజు సమావేశంలో 'ఆధునిక పోలీసింగ్-సవాళ్లు'పై ఫిబ్రవరి 20 సాయంత్రం జరిగిన చర్చకు జాతీయ పోలీసు అకాడమీ మాజీ డైరెక్టర్ అరుణ బహుగుణ అధ్యక్షత వహించారు. సీనియర్ సలహాదారు, ఫోరెన్సిక్ నిపుణుడు, ట్రూత్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు డా॥ గాంధీ పి.సి కాజా, తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డి, ఫ్రీలాన్స్ జర్నలిస్టు మొహిత్ రావు, కామన్‌కాజ్ డైరెక్టర్ డా॥ విపిన్ ముద్గల్ ప్యానలిస్టులుగా పాల్గొన్నారు.**

పోలీసు స్టేషన్లను ఆధునికీకరించటమంటే సదుపాయాల కల్పన మాత్రమే కాదని, పోలీసుల పనితీరు మెరుగుపడాలని అరుణ బహుగుణ అన్నారు. మొహిత్‌రావు మాట్లాడుతూ, ఫోరెన్సిక్ విభాగాల్ని బలోపేతం చేయటం దోషుల నిరూపణకు ఎంతో ముఖ్యమన్నారు. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సరిగా వినియోగించుకుంటే దోషులు తప్పించుకోవటం దాదాపు సాధ్యం కాదని గాంధీ అన్నారు. పెద్ద సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలోనే నరసరావుపేటలో ఒక కేసును ఛేదించిన ఉదంతాన్ని వివరించారు. పోలీసుల కొరత వాస్తవమేనని, కానీ ఉన్న సిబ్బందితో కూడా మెరుగైన ఫలితాలు సాధ్యమన్నారు. పోలీసుల ప్రవర్తన ఎప్పుడూ నియమావళికి అనుగుణంగా ఉండని మాట నిజమేనని, కానీ అరకొర సదుపాయాల మధ్య కూడా వాళ్లు గుర్తించదగ్గరీతిలో నెట్టుకొస్తున్నారని విపుల్ ముద్గల్ అన్నారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ స్థాయిలోనే చాలా సమస్యలు పరిష్కారమవుతాయని, కానీ ప్రజలే ముందుకు రావటం లేదన్నారు. పోలీస్ స్టేషన్‌కి వెళ్లటం పరువునష్టమని ఇవ్వాళ్టికీ ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు తాము పోలీస్ స్టేషన్ల రూపురేఖల్ని మార్చి ఓపెన్ క్యాబిన్లు, రిసెప్షన్లు ప్రారంభించామన్నారు. దీనివల్ల ఫిర్యాదు చేసేవారి సంఖ్య పెరిగిందన్నారు. సమాజం ముందుకు రాకుంటే పోలీసులు కూడా ఏమీ చేయలేరని, ప్రజల భాగస్వామ్యంతోనే భద్రత సహా పలు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గత ఏడేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో పోలీసు యంత్రాంగం సామర్థ్యాన్ని పెంచటానికి, పోలీసు స్టేషన్ స్థాయిలో పనితీరు మెరుగుపరచటానికి, చట్టబద్ధపాలనని సక్రమంగా అమలు చేయటానికి ప్రభుత్వ ప్రోత్సాహంతో చేపట్టిన సంస్కరణల్ని, కొత్త పథకాలని మహేందర్‌రెడ్డి వివరించారు.

# నేర పరిశోధన, ప్రాసిక్యూషన్‌లను రాజకీయం నుంచి వేరు చేయాలి

## మరో కమిటీ అవసరం లేకుండా సంస్కరణల్ని సాధిద్దాం: ఐడీఏడబ్ల్యూ రెండో రోజు సదస్సులో వక్తలు




ప్రజలను కాపాడే యంత్రాంగంగా కాకుండా అణచివేసే పారామిలటరీ దళాలుగా పోలీసులు పనిచేయాలనే వలసకాలపు పోలీసు చట్టం, రాజ్యవ్యవస్థ విధులను ఆమోదిస్తూనే పోలీసులు రికార్డు చేసిన వాంగ్మూలాన్ని కోర్టులు నమ్మకూడదని చెప్పే సీఆర్‌పీసీ చట్టం వంటి లోపాల్ని స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు దాటినా సరిదిద్దుకోకపోవటం వల్ల సమన్యాయం అందించటంలో విఫలమవుతున్నామని 21వ లా కమిషన్ చైర్మన్ జస్టిస్ బి.ఎస్ చౌహాన్ అన్నారు. పరిస్థితిని చక్కదిద్దటానికి లా కమిషన్లు, రెబెరో కమిషన్, పద్మనాభయ్య కమిటీ, మాలిమత్ కమిటీ ఇలా అనేక సంఘాలు నిర్దిష్ట సిఫార్సుల్ని చేసినా ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. నేరపరిశోధనను రాజకీయం నుంచి విడదీయాలని ప్రతి కమిటీ సిఫార్సు చేసినా ఇంతవరకూ అమలుకు రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించ లేదన్నారు. నివేదకల్ని అమలు చేసే సామర్థ్యంలేని ప్రభుత్వాలు.. కమిషన్లు, కమిటీలను నియమించటమెందుకో అర్థం కాదన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) రెండవ రోజు సమావేశంలో 'నేర పరిశోధన, ప్రాసిక్యూషన్ బలోపేతం'పై ఫిబ్రవరి 21 ఉదయం జరిగిన చర్చకు జస్టిస్ చౌహాన్ అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి సి. ఆంజనేయరెడ్డి, సీబీఐ మాజీ డైరెక్టర్ డి.ఆర్ కార్తికేయన్, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, బోంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎల్ తహలియాని చర్చలో పాల్గొన్నారు.**

జస్టిస్ చౌహాన్ మాట్లాడుతూ, పోలీసు సంస్కరణలపై 2006లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలుతీరుపై దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్లలో కూడా డీజీపీ పదవీకాలం వంటి అంశాల గురించే తప్ప నేర దర్యాప్తులో పోలీసులకు స్వతంత్ర ప్రతిపత్తి అనే ప్రధాన డిమాండ్ లేదన్నారు. రాజస్థాన్‌లో కనిష్టంగా 26%, మహారాష్ట్రలో గరిష్టంగా 60% ఎమ్మెల్యేలు క్రిమినల్ నేరాల్లో విచారణ ఎదుర్కొంటున్నారని 2020లో 'ఔట్‌లుక్'లో ప్రచురితమైన ఓ నివేదిక తెలిపిందని, నేర నేపథ్యమున్న ప్రజాప్రతినిధుల నుంచి పోలీసు సంస్కరణల్ని ఎలా ఆశించగలమన్నారు. కేసులు జీవితకాలంలో తేలటం లేదన్నారు. లలిత్ నారాయణ్ మిశ్రా, రాజా మాన్‌సింగ్ హత్య కేసుల్లో శిక్ష పడటానికి 30–40 ఏళ్లు పట్టిందన్నారు. దీనికితోడు మీడియా సమాంతర విచారణ సమస్య ఉందన్నారు. ఇటీవల తబ్లిగి జమాతే, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఉదంతాల్లో మీడియా కథనాలు దర్యాప్తు తీరును ప్రభావితం చేశాయన్నారు. నేర నిరూపణలో కీలకమైన ప్రాసిక్యూషన్‌లో ఎలాంటి వారిని నియమించాలో, ఎంతమంది ప్రాసిక్యూటర్లు అవసరమో సుప్రీంకోర్టు దాదాపు 60 తీర్పులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వాలు బేఖాతరు చేస్తున్నాయన్నారు. సొంత కులం, స్వప్రయోజనాలకు ఉపయోగపడటం కోసం అనుభవం, అవగాహన లేనివారితో రాజకీయ నియామకాలు చేస్తున్నారన్నారు. ప్రాసిక్యూషన్ బలోపేతానికి సీఆర్‌పీసీలో కొత్తగా చేర్చిన '25ఎ' ను అనుసరించి డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌ను ఏర్పాటు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖంగా లేవన్నారు. కేవలం అర్హులతో ఖాళీల్ని భర్తీ చేయటం కాకుండా సమర్థులైనవారిని

INDIAN DEMOCRACY AT WORK
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB | Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

న్యాయమూర్తులుగా ఎంపిక చేయాలన్నారు.

ప్రజలకు, పోలీసులకు మధ్య అపనమ్మకం ఉందని, పోలీసు స్టేషన్‌కి వెళ్లినవారికి చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని జస్టిస్ తహిలియాని అన్నారు. శాంతి భద్రతల విభాగంలో పనిచేసినవారిని కొన్నేళ్ల తర్వాత నేర దర్యాప్తు విభాగంలో నియమించటం వల్ల ఫలితాలు రావటం లేదన్నారు. ఎఫ్ఐఆర్ ఎందుకు రాయాలి, ఎందుకు రాయకూడదో కూడా వారికి తెలియటం లేదన్నారు. ఒక విభాగం నుంచి ఇంకో విభాగానికి మార్చకుండా నేరపరిశోధన విభాగానికి ప్రత్యేక నియామకాలు, శిక్షణ ఉండాలన్నారు. పోలీసుల శిక్షణ కూడా లోపభూయిష్ట వ్యవస్థకనుగుణంగానే జరుగుతుండటం వల్ల ప్రమాణాలు కొరవడుతున్నాయన్నారు. కేసుల సంఖ్యను తక్కువగా చూపటానికి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోవటం కూడా సమస్యలో భాగంగా తయారైందన్నారు. కోర్టులకు, బాధితులకు వారధిగా ఉండే ప్రాసిక్యూషన్‌ను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పటిష్ట ప్రాసిక్యూషన్ వ్యవస్థకు సంస్థాగత ఏర్పాట్లు అవసరమన్నారు.

జేపీ మాట్లాడుతూ, భిన్నత్వం, రకరకాల సంక్లిష్టతలు ఉన్నప్పటికీ దేశంలో పెద్ద కల్లోలాలు లేకుండా ఉండటానికి మన సమాజంతోపాటు పోలీసులను కూడా అభినందించాలన్నారు. అయితే నగరీకరణ వేగంగా పెరుగుతూ, మనుషుల మధ్య వ్యక్తిగత బంధాలు సడలుతున్న నేపథ్యంలో శాంతియుత వాతావరణం ఎల్లకాలం ఇలాగే కొనసాగదన్నారు. సిబ్బందిలో వృత్తి నైపుణ్యం, చట్టబద్ధపాలనకు తగిన పద్ధతులకు సంస్కరణల్ని అమలు చేయకుంటే ఆర్థిక వృద్ధితోపాటు సామాజిక సామరస్యత కూడా దెబ్బతింటుందన్నారు. ఇటీవల గురుగావ్‌లో అశోక్ కుమార్ అనే బస్ కండక్టర్‌పై కేసు బనాయించటం, ఉత్తరప్రదేశ్‌లో హత్రాస్ కేసు నేర పరిశోధనను పక్కదోవ మళ్లించే ప్రయత్నం పోలీసుల చట్టవ్యతిరేక పద్ధతులకు పరాకాష్ఠలని, నేరాల్ని బలవంతంగా ఒప్పించకపోతే మన దేశంలో శిక్షల శాతం ఇంకా తక్కువగా ఉంటుందన్నారు. పోలీసుల పట్ల అపనమ్మకం వల్ల అధికారాలనిస్తే ఇంకా అణగదొక్కుతారన్న భయం కలుగుతుందని, కానీ వారికి జవాబుదారీతనంతో కూడిన అధికారాల్ని ఇవ్వటమే పరిష్కారమన్నారు. దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విధులు.. పాక్షిక న్యాయ (క్వాజీ జ్యుడీషియల్) స్వభావం కలిగినవి అయినందున అవి పక్షపాతాలకు అతీతంగా ఉండాలని, స్వతంత్రంగా స్వయంప్రతిపత్తితో ఉండాలన్నారు. నేరాల్లో 80% చిన్న స్థాయివని, మూడేళ్లు ఆపై బడిన శిక్షకు అర్హమైన నేరాలు 20% ఉంటాయని, ఇలాంటి పెద్ద నేరాలను దర్యాప్తు చేసేందుకు, ప్రాసిక్యూషన్‌ను పర్యవేక్షించేందుకు రాజకీయాలకతీతంగా స్వతంత్ర ప్రతిపత్తి, పారదర్శకత, జవాబుదారీతనం గల సంస్థగా లోకాయుక్త తరహాలో సీబీ సీఐడీని పటిష్ఠం చేయాలన్నారు. దీనికి హైకోర్టు లేదా సుప్రీంకోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి నేతృత్వం వహించాలన్నారు. కొలీజియంలో ముఖ్యమంత్రి, న్యాయవ్యవస్థ ప్రతినిధి, ఎక్స్‌అఫీషియోగా మాజీ డీజీపీ వంటి వారు ఉంటారన్నారు. పోలీసు వ్యవస్థలోని 80 శాతం పోలీసులు రాజకీయ వ్యవస్థ పర్యవేక్షణలో శాంతి భద్రతలు, చిన్న నేరాల పరిష్కారంపై పనిచేస్తారని, మిగిలిన 20 శాతం సీబీ సీఐడీ పర్యవేక్షణలో దర్యాప్తు అధికారులుగా ఉంటారన్నారు. ప్రజల నుంచి ఎన్నికైన రాజకీయ నాయకులను విస్మరించి మార్పులు సాధించటం సరైన పద్ధతి కాదన్నారు. అలాగే రాజకీయ వ్యవస్థ నుంచి పోలీసుల్ని పూర్తిగా వేరు చేయాలనటం ఆచరణసాధ్యం కూడా కాదన్నారు. ప్రాసిక్యూషన్‌ను కూడా రాజకీయ జోక్యం నుంచి విముక్తి చేయాలని, న్యాయమూర్తుల సంఖ్యను పెంచి వారిలో కొందరిని ఐదేళ్లపాటు జిల్లా అటార్నీలుగా నియమించాలన్నారు. న్యాయమూర్తులు న్యాయ కార్యదర్శులుగా నియమితులయ్యే సంప్రదాయం ఇప్పటికే ఉన్నందున వారిని జిల్లా అటార్నీలుగా నియమించటం అసాధారణమేమీ కాదన్నారు. దీనివల్ల ప్రాసిక్యూషన్ పటిష్ఠమై నేరనిరూపణలో స్వతంత్రంగా వ్యవహరించగలుగుతున్నారు. ఇవన్నీ ఆచరణసాధ్యమైనవి, చేయదగినవి అన్నారు. వీటి కోసం కలిసి కృషి చేద్దామన్నారు.

నేరపరిశోధనను ప్రాసిక్యూషన్ నుంచి విడదీయలేమని కార్తికేయన్ అన్నారు. నేరాలు పెరుగుతున్నాయని, కానీ మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు పోలీసు, న్యాయ వ్యవస్థల్లో సంస్కరణలు రాకపోవటం వల్ల ప్రజల్లో విశ్వాసం సడలుతోందన్నారు. చిన్న నేరాల స్థాయిలోనే అదుపు చేస్తే పెద్ద నేరాలు జరగవని, నేరాల నియంత్రణ, ప్రాథమిక దశలోనే అదుపు చేసే పద్ధతులు మనకు లోపించాయన్నారు. నేరాలకు పాల్పడితే తక్కువ రిస్కు, ఎక్కువ ప్రయోజనం అనే పరిస్థితులు ప్రబలుతున్నాయన్నారు. దోషులు తప్పించుకోవటం, నిర్దోషులు శిక్షించబడటం మధ్య తేడా ఉండదన్నారు. పోలీసుల బాధ్యతల్లో రాజకీయ జోక్యం పెరిగిందని, వ్యవస్థ మొత్తాన్నీ ప్రక్షాళన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చట్టబద్ధపాలనకు కావలసిన సంస్కరణలకు మరో కమిటీ అవసరం లేకుండా మార్పులు తేవాలని జేపీని కోరారు. ఇందుకు తామంతా అండగా నిలుస్తామన్నారు.

ఆంజనేయరెడ్డి ప్రసంగిస్తూ, మన దేశంలో పోలీసులకు అపరిమిత అధికారాలను కట్టబెట్టారని, అవసరంలేని కేసుల్లో కూడా అరెస్టులు చేస్తున్నారన్నారు. ఎవరో ఒక పలుకుబడి గల వ్యక్తి చేత చెప్పించుకోకుండా పోలీసు స్టేషన్‌కు వెళ్లే సాహసం ప్రజలు చేయలేకపోతున్నారన్నారు. నేర న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం తగ్గటం వల్లే ఎన్‌కౌంటర్లకు జనం చప్పట్లు కొడుతున్నారన్నారు. మనకున్న చట్టబద్ధపాలన వ్యవస్థల్లో పోలీసులకే శిక్షణ మెరుగ్గా ఉందని, కానీ వలస కాలం నాటి పోలీసు వ్యవస్థ వల్ల ప్రజలకు మాత్రం న్యాయం అందటం లేదన్నారు. తెలంగాణ పోలీసుల పనితీరు దేశంలోనే మెరుగ్గా ఉన్నా, తెలంగాణ, ఏపీల్లో పోలీసు స్టేషన్లలో ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఎఫ్ఐఆర్‌ల నమోదు జరుగుతోందన్నారు. ప్రత్యర్థి పార్టీలను వేధించటంలో పోలీసులు పావులుగా మారారన్నారు. సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టం, ప్రాసిక్యూషన్ ఇలా అన్నిటిలో సమూల మార్పులు రావాలని, మాలిమత్ కమిటీ సిఫార్సుల్ని అమలు చేయాలని అన్నారు.

## ఆత్మనిర్భర భారత్‌కి చట్టబద్ధపాలన ఎంతో అవసరం.. ఈజ్ ఆఫ్ జస్టిస్‌కు చట్టాలను సంస్కరించే

# ప్రయత్నం ప్రారంభించాం: ఐడీఏడబ్ల్యూ సదస్సులో కిషన్‌రెడ్డి

'ఆత్మనిర్భర భారత్'కి చట్టబద్ధపాలన ఎంతో ముఖ్యమని, అందుకే 1860ల నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ చట్టాలను సంస్కరించేందుకు అయిదుగురు సభ్యుల కమిటీని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్)లో రెండవరోజు 'నేరన్యాయవ్యవస్థలో సంస్కరణల'పై ఫిబ్రవరి 21 సాయంత్రం జరిగిన చర్చలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్ రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. 'నల్సార్' మాజీ వైస్ ఛాన్సలర్ డా॥ రణబీర్‌సింగ్, జైళ్ల శాఖ మాజీ ఐజీ డా॥ ఎంఆర్ అహ్మద్, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్యానలిస్టులుగా పాల్గొన్నారు.**

కాలం ఎంతో మారిందని, నేరాలు సరిహద్దులు దాటాయని, మారిన పరిస్థితులకనుగుణంగా 21వ శతాబ్దపు చట్టాలు మనకు అవసరమని కిషన్‌రెడ్డి అన్నారు. నేరస్తులకు శిక్షలు పడేలా, బాధితులకు న్యాయం అందేలా చేయటంతోపాటు నేరాలను నివారించేలా నూతన క్రిమినల్ న్యాయవ్యవస్థ ఉండాలన్నది తమ సంకల్పమన్నారు. కోర్టుల్లో కేసులు ఏళ్ల తరబడి సాగుతుండటం వల్ల నిందితులు జైళ్లలో మగ్గుతున్నారని, నిర్దోషులు శిక్ష అనుభవించకుండా ఉండాలంటే న్యాయవ్యవస్థను సంస్కరించాలన్నారు. వేగంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా న్యాయం అందించాలన్నారు. ప్రస్తుత క్రిమినల్ న్యాయవ్యవస్థలో మాలిమత్ కమిటీ పలు మార్పుల్ని సూచించిందని, వాటిని పరిగణలోకి తీసుకోవటంతోపాటు దేశవ్యాప్తంగా వివిధ న్యాయకళాశాలల్లో సమావేశాల్ని నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. కమిటీ ద్వారా అందరి సూచనలనూ పరిగణలోకి తీసుకుని ఆధునిక ప్రజాస్వామ్యానికి అనుగుణంగా సంస్కరణల్ని అమలు చేస్తామన్నారు. భారతదేశం ప్రాచీనకాలం నుంచి ధర్మాన్ని అనుసరించి చట్టాలను అమలు చేస్తుందని, పాలన చేస్తుందని, ఆ పరంపరను కొనసాగిస్తామన్నారు. శాస్త్రీయమైన రీతిలో న్యాయం అందించేందుకు ఫోరెన్సిక్, సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లను, ఇతర మౌలిక వసతుల్ని నెలకొల్పుతామన్నారు. నేరపరిశోధనకు ప్రత్యేక శిక్షణ పొందిన బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. జైళ్ల సంస్కరణలను రూపొందించి అమలు చేస్తామన్నారు. కొత్త చట్టాలను తీసుకురావటంతోపాటు కాలం చెల్లిన పాత చట్టాలను తొలగిస్తామన్నారు. న్యాయవ్యవస్థలో ఖాళీల్ని గుర్తించి నియామకాలు చేస్తామని, కొత్త పోస్టుల్ని కూడా గుర్తించి భర్తీ చేస్తామన్నారు. న్యాయవ్యవస్థలోకి మెరికల్లాంటి యువ మేధావులు రావాలన్నదే తమ ఆలోచనన్నారు.




ఈజ్ ఆఫ్ జస్టిస్ లక్ష్యమని ప్రధానమంత్రి ప్రకటించారని, ఆ దిశగా తమ ప్రభుత్వం ఇప్పటికే ట్రిపుల్ తలాక్, పోక్సో, సైబర్ భద్రత, ఫోరెన్సిక్, మహిళల రక్షణ చట్టాలు వంటివి తీసుకొచ్చిందన్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని సంస్కరించేందుకు ఉద్యమస్ఫూర్తితో సుదీర్ఘకాలంగా జయప్రకాష్ నారాయణ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

పి.ఎస్ రామ్మోహనరావు మాట్లాడుతూ, భారతదేశం జీడీపీలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నా 70 ఏళ్ల స్వతంత్ర్యం తర్వాత కూడా తలసరి ఆదాయంలో పేదదేశంగానే కొనసాగటానికి చట్టబద్ధపాలన వైఫల్యం పెద్ద కారణమన్నారు. చట్టబద్ధపాలనలో మన స్థాయి ఉన్నకొద్దీ దిగజారుతోందన్నారు. మన నేర న్యాయవ్యవస్థలోని చట్టాల వైఫల్యమే ఇందుకు కారకాలన్నారు. ఆ చట్టాలు ఆధునిక కాలానికి తగినవి కాదన్నారు. విద్య, వైద్యం, రవాణా, కమ్యూనికేషన్ రంగాల్లో మార్పులు వస్తున్నట్లే, ఐపీసీ, సీఆర్‌పీసీల్లో కూడా మార్పులు రావాలన్నారు. లేకుంటే ఆర్థికంగా కూడా దేశం భారీ మూల్యం చెల్లిస్తుందన్నారు. క్రిమినల్ న్యాయ వ్యవస్థలో మార్పుల గురించి లా కమిషన్లు పెద్దగా సూచనలు చేయలేదుగానీ, వాజ్‌పేయి హయాంలో వేసిన మాలిమత్ కమిటీ, జయప్రకాష్ నారాయణ్ సభ్యుడిగా ఉన్న రెండవ పరిపాలనా సంస్కరణల సంఘం సహా పలు కమిషన్లు విలువైన సిఫార్సులు చేశాయన్నారు. వాటిని అమలు చేసి ఉంటే ఈపాటికే మార్పులు మొదలయ్యేవన్నారు. మన నేర న్యాయవ్యవస్థలో నేరనిరూపణ ప్రాసిక్యూషన్, డిఫెన్స్‌ల మధ్య వాదనల మీదే ఆధారపడి ఉంటుందని, జడ్జి పాత్ర ఉండదని అన్నారు. పోలీసు వ్యవస్థను కూడా ప్రస్తుత చట్టాలు పరిగణలోకి తీసుకోవన్నారు. సాక్షులు కోర్టుకు హాజరుకావటంలేదనే వంకతో వాయిదాల మీద వాయిదాలు వేస్తుంటారన్నారు. అసంబద్ధమైన నిబంధనల్ని మార్చి ఆధునిక అవసరాలకనుగుణంగా ఆచరణ సాధ్యమైన సంస్కరణల్ని అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ఉన్నతస్థాయి వ్యక్తులకు లభించే గౌరవాన్ని బట్టి కాకుండా సామాన్యుడికి లభించే ఆదరణను బట్టి ఒక దేశం స్థాయిని అంచనా వేయాలని నెల్సన్ మండేలా అంటుండేవారని, కానీ మన దేశంలో కేవలం పేదరికం కారణంగా జైళ్లలో అనేకమంది మగ్గుతున్నారని ఎంఆర్ అహ్మద్ అన్నారు. ఈ పరిస్థితికి

INDIAN DEMOCRACY AT WORK
FOUNDATION FOR DEMOCRATIC REFORMS | ISB | Bharti Institute of Public Policy | हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

మన వ్యవస్థలోని లోపాలే కారణమన్నారు. అవసరానికి మించి అరెస్టులు, సామాజికంగా పరిష్కరించగల సమస్యలను నేరాలుగా నిర్వచించటం, న్యాయవిచారణలో జాప్యాలు, జైళ్లలో పెట్టటం కాకుండా ఇతర పద్ధతుల్లో సంస్కరించే పద్ధతులు లేకపోవటం మొదలైనవి ఇందుకు కారణాలన్నారు. 90 రోజుల్లో చార్జిషీట్ నిబంధన సక్రమంగా అమలవటం లేదన్నారు. జైళ్లలో ఉన్నవారిలో 66 శాతం విచారణను ఎదుర్కొంటున్నవారేనన్నారు. వీరిలో 60 శాతం మంది భౌతికహాని తలపెట్టిన కేసుల్ని, 30% మంది ఆస్తి సంబంధ నేరారోపణలను ఎదుర్కొంటున్నవారన్నారు. జైళ్లను పునరావాస, సంస్కరణల కేంద్రాలుగా భారతదేశం భావిస్తుందని, కానీ సమాజంలో గ్రాడ్యుయేట్‌గా ఉన్న నేరస్తుడు జైలుకెళ్తే పోస్టు గ్రాడ్యుయేట్ అవుతాడన్న జస్టిస్ వెంకటాచలయ్య వ్యాఖ్య అతిశయోక్తి కాదన్నారు. పరివర్తన తేవటం కన్నా మనిషిని ప్రతికూలంగా తయారుచేసే వాతావరణం జైళ్లలో ఎక్కువగా ఉంటుందన్నారు. దీనికి బదులు.. బెయిలు, జరిమానాలు, వ్యక్తిగత బాండ్లతోపాటు విదేశాల్లో అమలు చేస్తున్నట్లు ఎలక్ట్రానిక్ పర్యవేక్షణలో గృహనిర్బంధం వంటి విధానాల్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు.

డా॥ రణబీర్ సింగ్ మాట్లాడుతూ, చట్టబద్ధపాలనలో సంస్కరణలు సుదీర్ఘకాలంగా వాయిదా పడుతూ వస్తున్నాయని, సుప్రీంకోర్టు సూచించిన పోలీసు సంస్కరణల్లో 90 శాతం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. సమాజంలో నేరాల సంఖ్య ఇంకా ఇంకా పెరుగుతున్నాయని, మనం అరెస్టులు, జైళ్ల పద్ధతి నుంచి మారాలన్నారు. బెయిల్ విధానాన్ని సంస్కరించాలన్నారు. న్యాయవిచారణ పద్ధతుల్ని సులభతరం చేసి త్వరగా న్యాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కోర్టుల్లో ప్రమాణం చేసి అబద్ధాలు చెప్పే ధోరణిపై చర్యలు అవసరమన్నారు. విచారణలో పారదర్శకంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలన్నారు. నేరపరిశోధనలో విశ్వసనీయతను పెంచాలన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాల్ని పాటించాలన్నారు. ఏళ్ల తరబడి కేసుల విచారణ జరుగుతుండటం వల్ల న్యాయవ్యవస్థ అంటే భయం లేకుండా పోతోందన్నారు. కేసుల విచారణను తెమల్చటానికి నిర్ణీత కాలవ్యవధి ఉండటంపై చర్చ జరగాలన్నారు. సబ్‌జైళ్ల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ఏ జిల్లా కోర్టులో విచారణ జరిగితే ఆ జిల్లా జైళ్లలోనే నిందితులను ఉంచాలన్నారు. జైళ్లన్నిటినీ వెబ్ ద్వారా కోర్టులకు అనుసంధానించి నిర్దోషులైన నిందితులకు వేగంగా న్యాయం అందించాలన్నారు. వైఫల్యాలకు పోలీసులనే నిందించటం సరికాదని, వ్యవస్థలో భాగమైన అందరూ ఇందుకు బాధ్యత తీసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సమాజం భద్రంగా ఉండాలంటే పోలీసు వ్యవస్థను బలపరచాలన్నారు. లోపాల్ని సరిచేయాలన్నారు. సంస్కరణలకు సహనంతోపాటు దీర్ఘకాలిక దృక్పథం కూడా అవసరమన్నారు.

# అసాధారణ చట్టాలకు, పోలీసులకూ జవాబుదారీతనముండాలి..

## సమస్య రాజకీయంతోనే ఎక్కువ: ఐడీఏడబ్ల్యూ జాతీయ సదస్సు మూడో రోజు సమావేశంలో వక్తలు

'పోటా', 'ఉపా', సాయుధ బలగాల చట్టం వంటి అసాధారణ శాసనాలు స్థానిక ఎమర్జెన్సీలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ ఖామ్ ఖాన్ సువాన్ హౌజింగ్ అన్నారు. చట్టబద్ధపాలన, రాజ్యవ్యవస్థ, ప్రజాస్వామ్యంపై వీటి ప్రభావాన్ని నిశితంగా బేరీజు వేయాలన్నారు. సాయుధ బలగాల బిల్లుపై 1958లో లోక్‌సభలో చర్చ జరిగినప్పుడు.. అది సాధారణ ప్రజాస్వామిక చట్టానికి సైనిక నియంతృత్వ కోరలు తొడగటంగా కొందరు సభ్యులు అభివర్ణించటాన్ని గుర్తుచేశారు. తిరిగి సాధారణ పరిస్థితులను నెలకొల్పే వరకూ ఎంతకాలమైనా అసాధారణ చట్టాలను కొనసాగించటాన్ని సుప్రీంకోర్టు కూడా తప్పు పట్టి ఆరు నెలల్లోగా సమీక్షించాలని ఆదేశించిందని, అయినా గత 60-70 ఏళ్లుగా రకరకాలుగా కొనసాగుతూనే ఉన్నాయని సోదాహరణంగా చెప్పారు. **'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) మూడవ రోజు సమావేశంలో 'అసాధారణ చట్టాల'పై ఫిబ్రవరి 22న జరిగిన చర్చకు ప్రొ. సువాన్ హౌజింగ్ అధ్యక్షత వహించారు. యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ ఉజ్వల్ కుమార్ సింగ్, మాజీ డీజీపీ అరవిందరావు, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సంభాషణల్లో పాల్గొన్నారు.**

భిన్నాభిప్రాయాలకు, నిరసనలకు అవకాశం కల్పిస్తూనే అసాధారణ చట్టాలను జవాబుదారీతనంతో వినియోగించటం, రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించటం ఎలా అన్నది ఈ సంభాషణల లక్ష్యమన్న యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ రాజనీతి విభాగ ఆచార్యుడు కె.కె కైలాష్ స్వాగత పలుకుల అనంతరం ప్రొఫెసర్ ఖామ్ ఖాన్ సువాన్ హౌజింగ్ మాట్లాడుతూ.. సాయుధ బలగాల చట్టాన్ని అమలు చేసేవారు తప్పిదాలకు పాల్పడితే మంత్రిత్వ శాఖ ప్రత్యేక అనుమతితో మాత్రమే విచారించాలన్న నిబంధన సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. మానవ హక్కులకు హానికరమన్నారు. చట్టబద్ధపాలన కోసం అమలయ్యే ఇవి ఆచరణలో చట్టబద్ధపాలనకు విఘాతంగా పరిణమిస్తుంటాయన్నారు. రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని స్తంభింపచేసి.. జీవించే హక్కు, స్వేచ్ఛలకు భంగం కలిగిస్తాయన్నారు. సాయుధ బలగాల చట్టం మిజోరాంలో ఫలితాలు సాధించిందని ప్రచారం జరిగిందని, కానీ త్వరలోనే పరిస్థితులు తారుమారయ్యాయన్నారు. మిజోరాం సహా వివిధ ఈశాన్య రాష్ట్రాల్లో ఆ చట్టం ప్రజల సామాజిక, మానసిక స్థితిగతులపై దుష్ప్రభావం చూపిందన్నారు. ఈ అసాధారణ చట్టాన్ని అధ్యయనం చేసిన నిపుణులు విధివిధానాలను పునస్సమీక్షించాలని సూచించారన్నారు. సాధారణ చట్టాలతో నియంత్రించలేని అసాధారణ పరిస్థితులు తలెత్తినప్పుడు ఉపయోగించే చట్టాలు ఎలా ఉండాలో, ప్రజాస్వామ్యంతో వైరుధ్యం లేకుండా మరింత మానవీయంగా, నాగరికంగా, పౌర సమాజ భాగస్వామ్యంతో ఎలా అమలు చేయాలో చర్చ జరగాలన్నారు.

'టాడా' చట్టం ఫలితాలు సాధించకపోవటంతో అందులో నేరాంగీకార నిబంధనను తొలగించి తీసుకువచ్చిన 'పోటా', ఆ తర్వాత తెచ్చిన 'ఉపా' మెరుగైన ఫలితాలు సాధించాయని ప్రొఫెసర్ ఉజ్వల్ కుమార్ సింగ్ అన్నారు. నేర నిరూపణ 76% దాకా ఉందన్నారు. 'ఉపా' చట్టాన్ని సంస్కరించేందుకు



2004, 2008, 2012, 2019లో సవరణలు చేశారన్నారు. కానీ సాధారణ పరిస్థితులను నెలకొల్పటం అసాధారణ చట్టాల లక్ష్యం తప్ప అసాధారణ పరిస్థితులను కొనసాగించటం కాదన్నారు. తీవ్రవాదం, అంతర్గత కల్లోలాలను ఎదుర్కోవటానికి కఠిన చట్టాలు వద్దని ఎవరూ అనరని, కోర్టులు కూడా ఇవి రాజ్యాంగబద్ధమని తీర్మానించాయన్నారు. అయితే సమస్య చట్టాలతో కన్నా రాజకీయాలతోనే ఎక్కువన్నారు. మన దేశంలోగానీ, పాకిస్తాన్‌లోగానీ లోపం పోలీసుల్లో, సైన్యంలో కన్నా రాజకీయాల్లోనే ఉందన్నారు. ఈ చట్టాల అమలు తీరు ఎలా ఉందో ఎప్పటికప్పుడు పార్లమెంటు ముందు ఉంచాలన్నారు. జవాబుదారీతనానికి పార్లమెంటే సర్వోన్నత వేదికన్నారు. అసాధారణ చట్టాలకు రాజ్యాంగంలో అవకాశం కల్పించిన సమయంలో కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా ఉన్న శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆ తర్వాత 1951లో నిర్బంధాల్ని వలసపాలన కాలపు క్రౌర్యాలుగా విమర్శించారని గుర్తుచేశారు. 1992లో అంతర్గత భద్రతా చట్టం ద్వారా నిషేధానికి గురైనప్పుడు వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేసిన ఆర్ఎస్ఎస్ ఇప్పుడు ఆ మాట అనటం లేదన్నారు. అసాధారణ చట్టాల్లో సాధారణ చట్టాల క్లాజుల్ని కలపటం వల్ల నిర్బంధంలోకి తీసుకునేవారి సంఖ్య పెరిగిపోతూ జైళ్లపై భారం పడుతోందన్నారు.

అరవిందరావు మాట్లాడుతూ, కఠిన చట్టాలు మన దేశంలో కంటే ఇతర దేశాల్లోనే ఎక్కువన్నారు. అమెరికాలో ఉగ్రవాద నిరోధానికి బోలెడు చట్టాలున్నాయని, అక్కడిలా మన పోలీసులు మెడ మీద కాలుతో తొక్కి ప్రాణాలు తీయరని, కోర్టు అనుమతి లేకుండా బేడీలు వేయరని అన్నారు. ఫ్రాన్స్‌లో ఒక ఉపాధ్యాయుడి తల తీసేస్తే అక్కడ యాంటీ సెపరేషన్ బిల్లు తెచ్చారని, కానీ మన దేశంలో ఉమ్మడి సివిల్ కోడ్ గురించి కూడా ఆందోళనలు చేస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్త సంబంధాలున్న ఉదారవాద వామపక్షవాదుల అత్యుత్సాహం, మానవహక్కులను, మత స్వేచ్ఛను ఆయుధాలుగా ఉపయోగించటం మన దేశంలో ఎక్కువన్నారు. చట్టాలను నీరుగారిస్తే సమాజంలో దీర్ఘకాలంలో తీవ్ర విపరిణామాలు చోటు చేసుకుంటాయన్నారు. అసాధారణ చట్టాలను విమర్శిస్తున్నవారు అలాంటి సందర్భాల్లో ఎలాంటి చట్టాలు కావాలో నిర్దిష్టంగా చెప్పాలన్నారు.

జయప్రకాష్ నారాయణ్ సమన్వయం చేస్తూ, ఏ విభాగంలోనైనా అధికార దుర్వినియోగానికి అవకాశముంటుందని, కానీ అపనమ్మకంతో పోలీసులకు అధికారాల్ని, వనరుల్ని ఇవ్వకపోతే చట్టాన్ని, రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇదిలాగే కొనసాగితే ప్రజల నుంచి ఒత్తిడిని ఎదుర్కొనేందుకు దిశ కేసులో ఎన్‌కౌంటర్‌లాంటి ఘటనలు చోటుచేసుకుంటాయన్నారు. బాధ్యతల నిర్వహణకి తగిన అధికారం ఇచ్చే చట్టాలు లేనప్పుడు, పోలీసులు చట్టాలని తమ చేతుల్లోకి తీసుకుని బందన్యాయాన్ని ఇవ్వాలనే వత్తిళ్ళు పెరుగుతాయని, అది చట్టబద్ధపాలనని నిర్వీర్యం చేస్తుందని పేర్కొన్నారు. శాంతియుత పరిస్థితుల్ని నెలకొల్పే పటిష్ఠ చట్టబద్ధపాలన కావాలా, అరాచకానికి దారితీసే ఆటవిక న్యాయం కావాలా? మనం తేల్చుకోవాలన్నారు. పోలీసులు నమోదు చేసే వాంగ్మూలం కోర్టుల్లో చెల్లకపోవటం అసంబద్ధమని, పోలీసు వ్యవస్థను జవాబుదారీతనంతో బలోపేతం చేయాలని అన్నారు. విధినిర్వహణకి కావలసిన అధికారాలనిస్తూ, పటిష్ఠమయిన జవాబుదారివ్యవస్థని ఏర్పాటు చేయటం అవసరమని, ఆ విధంగా మాత్రమే అధికార దుర్వినియోగానికి కళ్ళెం వెయ్యగలమని అన్నారు.


## Form IV

1.Place of Pubilcation : Hyderabad
2. Periodicity : Monthly
3. Printers
a. Name : Dr. Jayaprakash Narayan
b. Nationality : Indian
c: Address : Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082

4. Publisher's Name : Dr.Jayaprakash Narayan
5. Editior's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082

6. Name and Address of Individual(S) Who own the news paper and partners of Shareholders holding more than one percent of the capital : Foundation for Democratic Reforms for loksatta, Represented by Dr. Jaya prakash Narayan, National Co ordinator , Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082

I, Dr. Jaya prakash Narayan,Hereby declare that the Particulars above are true to the best of my knowledge and belief.

(Sd)
Dr. Jaya prakash Narayan
Signature of the Publisher

# కొవిడ్, ట్రంప్, భూతాపం..

## నకిలీ వార్తల నియంత్రణకు సరైన సమయమిదే!

సోషల్ మీడియాలో నకిలీ వార్తల్ని ఆయుధాల్లా ప్రయోగించటం ప్రపంచవ్యాప్తంగా ప్రమాదకర ధోరణిగా తయారైందని 'న్యూస్‌లాండ్రీ' సహ వ్యవస్థాపకుడు అభినందన్ సెఖ్రి అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ నిర్వాకం, కొవిడ్-19 మహమ్మారి చుట్టూ కోట్లాది ప్రజల్ని భయాందోళనల్లోకి నెట్టిన అబద్ధపు ప్రచారాలు మన కళ్ల ముందే ఉన్నాయన్నారు. నకిలీ వార్తలు ప్రజల మధ్య విభజన చిచ్చు పెడుతున్నాయని, పలు రకాలుగా సమాజానికి తీవ్ర హాని చేస్తున్నాయన్నారు. దీనికి పరిష్కారాల్ని రూపొందించటమే ఈ చర్చ లక్ష్యమన్నారు.

**'ఇండియన్ డెమొక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) నాలుగవ రోజు సమావేశంలో 'నకిలీ వార్తల ప్రచారం-ప్రజాస్వామ్యానికి ప్రమాదం'పై ఫిబ్రవరి 23న జరిగిన చర్చను అభినందన్ సెఖ్రి సమన్వయం చేశారు. స్పెయిన్ 'మాల్దిటా' ప్రజా విధానాలు, వ్యవస్థీకృత అభివృద్ధి అధిపతి కార్లోస్ హెర్నాండెజ్-ఇషివారియా, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సంభాషణల్లో పాల్గొన్నారు.**

స్వార్థప్రయోజనాల కోసం కొందరు, భావజాలాలు, రాజకీయ అవసరాల కోసం ఇంకొందరు, ఏ రకమైన లాభం లేకున్నా కూడా వికృతానందం కోసం మరికొందరు నకిలీ వార్తల్ని ప్రచారం చేస్తున్నారని కార్లోస్ అన్నారు. పోలీసు కేసు, బాధితులు లేకుండా రక్తసిక్త ఘటనలు జరిగినట్లు వార్తల్నే కాకుండా ఫోటోల్ని, శబ్దాల్ని, మీమ్‌లను సృష్టిస్తున్నారన్నారు. తాము స్పెయిన్‌లో ప్రజల నుంచి అనుమానాస్పద వార్తల వివరాలను సేకరించి కృత్రిమ మేధ సాయంతో విశ్లేషిస్తూ నకిలీలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కానీ ఒక సంచలన తప్పుడు వార్తను ప్రచారం చేసిన స్థాయిలో వాస్తవాల్ని వివరించే పోస్టును వైరల్ చేయటం కష్టమన్నారు. విశ్వసనీయత కలిగిన వార్తాపత్రికలు, మ్యాగజైన్లు గణనీయ స్థాయిలో ఫ్యాక్ట్ చెకర్లుగా ఉపయోగపడుతున్నా నకిలీలను నిలువరించటానికి సరిపోవటం లేదన్నారు. ముఖ్యంగా ఉన్నత స్థానాల్లో ఉన్నవారు పెద్ద టెక్నాలజీ కంపెనీలను ఉపయోగించుకుంటూ సులభంగా అసత్యాలను ప్రచారం చేస్తున్నప్పుడు.. వారి అధికారాన్ని, డబ్బు, ఇతర వనరుల్ని ఎదుర్కోవటం కష్టమన్నారు. అర్ధసత్యాలను ప్రచారం చేస్తున్నప్పుడు ప్రజలకు నచ్చచెప్పటం మరీ కష్టమన్నారు. నకిలీ వార్తల్ని నియంత్రించటానికి కంపెనీలు తమదైన పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నా రాజకీయ వేడి, ఆర్థిక సవాళ్లు ఎదురైన ఇతరత్రా సందర్భాల్లో మాత్రమే నిబంధనలను అమలు చేస్తున్నాయన్నారు. తమ లాభాలకు అవరోధంగా ఉండే నిబంధనలను ప్రకటనలకే పరిమితం చేస్తున్నాయన్నారు. తమకు నచ్చితే నకిలీ వార్తయినా నమ్మటానికి సిద్ధపడేవారుండటం ఫ్యాక్ట్‌చెకర్లకు ఇంకో పెద్ద సవాలన్నారు. రాజకీయ నాయకులు మీడియా స్వేచ్ఛను ఇష్టపడరని, అందువల్ల రాజకీయ వ్యవస్థ నుంచి ప్రచారంలోకి వచ్చే వార్తల పట్ల కొంత అపనమ్మకంతో ఒకటికిరెండుసార్లు వివిధ మార్గాల్లో తనిఖీ చేసుకోవటం సరైన పద్ధతన్నారు. మధ్యేమార్గం మేలన్నారు. ఒక దేశం మాత్రమే పెద్ద టెక్నాలజీ కంపెనీ మీద యుద్ధం చేయలేదని, నకిలీ వార్తలను నియంత్రించటానికి వివిధ దేశాలను యూరోపియన్ యూనియన్ సమీకరించాలన్నారు.

జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, సోషల్ మీడియాను నియంత్రించటం మీద అతిగా దృష్టి పెట్టటం వల్ల లాభం ఉండదన్నారు. నకిలీ వార్తలు, అర్ధసత్యాల వల్ల నష్టం లేకుండా చూసే ఆచరణసాధ్యమైన మార్గాల మీద దృష్టి పెట్టాలన్నారు. విద్వేషం, హింస, బరితెగించిన అబద్ధాలను గుర్తించటం తక్షణావసరమని, కొంతమేర ఇది సులభం కూడా అన్నారు. అలాగే ప్రజాప్రయోజనాలకు హాని కలిగించేలా వ్యాక్సిన్లు, వాతావరణ మార్పులు వంటి అంశాల మీద వ్యక్తుల ప్రవర్తనను తప్పు దోవ పట్టించే ప్రచారాన్ని కఠినంగా అడ్డుకోవాలన్నారు. ఈ రెంటి కంటే కష్టమైనది అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ చేసినట్లు వ్యవస్థలను ధ్వంసం చేసేలా నిరంతరం అబద్ధాలు, అర్ధసత్యాల ప్రచారాన్ని నిలువరించటమన్నారు. సోషల్ మీడియా వేదికలకు సరిహద్దులు లేవని, అందువల్ల నిబంధనలపై అంతర్జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం అవసరమన్నారు. ప్రజాస్వామ్య దేశాల నుంచి ఈ ఏకాభిప్రాయ నిబంధనల అమలు ప్రారంభిస్తే ఫలితాలు కనిపిస్తాయన్నారు. కొవిడ్, డొనాల్డ్ ట్రంప్, భూతాపం – నకిలీ వార్తల పెనుప్రమాదాన్ని నిరోధించే మంచి అవకాశాన్ని కల్పించాయన్నారు. ప్రభుత్వాలు ఎన్‌జీవోలను, వ్యక్తిగత అలవాట్లను నియంత్రించటం ఆపి తాను చేయాల్సిన ఇలాంటి పనుల మీద దృష్టి పెట్టాలన్నారు. సోషల్ మీడియాలో అందరి మీదా దృష్టి పెట్టటమనే అసాధ్యం జోలికి పోకుండా, ప్రమాదకరమైన కొద్దిమందిని నియంత్రించే సుసాధ్యం మీద దృష్టి పెట్టాలని, ఇందుకోసం నిబంధనల కోడ్‌ను అమలు చేయాలన్నారు. వాస్తవాల్ని తెలుసుకోవటానికి విశ్వసనీయ వ్యక్తులను సోషల్ మీడియాలో అనుసరిస్తుండటం మేలన్నారు. నకిలీ వార్తలు వాక్స్వాతంత్ర్యంలో భాగం కాదని, నిజం ఎప్పుడూ నిజమేనని, అభిప్రాయాలు ఎన్నయినా ఉండవచ్చన్న కార్లోస్ అభిప్రాయంతో ఏకీభవించారు. గజం మిథ్యయితే పలాయనం కూడా మిథ్యవుతుందని.. వాదోపవాదాల జోలికిపోకుండా స్పష్టమైన, తక్షణ నష్టకారకమైన, నిరూపించగల అంశాలయితే చర్య తీసుకోవాలన్నారు.

INDIAN DEMOCRACY AT WORK

FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS | ISB Bharti Institute of Public Policy | हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

# మహిళల భద్రతపై వ్యవస్థల్లో అవగాహన పెంచాలి, 'స్థానిక కోర్టుల ఏర్పాటు' తక్షణావసరం: ఐడీఏడబ్ల్యూ సమావేశంలో వక్తలు

మహిళల పట్ల వివక్ష, హింసలను వ్యవస్థీకృతంగా నిర్మూలించటానికి రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు, మీడియాతోపాటు న్యాయమూర్తులకు కూడా అవగాహన కలిగించాలని ఎల్సామేరీ డిసిల్వా అన్నారు. ఇటీవల ఓ అత్యాచార యత్నం కేసులో బొంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌కి చెందిన ఒక మహిళా న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు దిగ్భ్రాంతిని కలిగించాయన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) 5వ రోజు సమావేశంలో 'మహిళల భద్రత'పై ఫిబ్రవరి 24న జరిగిన చర్చలో రెడ్ డాట్ ఫౌండేషన్ (ఇండియా) వ్యవస్థాపకురాలు, రెడ్ డాట్ ఫౌండేషన్ గ్లోబల్ (అమెరికా) అధ్యక్షురాలు ఎల్సామేరీ డిసిల్వా, రాచకొండ కమిషనరేట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మహేష్ భగవత్, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రొఫెసర్ దీపా మణి సమన్వయం చేశారు.**

తమపై వేధింపులను, లైంగిక దాడులను మహిళలు ఫిర్యాదు చేయటం నిర్భయ ఉదంతం తర్వాత పెరిగిందని, 'మీటూ' ఉద్యమం తర్వాత ఆ చైతన్యం స్పష్టంగా కనిపించిందని, కానీ ఇప్పటికీ ఫిర్యాదులపై చొరవ తగినంతగా లేదని ఎల్సామేరీ డిసిల్వా అన్నారు. మన సమాజంలో మహిళను వేధించటం మామూలే అనే న్యూనత వారి మనసుల్లో నుంచి తొలగలేదన్నారు. సరైన చదువు లేకపోవటం వల్ల చట్టాలు, హక్కులు, వాటి ద్వారా న్యాయం పొందే ప్రక్రియ గురించి చాలామందికి అవగాహన లేదన్నారు. తగిన రక్షణ కొరవడటం మహిళలను నాణ్యమైన విద్యకు కూడా దూరం చేస్తోందన్నారు. చాలామంది అమ్మాయిలు దగ్గరలో ఏ కాలేజీ ఉంటే అందులో చేరి ఏదో చదువుకున్నామనిపిస్తున్నారన్నారు. సీసీ కెమెరాలను పెట్టినా టాయిలెట్లు వంటి చోట ఇంకా వేధింపులకు తెగబడుతున్నారన్నారు. నేరాల నియంత్రణలో డేటా చాలా ముఖ్యమైన అంశమని, నేరాల తీరుతెన్నులు, భౌగోళిక సమాచారం వంటి వివరాలను విశ్లేషించి చర్యల్ని రూపొందించాలన్నారు. నిర్భయ నిధుల్ని ఇందుకోసం వినియోగించాలన్నారు. తెలంగాణలో




మహిళల రక్షణకు పలు చర్యలు ప్రారంభించారని, ఉన్నత పాఠశాల స్థాయి నుంచి అమ్మాయిలతో గౌరవప్రదమైన ప్రవర్తన పట్ల అబ్బాయిలకు, లైంగిక దాడుల పట్ల అమ్మాయిలకు అవగాహన కలిగించటం మంచి ప్రయత్నమన్నారు. సాంకేతికత వినియోగంతో మహిళలకు రక్షణ పెరిగినప్పటికీ, ఇంకా చాలామంది మహిళలకు మొబైల్ ఫోన్లు లేవని, చాలా ప్రాంతాలు ఇంటర్నెట్‌కు దూరంగా ఉన్నాయని అన్నారు. ఆన్‌లైన్ ప్రపంచం వాస్తవ ప్రపంచానికి ప్రతిబింబమేనని, అందుకే అక్కడ పురుషాధిక్య భావజాలం, మహిళలను కించపరచటం పెద్దఎత్తున చోటుచేసుకుంటున్నాయన్నారు. మతపెద్దలు, పోలీసులు, మునిసిపల్ సిబ్బంది, ప్రజారవాణా అధికారులు.. ఇలా అందరినీ మహిళల రక్షణలో భాగస్వాముల్ని చేయాలన్నారు.

మహేష్ భగవత్ మాట్లాడుతూ, 2014లో తెలంగాణ ఏర్పడ్డాక చేసిన సర్వేలో విద్యార్థినులు, మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఈవ్ టీజింగ్ అని తేలిందన్నారు. అందుకే 'షీ టీమ్'లను ఏర్పాటు చేసి తొలుత ఆ సమస్య మీద దృష్టిపెట్టి మంచి ఫలితాలు సాధించిందన్నారు. టెక్నాలజీ సాయంతో షీ టీమ్‌లు పనిచేయటం ప్రారంభించాక ఫిర్యాదులు బాగా పెరిగాయని వేధింపులు తగ్గాయని అన్నారు. అప్పటిదాకా పోలీస్ స్టేషన్‌కి ఎవరో మధ్యవర్తులతో మాత్రమే వచ్చే అమ్మాయిలు నేరుగా ఫిర్యాదు చేస్తున్నారన్నారు. అయితే తమ తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దలకు చెప్పకుండా సమస్యను పరిష్కరించమని ఎక్కువమంది అమ్మాయిలు కోరుతున్నారన్నారు. వేధించిన మగవారికి పెళ్లయితే భార్య, లేదంటే ఇంట్లో మహిళలతో సహా పిలిపించి సాక్ష్యాలను చూపించి కౌన్సెలింగ్ చేయటం వల్ల మంచి ఫలితాలు కనబడుతున్నాయన్నారు. స్త్రీల పట్ల అసభ్య, అనుచిత ధోరణులు ఎక్కువ బస్టాపుల్లోనే

INDIAN DEMOCRACY AT WORK
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

చోటుచేసుకుంటున్నాయని, అందుకే రాచకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో షీ షటిల్‌ను ప్రారంభించామన్నారు. క్యాబ్‌లు, ఆటోలకు కూడా క్యూఆర్ కోడ్ వంటి ఏర్పాట్లు చేశామన్నారు. సురక్షిత ప్రయాణానికి సేఫ్ ట్రావెల్ యాప్ అందుబాటులోకి తెచ్చామన్నారు. సంఘమిత్ర కమ్యూనిటీ కార్యక్రమంతో పోలీసింగ్‌లో ప్రజల్ని భాగస్వాముల్ని చేశామన్నారు. మనకు బలమైన కుటుంబ వ్యవస్థ ఉందని, కానీ దగ్గరి బంధువులు లేదా పొరుగువారు పిల్లలపై అత్యాచారాలకు పాల్పడిన ఉదంతాలు కూడా ఎక్కువన్నారు. 'పోక్సో' చట్టం తర్వాత అలాంటి కేసుల రిపోర్టింగ్ పెరిగినా, పెండింగ్ కేసులు పెరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని 6.5 లక్షల సీసీ కెమెరాల ద్వారా సాక్ష్యాలను సేకరించటం వల్ల దోషులను తొందరగా పట్టుకోవటంతోపాటు నిర్దోషులను శిక్ష నుంచి కాపాడామన్నారు. కానీ మహాత్మాగాంధీ ఆశించిన స్థాయిలో మహిళల రక్షణకు ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు.

ప్రొఫెసర్ దీపా మణి తన అధ్యయనాన్ని వివరిస్తూ, మహిళలు ఎంత ఎక్కువ చదువుకుంటే అంత తక్కువ కార్మిక వ్యవస్థలో భాగమవుతున్నారన్నారు. కొవిడ్ వచ్చాక ఉపాధిలో మహిళల పాత్ర మరింత తగ్గిందన్నారు.

జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, నేరాలు జరిగాక దోషులకు తగిన శిక్షలు విధించటంతోపాటు చదువు, పురుషాధిక్య భావజాలానికి వ్యతిరేకంగా చైతన్యం వంటి దీర్ఘకాలిక చర్యల్ని తీసుకుంటూనే, కమ్యూనిటీ పోలీసింగ్, స్థానిక కోర్టుల ఏర్పాటు వంటి వెంటనే, తేలిగ్గా చేయగల పనుల మీద దృష్టి కేంద్రీకరించాలన్నారు. స్థానిక కోర్టులుంటే మహిళలపై నేరాలను తొలి దశలోనే నియంత్రించవచ్చన్నారు. జరిమానాలు, చిన్న శిక్షలు, రెండేళ్ల వరకూ తిరిగి అలాంటి నేరం చేస్తే కాలేజీ అడ్మిషన్ నిలిపివేత వంటి చర్యలతో చాలా వరకు నేరాల్ని తొలిదశలోనే నియంత్రించవచ్చన్నారు. సురక్షిత సమాజ సంస్కృతిని మనం సమాజంలో పాదుకొల్పాలన్నారు. కార్మిక శక్తిలో మహిళల పాత్ర బాగా తగ్గిపోతున్న (21%) దేశం భారత్ మాత్రమేనన్నారు. చదువుకున్న వారు కూడా పురుషాధిక్య భావజాలంతో ఆలోచించటం సమస్యలో భాగమైనా, సరైన రక్షణ లేకపోవటం ఇందుకు పెద్ద కారణమన్నారు. ✦

# ధాన్యం రైతుల సమస్యల్ని పరిష్కరించండి

విజయనగరం జిల్లాలో ధాన్యం రైతుల సమస్యపై తక్షణం దృష్టి పెట్టాలని, లేకుంటే లోక్‌సత్తా పార్టీ నుంచి తామే రైతు ఉద్యమానికి శ్రీకారం చుడతామని పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. దళారులు అడ్డగోలుగా కొనుగోళ్లు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. ధాన్యం తూకం అక్రమాల నియంత్రణలో తూనికలు కొలతల శాఖ విఫలం కావడంతో రైతులు నష్టపోయారన్నారు. మధ్యవర్తుల వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేసే ఏర్పాట్లు అవసరమన్నారు. వ్యవసాయంలో, మార్కెటింగ్‌లో రైతుల సమస్యలపై జిల్లా ప్రజాప్రతినిధులు, మంత్రులు నోరు మెదపకపోవటం విచారకరమన్నారు. ధాన్యం కొనుగోళ్లపై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేయాలన్నారు. లోక్‌సత్తా ద్వారా ప్రజాసేవలో ఎందరికో స్ఫూర్తినిచ్చిన సహచరుడు నరెడ్ల శ్రీనివాస్ అకాల మరణం సమాజానికి పెద్దలోటని ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌తో దశాబ్దాలుగా సరిహద్దు వివాదమున్న 21 గ్రామాల్లో ఒడిషా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నా ఏపీ అధికారులు, నేతలు




పట్టించుకోవటం లేదని బాబ్జీ అన్నారు. సాలూరు మండల పరిధిలో కోఠియా గ్రూప్ గ్రామాలైన గంజాయిభద్ర, పగలుచెన్నూరు తదితర గ్రామాలు, సారిక, కరుకూటి పంచాయతీల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఒడిషా ప్రభుత్వం ఏకపక్షంగా కార్యకలాపాల్ని నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను సామరస్యంగా పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ✦

INDIAN DEMOCRACY AT WORK
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS | ISB Bharti Institute of Public Policy | हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

# పిల్లల నుంచి వృద్ధుల దాకా సైబర్ భద్రత గురించి తెలుసుకోవాల్సిన రోజులొచ్చాయి

డిజిటల్ కరెన్సీ కూడా ప్రవేశిస్తున్న తరుణంలో భారత్‌లో పిల్లల దగ్గర్నుంచి వృద్ధుల వరకు సైబర్ భద్రత గురించి అవగాహన, సన్నద్ధత తప్పదని బెంగళూరు సీఐడీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డా॥ రోహిణి కటోచ్ సెపత్ అన్నారు. కేవలం సైబర్ చట్టాలు సరిపోవని, అవి వేగంగా అమలవ్వాలన్నారు. పోలీసులు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, జడ్జిలు, ప్రజలు ఇలా అందరికీ సైబర్ పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన కలిగిస్తుండాలన్నారు. సైబర్ భద్రత కోసం కార్పొరేట్ నమూనా ఏర్పాట్లు ఉండాలన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) 6వ రోజు సమావేశంలో 'సైబర్ భద్రతకు సంస్థాగత ఏర్పాట్లు'పై ఫిబ్రవరి 25న జరిగిన చర్చను రోహిణి సెపత్ సమన్వయం చేశారు. సుప్రసిద్ధ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, భారత దర్యాప్తు సంస్థల సైబర్ ఫోరెన్సిక్ అధికారి అమిత్ దుబే, కేరళ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సైబర్ రక్షణ విభాగాధిపతి మనోజ్ అబ్రహాం, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సంభాషణల్లో పాల్గొన్నారు.**

మనోజ్ అబ్రహాం మాట్లాడుతూ, కొవిడ్ వల్ల 4–5 ఏళ్ల డిజిటల్ సాంకేతిక మార్పులు ఒకేసారి రావటంతో మన దేశంలో తగిన సన్నద్ధత కొరవడిందన్నారు. దీంతో సైబర్ నేరాలు 200–300 రెట్లు పెరిగాయన్నారు. పోలీసుల అధికారం నిర్దిష్ట భౌగోళిక సరిహద్దు పరిధిలోనే ఉండటం, డబ్బు, డేటా దొంగతనం తదితర సైబర్ నేరాలు ప్రపంచంలో ఎక్కడనుంచయినా జరుగుతుండటం వల్ల దర్యాప్తు కష్టమవుతోందన్నారు. సైబర్ నేరస్తులు అన్ని రకాల వనరులు, కొత్త టెక్నాలజీలతో దాడులకు పాల్పడుతుంటారని, వారిని ఎదుర్కోవటానికి తగిన సాంకేతిక సామర్థ్యాన్ని నిర్మించుకోవటం అవసరమన్నారు. దీంతోపాటు, టెక్నాలజీ వినియోగంలో ఏం చేయాలి, ఏం చేయకూడదు ప్రతి ఒక్కరికీ తెలియచేయాలన్నారు. సైబర్ నేరాలలో లూటీ నిమిషాలు, గంటలోనే జరుగుతుందని, అందువల్ల వేగంగా స్పందించే ఏర్పాట్లు అవసరమన్నారు. అలాగ ఇతర రాష్ట్రం నుంచి రూ.5,000 లూటీ అయితే అక్కడికి పోలీసు బృందాల్ని పంపటానికి రూ.50,000 ఖర్చవుతుందని, వదిలేస్తే నేరస్తుడు అనేకమంది వద్ద అలాగే కొల్లగొడతాడని, అందువల్ల అన్ని పోలీసు స్టేషన్ల సైబర్ వ్యవస్థలనూ అనుసంధానించి స్థానికంగా పోలీసులు చర్యలు తీసుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. కేరళలో బ్యాంకులన్నిటితో పోలీసు శాఖ అనుసంధానమయిందని, ఈ–షాపులు, మొబైల్ వాలెట్లలో మోసం జరిగితే వెంటనే స్పందించి ఖాతాల్ని స్తంభింపచేస్తున్నామన్నారు. దీనివల్ల 70–80 శాతం మొత్తాన్ని పరిరక్షించగలుగుతున్నామన్నారు. 24 గంటలూ అందుబాటులో ఉండే కాల్ సెంటర్‌తో సైబర్ నేరాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. భారత్ సోషల్ మీడియాపై నిబంధనలు జారీ చేసినా 66ఎను సుప్రీంకోర్టు కొట్టివేయటంతో సమస్య కొనసాగుతోందన్నారు. సైబర్ నేరాలను ఎదుర్కోవటానికి అత్యుత్తమ విధానమంటూ లేదని.. పటిష్ఠమైన, ఎప్పటికప్పుడు కొంత అంశాలను చేర్చుకోగల వీలున్న ఐటీ చట్టవ్యవస్థ మనకు అవసరమన్నారు. డిజిటల్ సాక్ష్యం ద్వారా కేసు విచారణను వేగంగా చేసి దోషులను శిక్షించవచ్చని, అయితే పోలీసులు, ప్రాసిక్యూటర్, న్యాయమూర్తికి ఆ సాక్ష్యాలను అర్థం చేసుకునే పరిజ్ఞానం ఉండాలన్నారు. రాష్ట్రాలు, చట్టాన్ని అమలు చేసే వివిధ యంత్రాంగాలు, ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం, ప్రజల సహకారంతో మాత్రమే సైబర్ భద్రత సాధ్యమవుతుందన్నారు. సైబర్ సెక్యూరిటీ కోసం పెద్దఎత్తున నిధులు కేటాయించాలన్నారు. సైబర్ భద్రత గురించి దేశంలో ఎవరూ మాట్లాడని సమయంలో కేరళలో మనోజ్ అబ్రహాం ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో ఆ దిశగా ప్రయత్నం ప్రారంభించారని, ఇప్పుడు అన్ని రాష్ట్రాలూ అనుసరిస్తున్నాయని అమిత్ దుబే అభినందించారు. మన దేశంలో సైబర్ నేరాలకబారిన పడి ఎక్కువగా నష్టపోతున్నది తక్కువ, మధ్యాదాయ వర్గాలేనన్నారు. బ్యాంకు అకౌంట్, సిమ్ కార్డులను ఎవరూ హ్యాక్ చేసే అవకాశం లేకుండా బ్లాక్ చైన్ టెక్నాలజీతో ఏర్పాట్లు చేస్తే, బ్యాంకు కేవైసీ విధానాన్ని పక్కాగా రూపొందిస్తే భారత్‌లో 90% ఆర్థిక నేరాల్ని అదుపు చేయవచ్చన్నారు. చిన్న పిల్లలపై నేరాలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల్ని సక్రమంగా అమలు చేయగలిగితే పిల్లలు, మహిళలపై నేరాల్ని చాలావరకూ నిరోధించవచ్చన్నారు. వనరులు, టెక్నాలజీ, సామాజిక అవగాహన ఇందులో చాలా కీలకమన్నారు. ఆరోగ్యం, పారిశ్రామిక రంగం, ఐటీ ఇలా ఏ రంగంలోనైనా సైబర్ దాడులు జరిగే అవకాశముందని, ఎన్ని నిధులు వెచ్చించి ఎంత పకడ్బందీగా చర్యలు తీసుకున్నా దాడులకు అవకాశముందని ట్విటర్ ఉదాహరణను వివరించారు. ఈ–సిమ్ వంటి నయా మోసాల్ని వివరించారు. 92% సైబర్ దాడులు మానవ పొరపాట్లతోనే జరుగుతాయని, ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని తాజా పరచుకోవటం, అప్రమత్తంగా ఉండటం అవసరమన్నారు. సైబర్ నేరాలపై పోరాటంలో మనకు టెక్నాలజీ కీలకమని, ఒక దేశవ్యాప్త కేంద్రీకృత వ్యవస్థను అందుకు ఏర్పాటు చేసుకుంటే ఎక్కడున్న పోలీసులైనా వేగంగా స్పందించగలుగుతారన్నారు.

INDIAN DEMOCRACY AT WORK

FOUNDATION FOR DEMOCRATIC REFORMS · ISB | Bharti Institute of Public Policy · हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

# ఆర్థిక సంస్కరణలకు చట్టబద్ధపాలన కీలకం




న్యాయ సంస్కరణలు ఆర్థిక సంస్కరణల్లో కీలకమని భారత ప్రణాళికా సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా అన్నారు. ప్రభుత్వం చట్టబద్ధపాలనకు గ్యారంటీ ఇస్తేనే ఆర్థికవృద్ధికి గ్యారంటీ ఉంటుందన్నారు. పూర్వం గ్రామీణ వాతావరణంలో ఆర్థిక లావాదేవీలకు పరిమిత సంఖ్యలోని వ్యక్తుల మధ్య సామాజిక విశ్వాసం సరిపోయేదని, కానీ ఇప్పుడు పట్టణీకరణ, పోటీ ఆర్థిక వ్యవస్థ పెరుగుతున్న నేపథ్యంలో పరస్పర విశ్వాసానికి పకడ్బందీ చట్టబద్ధ ఏర్పాట్లు ఉండాలన్నారు. భారతదేశంలో ఇప్పుడున్న పరిస్థితులు పెట్టుబడులను నిరుత్సాహ పరిచేలా ఉన్నాయన్నారు. ఆర్థికవేత్తలు ప్రతిపాదించిన మార్పు కోసం చేసే చట్టాలు కూడా లొసుగులతో పాటు మార్కెట్లో తిరస్కరణకు గురయ్యేలా ఉన్నాయన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) 7వ రోజు సమావేశంలో 'చట్టబద్ధపాలన– ఆర్థిక వృద్ధి'పై ఫిబ్రవరి 26న జరిగిన చర్చకు సీనియర్ బిజినెస్ జర్నలిస్టు ఆర్.ఎన్ భాస్కర్ అధ్యక్షత వహించారు. మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా, ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ గ్రోత్ అండ్ వెల్ఫేర్ చైర్మన్ డా॥ అరవింద్ విర్మాని, కన్స్యూమర్ యూనిటీ అండ్ ట్రస్ట్ సొసైటీ వ్యవస్థాపక సెక్రటరీ జనరల్ ప్రదీప్ ఎస్ మెహతా, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు.**

మనకు స్వతంత్ర ప్రతిపత్తి గల బలమైన న్యాయవ్యవస్థ ఉందిగానీ, న్యాయసేవలు మాత్రం అధ్వాన్నంగా ఉన్నాయని మాంటెక్‌సింగ్ ఆహ్లువాలియా అన్నారు. చట్టబద్ధపాలనలో ముఖ్యమైన న్యాయ, పోలీసు వ్యవస్థల్లో మౌలిక లోపాలున్నాయన్నారు. తీర్పుల్లో నాణ్యత లోపిస్తోందన్నారు. పరిజ్ఞానం, సామర్థ్యం ఉన్న వారు ఎక్కువగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు తప్ప జడ్జిలు అవ్వాలనుకోవటం లేదన్నారు. మన న్యాయమూర్తుల పదవీ విరమణ వయసుకు సంబంధించి కూడా పునరాలోచన చేయాలని, అమెరికాలో జడ్జి అయితే జీవితకాలం ఆ పదవిలో ఉంటారని అన్నారు. న్యాయసంస్కరణలపై ప్రభుత్వం చొరవ పెరగాలన్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో రాజ్యాంగపరమైన కోణంలో తప్ప జోక్యం చేసుకోకూడదనే లక్ష్మణరేఖను న్యాయస్థానాలు దాటుతున్నాయని, రాజ్యాంగపరంగా తీసుకున్న ప్రభుత్వ నిర్ణయాల్లో తప్పిదం ఉన్నా కూడా ఆ విషయాల్ని పార్లమెంటు, ఎన్నికల్లో ప్రజలు చూసుకోవాలి తప్ప కోర్టుల జోక్యం తగదన్నారు. ఈ రకంగా దాదాపు 100కు పైగా ప్రభుత్వ నిర్ణయాల్లో కోర్టు జోక్యం చేసుకుని ఆర్థిక నష్టాలకు కారణమైందన్నారు. భూటైటిల్ వివాదాల వల్ల పెట్టుబడిదారులు వెనుకంజ వేస్తారని, ప్రపంచంలో ఎక్కడా మన దేశంలోలా అసంబద్ధ ఆర్థిక అవరోధాలుండవన్నారు. తొలిదశలో విధాన రూపకల్పన తేలికని, 1991లో తెచ్చిన మార్పులు వేగంగా ఫలితాల్ని సాధించాయన్నారు. ప్రైవేటు రంగం పాత్ర పెరిగినా నియంత్రణలు చట్టంలో భాగంగా ఉంటాయన్నారు. ప్రజల్లోకి చర్చను తీసుకెళ్లటం ఆర్థిక సంస్కరణలకు ఎంతో అవసరమన్నారు. దాదాపు మూడు దశాబ్దాల క్రితం చెల్లయ్య కమిటీ ఇచ్చిన రోడ్‌మ్యాప్ ప్రకారం పన్ను సంస్కరణల్ని తెచ్చారని, ఇప్పుడు మళ్లీ ప్రత్యక్ష పన్నుల నిబంధనావళి, జీఎస్‌టీ అమలు, కస్టమ్స్ పన్నులలో సంస్కరణల్ని తేవాలన్నారు. బడ్జెట్లు, ఆర్థిక విధానాల్లో రహస్యాలు అక్కర్లేదన్నారు. చట్టం మంచిదైనా

పరిస్థితులు అనుకూలించలేదు కాబట్టి రేపటికి ఎందుకు వాయిదావేయకూడదు అనే ధోరణి మారాలన్నారు.

అరవింద్ విర్మాని మాట్లాడుతూ, మార్కెట్లు సక్రమంగా పనిచేసి ఆర్థిక వృద్ధి జరగాలంటే చట్టబద్ధంగా పనిచేసే వ్యవస్థలు ముఖ్యమన్నారు. ఒకప్పుడు కుటుంబం, స్నేహితుల నుంచి మాత్రమే పెట్టుబడిని సేకరించేవారని, ఇప్పుడు సమాజం నుంచి సేకరించగలుగుతున్నారంటే ఈ మౌలిక మార్పునకు ఉమ్మడి స్టాక్‌మార్కెట్ అనే చట్టబద్ధ వ్యవస్థ కారణమన్నారు. పూర్వకాలంలో కూడా మన దేశంలో వాణిజ్యం వృద్ధి చెందటానికి చట్టబద్ధవ్యవస్థల్ని అమలు చేసేవారన్నారు. ఆర్థిక, విద్య, ఆరోగ్య రంగాల్లో సమాచారంలో అసమతూకం ఉందని, అంటే సగటు పౌరులకి ఏం జరుగుతుందో, ఈ రంగాలలో ఎలాంటి సేవలందుతున్నాయో అర్థం కావటం కష్టమని, కాబట్టి పరిమిత నియంత్రణ అవసరమని చెప్పారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో నియంత్రణల వల్ల కలిగే సానుకూల, ప్రతికూల ప్రభావాల్ని, నైతికత ప్రశ్నల్ని బేరీజు వేసి సమగ్ర సమాచారంతో హేతుబద్ధంగా, వేగంగా నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలు అవసరమన్నారు. అవినీతి పెద్ద సమస్యని, కానీ న్యాయవ్యవస్థ విధాననిర్ణయాలలో జోక్యం చేసుకోవటం, ప్రజాప్రయోజనవ్యాజ్యాలను (పిల్) ప్రోత్సహిస్తూ సంచలన తీర్పులివ్వటం పరిష్కారం కాదన్నారు. అవినీతిపరులు, నేరరాజకీయాల నుంచి వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే చర్యల మీద దృష్టి పెట్టాలన్నారు. చట్టసభల్లో ప్రామాణిక చర్చలు కొరవడటం కూడా విధానాల వైఫల్యానికి కారణమవుతోందన్నారు. మన దేశంలో వ్యాపార రంగంపై దాదాపు 7,000కు పైగా నియంత్రణలున్నాయన్నారు.

కోర్టుల్లో వాయిదాలు, జడ్జిల సంఖ్య తక్కువ ఉండటం, మౌలిక వసతులు, ఆధునిక సాంకేతికత కొరవడటం వంటి సమస్యలు ఆర్థిక రంగ వేగాన్ని నిరోధిస్తున్నాయని ప్రదీప్ ఎస్. మెహతా అన్నారు. సమర్థులైన న్యాయమూర్తులకఎంపిక కోసం ఏర్పాటైన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)ని సుప్రీంకోర్టు కొట్టివేయటాన్ని ఆక్షేపించారు. వాణిజ్య కోర్టులను జిల్లా స్థాయిల్లో కూడా ఏర్పాటు చేయాలన్నారు. వికేంద్రీకరణకు బెంచ్‌లను ప్రారంభించాలన్నారు. కోర్టుల మీద ప్రజల్లో విశ్వాసం లేదన్నారు. నిర్ణీత సమయంలో తీర్పులివ్వాలని వినియోగదారుల కోర్టుల్లో నిబంధనలున్నా ఆ వ్యవధిలో తీర్పులు రావటం లేదన్నారు. ఎవరిమీదన్నా కోపమొస్తే నిన్ను కోర్టుకీడుస్తా అనడం న్యాయవ్యవస్థ పనితీరుకు అద్దం పడుతుందన్నారు.

ఏ సమాజానికైనా న్యాయవ్యవస్థ మూలస్తంభమని, న్యాయం అందించటంలో ఆ వ్యవస్థ విఫలమైతే జడ్జిల స్థానాన్ని నేరస్తులు ఆక్రమిస్తారని ఆర్.ఎన్ భాస్కర్ అన్నారు. మన దేశంలో బస్తీల్లో నేరం జరిగితే 90 శాతం సందర్భాల్లో స్థానిక గూండాను ఆశ్రయిస్తారు తప్ప పోలీసుల్ని కాదన్నారు. తమకు తక్షణ న్యాయం చేసే నేరస్తుడికి ఎన్నికల్లో ఓటు వేయటానికి వారు ఏమాత్రం సంకోచించరన్నారు. న్యాయవ్యవస్థ వైఫల్యం నేరరాజకీయాలకు ఊతమిస్తోందన్నారు. గూండాలు డబ్బు తీసుకునయినా పనిచేసిపెడతారని, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ లంచాలిచ్చినా కూడా కొన్నిసార్లు పనులు జరగటం లేదన్నారు. కోర్టుల్లో జడ్జిల సంఖ్య తక్కువగా ఉండటం యాదృచ్ఛికం కాదని, ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నాయన్నారు. అవినీతి, న్యాయవ్యవస్థ వైఫల్యం వల్ల దేశ ఉపాధి రంగానికి కీలకమైన చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్ద మూల్యం చెల్లిస్తున్నాయన్నారు. ఎక్కువ జనాభా, ఎక్కువ పేదరికం, తక్కువ చదువు ఉన్న మనదేశంలో వ్యవస్థల నిర్మాణం కొరవడటం పెద్ద సంక్షోభమన్నారు.

జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, రాజ్యాంగపరమైన కోణాల్లో తప్ప విధానపరమైన నిర్ణయాల్లో ఏది మంచి, ఏది చెడు అని చెప్పటం కోర్టుల పనికాదన్నారు. చట్టసభలు, ప్రభుత్వం, కోర్టుల మధ్య అధికారాల విభజన అంశం ఇంకా ప్రజల డిమాండ్‌గా మారలేదన్నారు. న్యాయవ్యవస్థలో జాప్యాన్ని తగ్గించి వేగంగా, చౌకగా న్యాయాన్ని అందుబాటులోకి తేవటానికి, పంచాయతీల్లో కుల పెత్తనం ద్వారా వచ్చే తీర్పులిచ్చే సాంప్రదాయాన్ని నిర్మూలించటానికి లోక్‌సత్తా చొరవతో 2009లో గ్రామన్యాయాలయాల చట్టం వచ్చిందని, కానీ 5,000 – 6,000 కోర్టులు అవసరముండగా ఇప్పటివరకు 220 స్థానిక కోర్టులు మాత్రమే ఏర్పాటయ్యాయన్నారు. టెలికాం లైసెన్సుల్ని కోర్టు రద్దుచేయటంపై మాంటెక్ సింగ్ అహ్లువాలియా వ్యక్తం చేసిన అభ్యంతరానికి సమాధానమిస్తూ, 2 జీ స్పెక్ట్రం లైసెన్సుల జారీలో అవినీతి విస్పష్టంగా ఉంది కాబట్టే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా చొరవ తీసుకుని సుప్రీంకోర్టు ద్వారా వాటిని రద్దు చేయించి ప్రజాధనాన్ని పరిరక్షించి ప్రకృతి వనరుల వేలం విధానానికి నాంది పలికిందని, కానీ అదే తీర్పుని బొగ్గు గనులకు కోర్టు వర్తింపచేయటం చర్చనీయాంశమన్నారు. అలాగే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ అయ్యర్‌ల ద్వారా ఎఫ్‌డీఆర్ రూపొందించి, బీజేపీ, కాంగ్రెస్‌లను ఒప్పించి 99వ రాజ్యాంగ సవరణగా తీసుకొచ్చిన ఎన్‌జేఏసీ చట్టాన్ని కూడా సుప్రీంకోర్టు కొట్టివేసిందని, ఆ తప్పును సరిచేయటానికి కొన్నేళ్లు పడుతుందన్నారు. న్యాయవ్యవస్థలోకి సమర్థులైన యువత రావటానికి ఐజేఎస్ ఏర్పాటు చేయాలని, జవాబుదారీతనానికి తగిన చర్యలు ఉండాలని, ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగటానికి ఈ సంస్కరణలు వేగంగా అమలవ్వాలని అన్నారు.

INDIAN DEMOCRACY AT WORK

FOUNDATION FOR DEMOCRATIC REFORMS | ISB Bharti Institute of Public Policy | हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

# నామమాత్ర సంస్కరణల్ని క్రియాశీలకంగా మార్చాలి

మన దేశంలో నామవాచకంగా మాత్రమే ఉన్న చట్ట సంస్కరణల్ని క్రియల్లా మార్చేందుకు న్యాయవ్యవస్థను ఆధునీకరించాలని మద్రాస్ హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ ఎన్.ఎల్ రాజా అన్నారు. త్వరితగతిన న్యాయం అందించేందుకు న్యాయ విభాగాల్లో ఎటువంటి మార్పులు రావాలో 79, 144, 221, 230, 254 లా కమిషన్ నివేదికలు వివరంగా చెప్పినా ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. ప్రామాణిక న్యాయ గణాంకాలు కొరవడటం వల్ల సులభంగా చేయగలిగిన మార్పులు కూడా రావటం లేదన్నారు. మనకవద్ద పెండింగ్‌లో ఉన్న 2 కోట్ల పైచిలుకు క్రిమినల్ కేసుల్లో దాదాపు 40 లక్షలు చెక్ బౌన్స్ కేసులని, వాటిని వేరు చేసి ఇతర మార్గాల్లో వెంటనే ఎలా పరిష్కరించవచ్చో సుప్రీంకోర్టు మార్గదర్శకాలున్నా ఆ పని చేయటానికి గణాంకాలు క్రమపద్ధతిలో లేవన్నారు. గణాంకాల్ని సరైన రీతిలో సేకరించి, కూర్చి, విభాగాలుగా చేసి పరిష్కారాల్ని అమలు చేస్తే కేసుల భారం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇందుకోసం అమెరికాలోలా జ్యుడీషియల్ స్టాటిస్టిక్స్ చట్టాన్ని తేవాలన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) 8వ రోజు సమావేశంలో 'సివిల్ ప్రొసీజరల్ సంస్కరణల'పై ఫిబ్రవరి 27 ఉదయం జరిగిన చర్చకు ఎన్.ఎల్ రాజా అధ్యక్షత వహించారు. ఎన్‌ఎల్‌ఎస్‌ఐయూ, బెంగళూరు వైస్ ఛాన్సలర్ డా॥ సుధీర్ క్రిష్ణస్వామి, బోంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షాలిని ఫన్సాల్కర్-జోషి, అమెరికా క్లేర్‌మాంట్ మెకెన్నా కాలేజీ ప్రెసిడెంట్ హీరమ్ ఇ చొదోష్ పాల్గొన్నారు.**

జడ్జిల సంఖ్య తక్కువగా ఉండటం, న్యాయవ్యవస్థకు జీడీపీలో కేవలం 0.09% మాత్రమే ఖర్చు చేయటం, వాణిజ్య కోర్టుల చట్టం వచ్చినా ఏ రాష్ట్రం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవటం వ్యవస్థాగత సమస్యలో భాగమని రాజా అన్నారు. ప్రతి హైకోర్టు తన వెబ్‌సైట్‌లో వాణిజ్య కేసుల వివరాల్ని ప్రదర్శించాలని, చిన్న కేసుల్ని వేగంగా పరిష్కరించటానికి 2009లో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టాన్ని అమలు చేయాలని, చట్టాల్ని సంస్కరించాలని, కాగితానికే పరిమితమైన న్యాయసహాయ కార్యక్రమాన్ని సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా పటిష్టపరచాలని, పారా లీగల్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని అన్నారు.

డా॥ సుధీర్ కృష్ణస్వామి మాట్లాడుతూ, రాజ్యం, పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని




ఓపక్కన పౌర హక్కుల కార్యకర్తలు, వ్యాపారవేత్తల ఫిర్యాదులు పెరుగుతుండగా.. మరోపక్క పోలీసులు, న్యాయవ్యవస్థ, ఫోరెన్సిక్ తదితర విభాగాలకు కేటాయింపుల్ని పెంచి రాజ్యవ్యవస్థను బలోపేతం చేయాలని కొందరు వాదిస్తున్నారని ఈ వైరుధ్యాన్ని పరిష్కరించేలా భారత్‌లో న్యాయసంస్కరణల్ని రూపొందించాలన్నారు. బలమైన చట్టబద్ధపాలన రాజ్యవ్యవస్థను నియంత్రిస్తుందని, అందుకే అభివృద్ధి చెందుతున్న దేశాల్లో న్యాయసంస్కరణలు ఈ ఘర్షణను అధిగమించాల్సి ఉంటుందన్నారు. బ్రిటన్‌లో చట్టబద్ధపాలన సాధారణ చట్టం కావటం వెనుక బలమైన సామాజిక కారణాలున్నాయని, అటువంటి సామాజిక శక్తి మన దేశ చట్టబద్ధపాలన సంస్కరణల్లో ఏమిటనేది ఆలోచించాలన్నారు. సంస్కరణలు న్యాయవ్యవస్థ నుంచి మాత్రమే కాకుండా సమాజ అనుభవాల ఆధారంగా కూడా జరగాలన్నారు. లా కమిషన్ రిపోర్టులు, పలు అధ్యయనపత్రాల్లో ఎక్కువ మార్పులు న్యాయవ్యవస్థ వైపు నుంచే ఉన్నాయన్నారు. సరఫరాతోపాటు డిమాండ్ వైపు నుంచి కూడా మార్పులు మొదలుపెడితే న్యాయవ్యవస్థ క్రియాశీలమవుతుందన్నారు. భారత్ ఎంతో వైవిధ్యం ఉన్న సువిశాల దేశమని, ఎక్కడికక్కడ చిన్న ప్రయోగాల ఆధారంగా ఫలితాలను అధ్యయనం చేసి సంస్కరణల్లో భాగం చేయాలన్నారు. ఢిల్లీలో ప్రారంభమైన వాణిజ్య కోర్టుల పనితీరు ఉన్నకొద్దీ మందగించటం.. సమాజ అవసరాల కోణంలో ఆలోచించకపోవటం వల్ల తలెత్తిన వైఫల్యానికి తాజా ఉదాహరణన్నారు. న్యాయమూర్తుల సంఖ్య పెంచటం సమస్యకు పరిష్కారం కాదని, జడ్జిలు ఎక్కువైతే కేసులు కూడా అదే నిష్పత్తిలో పెరుగుతాయన్నారు. ప్రజలు, అడ్వొకేట్లు, న్యాయమూర్తులు అందరికీ ప్రోత్సాహకాలు ఉండే విధంగా సంస్కరణల్ని రూపొందించాలన్నారు. సింగపూర్ 1980-90లలో ఇదే రీతిలో ప్రోత్సాహకాల్ని రూపొందించటం వల్ల గణనీయ ఫలితాలను సాధించిందన్నారు. కోర్టులో విచారణ ప్రక్రియ దాకా వెళ్లకుండా పరిష్కరించటానికి ఏర్పాట్లు, బ్రిటన్‌లోలా స్మాల్ ట్రాక్ కోర్టులు వంటివి పెద్ద ఫలితాల్ని ఇస్తాయన్నారు. స్టే ఆర్డర్

INDIAN DEMOCRACY AT WORK
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB | Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

కోసమే కోర్టులను ఆశ్రయించటం ఎక్కువని, అది నిరవధికంగా కొనసాగించకుండా కాలపరిమితిని విధించటం, తీర్పులు వెలువరించే (ఔట్‌కమ్) తేదీల్ని ప్రకటించి ఆ రోజున సదరు జడ్జి సహా ఎవరు అందుబాటులో లేకున్నా వెలువరించే ఏర్పాటు చేస్తే ఆటనియమాలు మారిపోతాయన్నారు.

క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌తో పోలిస్తే సివిల్ కోడ్‌లో సంస్కరణల అవరోధాలు తక్కువని జస్టిస్ షాలిని ఫన్సాల్కర్-జోషి అన్నారు. సివిల్ కేసు విచారణలో జాప్యంపైనే ఎక్కువ ఫిర్యాదన్నారు. బెంచ్, బార్.. ఈ రెంటి మధ్యే సివిల్ విచారణ ప్రక్రియ ఉంటుందన్నారు. బ్రిటన్‌లోలా కేసుల నిర్వహణ బార్ నుంచి బెంచ్‌కి మారాలని, కోర్టులకు క్రియాశీల పాత్ర కల్పించాలని అన్నారు. మన దేశంలో తక్కువ సివిల్ కేసులు వస్తున్నప్పటికీ పెండింగ్ కేసులు మాత్రం ఎక్కువన్నారు. భారత్‌లో పలు చోట్ల సిటీ సివిల్ కోర్టులు రూ.1 కోటి రూపాయల పరిధి కేసుల్ని విచారిస్తున్నాయని, కోర్టుల విచారణ పరిధిని పెంచటం వల్ల హైకోర్టుల మీద భారం తగ్గుతుందని అన్నారు.

హీరమ్ ఇ చొదోష్ అమెరికా నుంచి చర్చలో పాల్గొంటూ, భారత్‌లో న్యాయసంస్కరణలు మరీ ఆలస్యంగా, మరీ చిన్న స్థాయిలో వస్తున్నాయన్నారు. మౌలికాంశాల మీద దృష్టి పెట్టకుండా జడ్జిల సంఖ్యను పెంచటం, చకచకా తీర్పులివ్వటం వంటి అంశాల చుట్టూనే తిరిగితే ప్రయోజనముండదన్నారు. ప్రజల సమస్య ఏమిటి, తీర్పుల్లో నాణ్యత ఎంత, సమాజంలో వైవిధ్య ప్రభావం ఎలా ఉంది వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. డేటా అంటే కేవలం అంకెలు, రాశి మాత్రమే కాదని, వ్యవస్థను బేరీజు వేసే కొత్త మార్గాల్ని అందులో అన్వేషించాలన్నారు. ఇంకే ఇతర ప్రభుత్వ విభాగం చేయలేని, న్యాయవ్యవస్థ మాత్రమే చేస్తున్న పని ఏమిటో నిర్దిష్టంగా గుర్తించాలన్నారు. న్యాయవ్యవస్థ తాను చేయాల్సిన పనికాకుండా ఇతర పనుల మీద అత్యుత్సాహం చూపటం క్రియాశీల పనితీరు అవదన్నారు. గుర్తింపు, సంతృప్తి వంటి మానసిక ఆదాయాలు భాగస్వాములందరికీ లభించేలా ఎలాంటి పరిష్కారాల్ని రూపొందించాలో పరిశీలించాలన్నారు. ఇందుకోసం కొన్ని పైలట్ ప్రాజెక్టుల్ని ప్రారంభించాలని సూచించారు. మనం వ్యవస్థలోని అంశాలకనుగుణంగా ఆలోచించటానికి అలవాటుపడతామని, కానీ వైఫల్యాల్ని సరిచేసుకోవాలంటే తాజాగా, భిన్నంగా ఆలోచించాలన్నారు. అలాగే సంస్కరణల్ని సాధించేందుకు రాజకీయ వ్యూహం ఉండాలన్నారు. న్యాయవ్యవస్థ నియామకాల్లో, కేసుల రొటేషన్‌లో పారదర్శకత, జవాబుదారీతనం, తగిన వాస్తవాలు లేకున్నా అప్పీళ్ల అనుమతికి స్వస్తి చెప్పటం, నిరంతర ప్రొసీడింగ్‌లు మదింపు, విచారణ పరిధిని తగ్గించటం, మధ్యవర్తిత్వ పద్ధతులను భారతదేశం అమలు చేయాలన్నారు.

న్యాయవ్యవస్థ, సమాజం మధ్య సమన్వయం, తగిన ప్రోత్సాహకాలతో క్రియాశీల న్యాయవ్యవస్థను నిర్మించేందుకు చర్చ తర్వాత కూడా కలిసిరావాలని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

# గ్రామన్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక కోర్టులతో సామాన్యుడికి న్యాయం: జేపీ

సామాన్యుడికి తేలిగ్గా, పెద్ద ఖర్చు లేకుండా న్యాయం అందించటం న్యాయసంస్కరణల తొలి లక్ష్యమని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఇందుకు దిగువ స్థాయి కోర్టుల్లో పటిష్ఠ ఏర్పాట్లు కావాలన్నారు. కానీ కింది కోర్టుల్లో 3.5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. న్యాయమూర్తులు 10 లక్షల జనాభాకు కేవలం 18 మంది ఉన్నారని, వారిలోనూ 14 నియామకాలే జరిగాయన్నారు. సామాజిక నియంత్రణలు బలంగా ఉండటం వల్ల ఇప్పటివరకూ ఏదో విధంగా ప్రజలు నెట్టుకొస్తున్నారని, కానీ వేగంగా మారుతున్న ఆర్థిక, సాంకేతిక పరిస్థితుల్లో, పెరుగుతున్న పట్టణీకరణలో సామాజిక నియంత్రణలు రక్షణనివ్వలేవన్నారు. అందుకే గ్రామన్యాయాలయాల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పారంపరిక తీర్పుల వ్యవస్థలోని బలాల్ని స్వతంత్ర న్యాయవ్యవస్థతో ఈ చట్టం అనుసంధానం చేస్తుందన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) 8వ రోజు సమావేశంలో 'దిగువ కోర్టుల్లో సత్వర న్యాయం' అంశంపై ఫిబ్రవరి 27 సాయంత్రం జరిగిన చర్చకు జాతీయ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ జస్టిస్ జి.రఘురాం అధ్యక్షత వహించారు. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, సుప్రీంకోర్టు ఈ-కమిటీ వైస్ చైర్మన్ జస్టిస్ ఆర్‌సి చవాన్, ఏషియా ఫౌండేషన్ చీఫ్ ఆఫ్ పార్టీ అతుల్ కౌశిక్ ప్యానల్‌లో పాల్గొన్నారు.**

గ్రామాల్లో న్యాయమూర్తులుగా పనిచేయటానికి సామర్థ్యం ఉన్నవారు ముందుకురారు కాబట్టి అక్కడ తీర్పులు నాసిరకంగా ఉండి

INDIAN DEMOCRACY AT WORK
FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

అప్పీళ్లు పెరిగి న్యాయవ్యవస్థ మీద ఇంకా భారం పడుతుందన్న వాదన సరికాదని, అమెరికాలోని స్మాల్ క్లెయిమ్స్ కోర్టులు, బ్రిటన్‌లోని జస్టిసెస్ ఆఫ్ పీస్ (జేపీ)లు పెద్దఎత్తున విజయవంతమయ్యాయని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దాదాపు 83% కేసుల విచారణ జేపీల పరిధిలోనే జరుగుతోందని, 93% క్రిమినల్ కేసుల్ని పరిష్కరించి సత్వర న్యాయం అందిస్తున్నాయన్నారు. సివిల్ కోర్టుల్లో 73% విచారణలు స్మాల్ క్లెయిమ్స్ విధానంలోనే జరుగుతున్నాయన్నారు. మన దేశంలోనూ ఆ స్థాయి విజయం సాధ్యమన్నారు. అమెరికా, బ్రిటన్ అనుభవాలను, మన దేశ పరిస్థితులను అధ్యయనం చేశాకే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా స్థానిక కోర్టుల బిల్లును రూపొందించి ప్రభుత్వానికి అందించిందని, 2008లో బిల్లును గ్రామన్యాయాలయాల చట్టంగా పార్లమెంటు ఆమోదించిందని అన్నారు. రూ.5,00,000 పరిధిలోని కేసుల్ని ఈ కోర్టుల్లోనే విచారించవచ్చని, ఆ పరిధి దాటితే ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ జరపవచ్చన్నారు. పెద్ద సంక్లిష్టతలు లేని న్యాయప్రక్రియ, తక్కువ ఖర్చు, ప్రజలకు అందుబాటులో ఉండటం వల్ల ఇవి న్యాయసేవల్ని గణనీయంగా మెరుగుపరుస్తాయన్నారు. గ్రామన్యాయాలయాల్నే స్థానిక కోర్టులుగా పట్టణ, నగర ప్రాంతాల్లో అమలు చేయవచ్చని, నగరాల్లో మహిళలపై పెరుగుతున్న వేధింపులు వంటి కేసులకు ఇవి మెరుగైన పరిష్కారాలవుతాయన్నారు. మహిళల పట్ల అసభ్య ప్రవర్తన వంటి నేరాల్లో జరిమానాలు, కాలేజీ, ఉద్యోగంలో రిమార్కుల వంటి చిన్న శిక్షలతో అత్యాచారాలు, తీవ్ర హింస వంటి పెద్ద నేరాలను నివారించగలుగుతాయన్నారు. దేశవ్యాప్తంగా 5,000 – 6,000 గ్రామన్యాయాలయాల అవసరముండగా, కేవలం 220 మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. పోలీసు, ప్రాసిక్యూషన్, కోర్టుల పరంగా సరైన సంస్కరణలను అమలు చేస్తే ప్రజల్లో ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం పెరుగుతుందన్నారు. దిగువ కోర్టుల్ని బలహీనపరచటం వల్ల చులకన భావం పెరిగిందని, లాయర్లు, సాక్షులు ఎవరు న్యాయస్థానాన్ని కించపరిచినా కోర్టు ధిక్కారం కింద చర్య తీసుకునే ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా న్యాయమూర్తికి సహకారమందించటానికి జ్యుడీషియల్ క్లర్కుల్ని నియమించాలన్నారు. జస్టిస్ జి.రఘురామ్ మాట్లాడుతూ, కోర్టుకు వచ్చేవారు, కోర్టుకు తీసుకురాబడేవారు అనే రెండు రకాలవారుంటారని, వీరిలో కోర్టుకు వచ్చేవారితోనే తంటా అని, కోర్టుకు తీసుకురాబడేవారు ఎక్కువగా బాధితులన్నారు. పోలీసు, న్యాయవ్యవస్థల నుంచి సత్వర న్యాయం అందకుంటే ప్రజలు వ్యవస్థ పట్ల విశ్వాసం కోల్పోతారన్నారు. దిగువ కోర్టుల్లో ఏడాది దాటి విచారణ కొనసాగితే న్యాయం అందించటంలో విఫలమైనట్లేనన్నారు. పాతకాలపు న్యాయవిద్య నుంచి వచ్చిన విద్యార్థులు న్యాయవ్యవస్థలో ఆధునిక ప్రజాస్వామ్య అవసరాలకనుగుణంగా పనిచేయలేకపోతున్నారన్నారు. న్యాయమూర్తి అర్హత కలిగిన అభ్యర్థులు లేక ఎంపిక ప్రక్రియను




నిలిపివేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. జడ్జిల ఎంపికలో పరీక్షా విధానం, వ్యక్తిత్వ మూల్యాంకనం సక్రమంగా లేదని, శిక్షణావిధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. న్యాయవ్యవస్థలోకి అత్యుత్తమ ఆలోచనాపరులు ప్రవేశించేలా ఏర్పాట్లు చేయాలని, ఐజేఎస్ ద్వారా ఎంపిక చేయాలన్నారు. సకాలంలో న్యాయం అందకపోవటం వల్ల ఆర్థిక, సామాజిక పరంగా వస్తున్న నష్టాల్ని వివరించారు. వ్యాజ్యాల్లో ప్రభుత్వం నుంచి వస్తున్నవి 40 శాతానికిపైగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ విభాగాలు చేయాల్సిన పనుల్లో కోర్టులు ఆదేశాలిస్తున్నాయని, ప్రభుత్వాధికారులు చేయాల్సిన పనుల్ని న్యాయవ్యవస్థ వనరులతో న్యాయమూర్తులు చేయటం తగదన్నారు. కోర్టు కేసుల పెండింగ్ సమస్యను లోతుగా చూడాలని, జడ్జిలు సక్రమంగా న్యాయ ప్రక్రియను అనుసరిస్తే చాలా వరకూ పెండింగ్‌ను నిరోధించవచ్చని జస్టిస్ ఆర్‌సి చవాన్ అన్నారు. చార్జిషీట్‌ను పరిశీలించటం, కేసు వివరాల్ని అర్థం చేసుకునే ప్రయత్నం లేవన్నారు. ఆ రకమైన మొక్కుబడి, నిర్లక్ష్య ధోరణి దిగువ కోర్టుల నుంచి పైవరకూ కనిపిస్తుందన్నారు. న్యాయ ప్రక్రియను సక్రమంగా అనుసరిస్తే సగం సమస్యలు పరిష్కారమవుతాయని, న్యాయవ్యవస్థలో ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. అతుల్ కౌశిక్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థకు చేస్తున్న కేటాయింపులు బాగా తక్కువగా ఉంటున్నాయని, ఇక్కడ నిధులిచ్చినా ఓట్లు రావనే ఉద్దేశంతో పట్టించుకోవటం లేదన్నారు. మన న్యాయవ్యవస్థ రాజ్యాంగ విధానంలో కాకుండా సహజ న్యాయసూత్రాలనే ఎక్కువగా అనుసరిస్తోందని, సమగ్ర న్యాయం అందించటానికి వినూత్న ఆలోచనలు కొరవడ్డాయన్నారు. వేగంగా న్యాయం అందించటంలో సాంకేతికత బాగా ఉపయోగపడుతోందన్నారు. ఈ–కోర్టుల వల్ల నాణ్యమైన తీర్పులకు కావలసిన సమాచారం న్యాయమూర్తులకు తేలిగ్గా అందుబాటులోకి వచ్చిందన్నారు. విచారణను జాప్యం చేసే పాత పద్ధతులకు స్వస్తి చెప్పాలని, కాగితాల కన్నా ల్యాప్‌టాప్‌లో కంటెంట్‌కి ప్రాధాన్యతనివ్వాలన్నారు. సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని విస్తరించటం, న్యాయ ప్రక్రియను రీ ఇంజినీర్ చేయటం, మధ్యవర్తిత్వ విధానాల్ని ప్రోత్సహించటం, తగిన పరిజ్ఞానమున్నవారితో కోర్టు మేనేజర్లు, క్లర్కుల వ్యవస్థ ఏర్పాటు చేయటం న్యాయవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయన్నారు.

# సుప్రీంకోర్టు ఫెడరల్ కోర్టుగా పనిచేయాలి, రాష్ట్రాల్లో హైకోర్టే సుప్రీంకోర్టు: జస్టిస్ లోకుర్




సుప్రీంకోర్టు ఫెడరల్ కోర్టుగా పనిచేయాలని, జాతీయ స్థాయి అంశాలు, రాష్ట్రాల మధ్య వివాదాలకు మాత్రమే కోర్టు పరిమితం కావాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి లోకుర్ అన్నారు. అలాగే పార్లమెంటు చట్టాలలో జోక్యం చేసుకోవచ్చున్నారు. రాష్ట్రాల పరిధిలోని అంశాలు, అసెంబ్లీ చట్టాలలో సుప్రీంకోర్టు ప్రమేయం సరికాదన్నారు. ఢిల్లీ అద్దె నియంత్రణ చట్టం, మరో రాష్ట్రానికి సంబంధించిన మరో అంశంపై మిగిలిన దేశ ప్రజలకు ఆసక్తి ఉండదన్నారు. రాష్ట్రాల్లో హైకోర్టే సుప్రీంకోర్టన్నారు. రాజ్యాంగంలోని వడపోతల్ని ఉపయోగించి అవాంఛనీయ కేసుల విచారణ చేపట్టకుండా సుప్రీంకోర్టు నియంత్రణ పాటించాలన్నారు. అత్యున్నత రాజ్యాంగ కోర్టుగా రాజ్యాంగపరమైన అంశాలపై తన బాధ్యతల్ని నిర్వర్తించేందుకు సమయాన్ని కేటాయించాలన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) 9వ రోజు సమావేశంలో 'రాజ్యాంగ కోర్టులను బలోపేతం చేయటం'పై ఫిబ్రవరి 28 ఉదయం జరిగిన చర్చకు జస్టిస్ లోకుర్ అధ్యక్షత వహించారు. న్యాయవాది, న్యాయకోవిదుడు, రచయిత వి.సుధీష్ పాయ్, 'విధి' లీగల్ పాలసీ, కర్ణాటక, సహ వ్యవస్థాపకుడు అలోక్ ప్రసన్న కుమార్, అమెరికాలోని నైన్త్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ మాజీ క్లర్క్ కేథీ కేటర్‌సన్, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్యానలిస్టులుగా పాల్గొన్నారు.**

పాలనాపరమైన అంశాలు సుప్రీంకోర్టు ఎదుర్కొంటున్న రెండో ప్రధాన సమస్యని జస్టిస్ లోకుర్ అన్నారు. కోర్టు రిజిస్ట్రీని బలోపేతం చేయకపోతే పనితీరు బలహీనపడుతుందన్నారు. కెనడాలో రిజిస్ట్రీని పార్లమెంటే నియమిస్తుందని, పార్లమెంటుకే రిజిస్ట్రీ జవాబుదారీగా ఉంటారన్నారు. ఈ రకమైన హైబ్రిడ్ ఏర్పాట్లతో నైపుణ్యమున్నవారిని కోర్టు పాలనా విభాగంలో ఎంపిక చేయటం అవసరమన్నారు. రాష్ట్రాల చట్టాలకు, పరిధికి సంబంధించి హైకోర్టే సుప్రీంకోర్టన్నారు. హైకోర్టుల్లో 40% న్యాయమూర్తుల స్థానాలు భర్తీకాకపోవటం తీవ్ర సమస్యేనన్నారు. జడ్జిల నియామకానికి ఒక స్థిరత్వంతో జరగాలన్నారు. పెండింగ్ కేసుల్ని యుద్ధప్రాతిపదికన ప్రక్షాళన చేయాలన్నారు. ఇది పూర్తిగా సాధ్యమని, 1990లలో సుప్రీంకోర్టు భారీ సంఖ్యలో ఉన్న కేసుల్ని ప్రక్షాళన చేసి అనవసర కేసుల్ని తొలగించిందన్నారు.

సుధీష్ పాయ్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని పరిరక్షించటం, రాజ్యాంగ అధికరణాలను నిర్వచించటం, రాష్ట్రాల మధ్య వివాదాల్ని పరిష్కరించటం, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం సుప్రీంకోర్టు ప్రధాన బాధ్యతలన్నారు. రాజ్యాంగ కోర్టుగా సుప్రీంకోర్టు పని లిటిగెంట్ల మధ్య కేసులు పరిష్కరించటం కాదన్నారు. బెంచ్‌లలో అలాంటి కేసుల్ని తీసుకుంటే, అత్యున్నత న్యాయస్థానం లక్ష్యాలు పలచబడతాయన్నారు. అరుదుగా మాత్రమే ఆ కేసుల్ని విచారణకు స్వీకరించాలన్నారు. దిగువ స్థాయి కోర్టుల తీర్పుల్లో లోపాల్ని సరిచేసే పనిని కూడా

INDIAN DEMOCRACY AT WORK
FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB | Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

సుప్రీంకోర్టు తలకెత్తుకోకూడదన్నారు. రాజ్యాంగ సూత్రాలకు భాష్యం చెప్పేటప్పుడు న్యాయమూర్తుల వ్యక్తిత్వ ప్రభావం కనిపించవచ్చని, అందువల్ల అత్యున్నత న్యాయస్థానంలోని జడ్జిలు సమదృష్టి, నిగ్రహం కలవారై ఉండాలన్నారు. జడ్జిల పరిజ్ఞానం, పరిణతి, సమతులత న్యాయవ్యవస్థ సంస్కరణల్లో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఆర్టికల్ 136ను సుప్రీంకోర్టు ప్రతి విషయానికీ వర్తింపచేయకూడదన్నారు. ఇద్దరు జడ్జీలతో కూడా రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేసి తీర్పులు వెలువరిస్తున్నారని, అవి సంతృప్తికరంగా లేవన్నారు. రాజ్యాంగ బెంచ్‌లో గతంలో ప్రధాన న్యాయమూర్తికి అదనంగా 7 గురు న్యాయమూర్తులు ఉండేవారన్నారు. రాజ్యాంగబెంచ్‌లలో రొటేషన్ పద్ధతిలో న్యాయమూర్తుల నియామకం ఉండాలన్నారు. మరోవైపు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచటం వల్ల కూర్పు, ప్రభావం దెబ్బతినే ప్రమాదముందన్నారు. జస్టిస్ సుబ్బారావు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 11కు మించకూడదని చెప్పారని గుర్తుచేశారు. కొన్ని రంగాలలో నిపుణత కలిగిన న్యాయమూర్తులు ఉండటం వల్ల కొన్ని కేసుల్లో వేగంగా తీర్పులివ్వటానికి అవకాశముంటుందన్నారు. సుప్రీంకోర్టుపై సంస్థాగత, పాలనాపరమైన భారాలు ఉండకూడదన్నారు. హైకోర్టును బలోపేతం చేస్తే సుప్రీంకోర్టులపై భారం తగ్గుతుందన్నారు. ట్రైబ్యునళ్లకు మొదటి అప్పీలేట్‌గా సుప్రీంకోర్టు కాకుండా హైకోర్టు ఉండాలన్నారు.

సుప్రీంకోర్టు, హైకోర్టు మాత్రమే కాకుండా జిల్లా, దిగువ స్థాయి కోర్టులు కూడా రాజ్యాంగ న్యాయస్థానాలేనని అలోక్ ప్రసన్న కుమార్ అన్నారు. హైకోర్టులు పెద్ద నగరాలలో మాత్రమే కేంద్రీకృతమయ్యాయని, దీనివల్ల దూరప్రాంతాలలోని పేదలు న్యాయవ్యవస్థ వెలుపల ఉండిపోతున్నారన్నారు. ఇతరత్రా కారణాలతోపాటు హైకోర్టు దగ్గరగా ఉండటం వల్ల ఎక్కువ కేసులు పట్టణ ప్రాంతాల నుంచి వస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో హైకోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. హైకోర్టులో న్యాయమూర్తులు 7 నుంచి 15 ఏళ్ల దాకా పనిచేస్తారు కాబట్టి పద్ధతులు, విలువలను ఆకళింపు చేసుకుంటారని, వీరినే బెంచ్‌లకు కూడా పంపితే తీర్పుల్లో వైరుధ్యాలకు అవకాశం ఉండదన్నారు. క్రిమినల్ కేసుల విచారణలో విపరీత జాప్యం జరుగుతోందని, ప్రత్యేక బెంచ్‌ని ఏర్పాటు చేసి పెండింగ్ కేసుల్ని వేగంగా పరిష్కరించాలన్నారు. కిందిస్థాయి కోర్టులు రాజకీయ ఒత్తిడులు, ఆరోపణల భయంతో బెయిల్ ఇవ్వటానికి సుముఖత చూపకపోవటంతో హైకోర్టుకు బెయిల్ కేసులు వెల్లువెత్తుతున్నాయని, ఈ సమస్యపై ఆలస్యం చేయకుండా దృష్టి సారించాలన్నారు. హైకోర్టులో జడ్జిలుగా కిందిస్థాయి కోర్టు నుంచి మూడో వంతు మంది మాత్రమే ఎంపికవ్వాలన్న పరిమితిని తొలగించాలన్నారు. కనీసం సగం మంది న్యాయమూర్తులు దిగువ కోర్టుల నుంచి రావాలన్నారు. అనుభవజ్ఞులైన వీరికి ప్రామాణిక శిక్షణనివ్వాలన్నారు. దీని వల్ల హైకోర్టు తీర్పుల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. హైకోర్టు తక్షణ లక్ష్యంగా పదేళ్లు దాటిన పెండింగ్ కేసుల్ని నిర్దిష్ట కాలపరిమితితో పరిష్కరించాలన్నారు. క్రిమినల్ కేసుల్లో సాక్ష్యాలుగా ప్రవేశపెట్టే వందల, వేల పత్రాలను అధ్యయనం చేయటానికి కృత్రిమ మేధ వినియోగాన్ని క్రమంగా పెంచాలన్నారు. దీనివల్ల విచారణ ప్రక్రియలో అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. జర్మనీలోలా కొన్ని అంశాలకు ప్రత్యేక సుప్రీంకోర్టుల ఏర్పాటు ఉండాలని సూచించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు సగటున మూడున్నర సంవత్సరాలు మాత్రమే పనిచేస్తున్నారని, దానివల్ల వారి అనుభవసారం న్యాయవ్యవస్థకు తగినంతగా ఉపయోగపడటం లేదన్నారు.

అమెరికా నుంచి సదస్సులో పాల్గొన్న కేథీ కేటర్‌సన్ భారత్‌లో పెండింగ్ కేసులపై ఎఫ్‌డీఆర్ బృందం ఇచ్చిన వివరాలు చూసి విస్మయానికి గురయ్యారు. న్యాయసంస్కరణల్లో కేసుల పెండింగ్, కేసుల నిర్వహణ ప్రాధాన్యతను గుర్తించాలన్నారు. న్యాయమూర్తుల పదవీకాలం ఎక్కువగా ఉంటే, వ్యవస్థీకృత పరిజ్ఞానాన్ని అందించగలుగుతారన్నారు. అమెరికాలో ఫెడరల్ జడ్జి జీవితకాలం పదవిలో ఉండవచ్చన్నారు. పాలనా నిర్వహణ భారం న్యాయమూర్తుల మీద ఉండకూడదని, వారు తమ సమయాన్ని కేసుల విచారణకే కేటాయించగలిగితే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. కోర్టులకు న్యాయవాద సిబ్బంది ఉంటే, కేసు విచారణయోగ్యతను, పరిధిని ప్రాథమికంగా పరిశీలించి అనవసర కేసుల్ని వడపోత చేస్తారన్నారు. న్యాయవాద సిబ్బంది ప్రధాన న్యాయమూర్తి పర్యవేక్షణలో పనిచేస్తారన్నారు. విచారణలో జాప్యం లేకుండా కేసులో పార్టీలుగా ఉన్నవారు నిర్ణీత కాలంలో పూర్తి సమాచారాన్ని, కౌంటర్లు, సాక్ష్యాల్ని సమర్పించేలా నిబంధనలుండాలన్నారు. న్యాయమూర్తి దాకా వెళ్లనవసరం లేని చిన్న కేసుల్ని పరిశీలించి పరిష్కరించేందుకు ప్యానల్ ఏర్పాటు చేయటం అమెరికాలో మంచి ఫలితాలనిచ్చిందన్నారు. వృత్తినైపుణ్యం, పరిజ్ఞానం ఉన్న కోర్టు సిబ్బంది, పారాలీగల్ బృందాల పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగిందన్నారు. అమెరికాలోలా స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేస్తే భారత్ కూడా గణనీయ ఫలితాలను సాధిస్తుందన్నారు.

న్యాయవిద్యలో, న్యాయమూర్తుల్లో నాణ్యతను పెంచటం అవసరమని, సామర్థ్యమున్న యువత తీర్పరులుగా వచ్చేందుకు భారత జ్యుడీషియల్ సర్వీస్ (ఐజేఎస్) వంటి పద్ధతులను పరిశీలించాలని డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# జవాబుదారీతనానికి న్యాయవ్యవస్థ అతీతం కాదు



భారత న్యాయవ్యవస్థలో అనేక దీర్ఘకాల సమస్యలున్నాయని, న్యాయసంస్కరణల కోసం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో చర్చలు అవసరమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.ఎన్ శ్రీకృష్ణ అన్నారు. జడ్జిల ఖాళీల్ని భర్తీ చేయటం, జడ్జిలుగా సమర్థులను ఎంపిక చేయటం, శిక్షణ, కేసుల నిర్వహణ, జవాబుదారీతనం తదితర అంశాలకు తమ ప్యానల్ చర్చ పరిమితమైనా, ఐడీఏడబ్ల్యూ వేదికగా ఇంతకు ముందు సమావేశాల్లో చర్చించిన అంశాల్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సుందన్నారు. ప్రతి రాష్ట్రానికి ప్రత్యేక న్యాయపాలనా వ్యవస్థ ఉందని, మన ఫెడరల్ వ్యవస్థలో అఖిల భారత జ్యుడీషియల్ సర్వీస్ (ఐజేఎస్) సాధ్యం కాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. పలు రాష్ట్రాల్లో వేర్వేరు భాషలు వాడుకలో ఉండటం కూడా ఐజేఎస్‌కు అవరోధమవుతుందన్నారు. సివిల్ సర్వీసు అధికారి రాసే అంశాలకు, న్యాయస్థాన తీర్పులకు తేడా ఉంటుందని, స్థానిక భాషలో విచారణలు, తీర్పులు సమస్యవుతుందన్నారు. ఒకే భాష ఉండే ఇజ్రాయిల్, జపాన్ వంటి దేశాల్లో ఈ సమస్య ఉండదన్నారు.

**'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీఏడబ్ల్యూ) వేదికగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 'చట్టబద్ధపాలన'పై నిర్వహిస్తున్న రెండవ జాతీయ సదస్సు (వెబ్ కాన్ఫరెన్స్) 9వ రోజు సమావేశంలో 'న్యాయ ప్రమాణాలు, జవాబుదారీతనం'పై ఫిబ్రవరి 28 మధ్యాహ్నం జరిగిన చర్చకు జస్టిస్ శ్రీకృష్ణ అధ్యక్షత వహించారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జాతీయ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్ డా॥ జి. మోహన్ గోపాల్, 'దక్ష' సహ వ్యవస్థాపకుడు హరీష్ నరసప్ప, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చర్చలో పాల్గొన్నారు.**

న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత లేనట్లే, జడ్జిలు తప్పుడు తీర్పులు ఇచ్చినా చర్యలు తీసుకునే అవకాశం లేదని జస్టిస్ శ్రీకృష్ణ అన్నారు. అయితే కింది కోర్టులో న్యాయమూర్తి తప్పిదాన్ని సరిచేసేందుకు పైకోర్టుకు అధికారం ఉందన్నారు. న్యాయవ్యవస్థ పనితీరును, తీర్పుల్లో నాణ్యతను పరిశీలించేందుకు న్యాయ కమిటీ ఉండాలని, సిబ్బంది వ్యవహారాల నిర్వహణకు మేనేజ్‌మెంట్

INDIAN DEMOCRACY AT WORK
FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय
University of Hyderabad

వృత్తినిపుణులను నియమించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలన్నారు.

న్యాయవ్యవస్థలో సమర్థతను పెంచటం పెద్ద సవాలని జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. ఒక్కరోజులో 50 మంది హైకోర్టు జడ్జిలను ఎంపిక చేస్తే సమర్థత ఎలా వస్తుంద న్నారు. తీర్పుల్లో నాణ్యత లోపిస్తోందని, జడ్జిలుగా రిటైరైన వాళ్లు ఏదోక పదవిలో చేరుతున్నారన్నారు. ఈ లోపాల న్నిటినీ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ బిల్లులోనే ప్రస్తావించారని, లోక్‌సభ ఆమోదం పొందించిన బిల్లు రాజ్యసభ ఆమోదం పొందేలోగా దురదృష్టవశాత్తూ ఎన్నికలు వచ్చి సభ రద్దయిందన్నారు. ఐజేఎస్ గురించి అనేక ఏళ్లుగా చర్చ జరుగుతున్నా ఇప్పటికీ కొలిక్కిరాలేదన్నారు. తీర్పుల నాణ్యతపై నిర్ణీత కాలంలో సమీక్షించేందుకు సంస్థాగత ఏర్పాటు ఉండాలన్నారు.

మోహన్ గోపాల్ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థ జవాబుదారీకి ప్రపంచవ్యాప్తంగా నిర్దిష్ట ప్రమాణాలున్నాయని, భారతదేశంలో వాటిని ఎందుకు తీసుకురాలేకపోయామో పరిశీలన అవసరమని అన్నారు. పనితీరు, ప్రమాణాల మదింపు, జవాబుదారీతనానికి పద్ధతులు లేకుండా న్యాయవ్యవస్థే నిరోధిస్తోందన్నారు. మహాత్మాగాంధీ చేసిన తీవ్ర విమర్శతో 1922లో బ్రిటిష్ ప్రభుత్వం జస్టిస్ ర్యాంకిన్ కమిటీ ద్వారా అమల్లోకి తెచ్చిన జడ్జిల నిష్పత్తి, గదులు, టాయిలెట్లు వంటి అంశాల మీదే స్వతంత్రం వచ్చి 70 ఏళ్లయినా మనం మాట్లాడుకుంటున్నామన్నారు. మనకు జవాబుదారీతనంలేని అత్యంత శక్తిమంతమైన న్యాయవ్యవస్థ ఉందన్నారు. భారతీయులమైన మేము.. అని ప్రజలే రాజ్యాంగాన్ని రాసుకున్నా, ప్రజలెన్నుకున్న పార్లమెంటు చేసిన చట్టాల్ని కూడా ఏకపక్షంగా మన న్యాయవ్యవస్థ కొట్టివేస్తోందన్నారు. భారత న్యాయవ్యవస్థను ప్రజాస్వామీకరించాలని, ప్రజాస్వా మ్యానికి చోదకశక్తిగా రూపొందించాలని అన్నారు. ఇందు కోసం సమాజాన్ని, రాజ్యవ్యవస్థను కూడా ప్రజాస్వామీకరిం చాలన్నారు. వ్యక్తుల మీద కాకుండా, వ్యవస్థల మీద ఆధారపడితే ప్రజాస్వామ్యం పటిష్టమవుతుందన్నారు. వ్యవస్థీకృత సామాజిక ప్రజాస్వామ్యం న్యాయవ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేస్తుందన్నారు. నారాయణగురు వంటి సంస్కర్తల కృషితో ప్రజాస్వామీకరించబడిన కేరళలో న్యాయవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉండటం ఇందుకు నిదర్శనమన్నారు. న్యాయ వ్యవస్థ జవాబుదారీతనాన్ని మనం సామాజిక–రాజకీయ చట్రంలో చూడాలన్నారు. మన న్యాయవ్యవస్థ వైఫల్యం వల్ల అనేకమంది కోర్టులను పరిష్కారంగా భావించటం లేదన్నారు. అమెరికాలో వెయ్యిమందికి 300కి పైగా ఫిర్యాదులుండగా, మన బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో 3 నుంచి 5 కేసులు మాత్రమే వస్తున్నాయన్నారు. న్యాయమూర్తులను జవాబుదారీ చేసే బాధ్యత రాజకీయ వ్యవస్థదేనన్నారు.

మోహన్ గోపాల్ చెప్పినట్లు జడ్జిల నిష్పత్తిని జనాభాను బట్టికాకుండా కేసుల సంఖ్యను బట్టి న్యాయమూర్తుల నియామకం జరగాలని హరీష్ నరసప్ప అన్నారు. సమయం విలువ తెలియని స్థితిలో మన న్యాయవ్యవస్థ ఉందన్నారు. సకాలంలో తీర్పు రాకుంటే, ఫలితం ఏముంటుందన్నారు. మన దేశంలో న్యాయమూర్తులు కష్టపడుతున్నా వ్యవస్థీకృత లోపాల వల్ల ప్రయోజనాలు సమకూరటం లేదన్నారు. 1950 నుంచి న్యాయవ్యవస్థలో ఎలాంటి సంస్కరణలూ రాలే దన్నారు. ప్రధాన న్యాయమూర్తులుగా తక్కువ సమయం పని చేయటం వల్ల జవాబుదారీతనం కూడా లోపిస్తోందన్నారు. కోర్టు పాలనా వ్యవహారాల్లో ప్రత్యేక నైపుణ్యాలున్న సిబ్బంది అవసరమన్నారు. న్యాయవ్యవస్థ వైపు నుంచి కాకుండా పౌరుల వైపు నుంచి జవాబుదారీతనం ఉండాలన్నారు.

జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ, అఖిల భారత సర్వీసులు అవసరం లేదని తాను కూడా భావిస్తానని, అయితే వాటికి పెద్దఎత్తున పోటీ ఉండటం, యూపీఎస్సీ వాటిని పటిష్టంగా నిర్వహిస్తుండటం వల్ల న్యాయవ్యవస్థలోకి అత్యుత్తమ ప్రతిభ కలవారు ప్రవేశిస్తారు కాబట్టే తాను ఐజేఎస్‌ను సమర్థిస్తున్నానన్నారు. ప్రజాస్వామ్యంలో మెజారిటీకి విలువుంటుందని, అయితే తగిన నియంత్రణలు లేకుంటే ఏం జరుగుతుందో అమెరికాలాంటి మెరుగైన ప్రజాస్వామ్య దేశంలో పరిణామాలే రుజువు చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో సంస్కరణలు వాటంతటవే వస్తాయని ఎదురుచూస్తూ కూర్చుంటే నష్టం కొనసాగుతూంటుందని, మనం ప్రయత్నపూర్వక కృషితో ప్రజాస్వామ్య వ్యవస్థల్ని నిర్మించాలన్నారు. అసాధ్యమైన అద్భుతం సుసాధ్యమైన మంచికి శత్రువు కాకూడదన్నారు.

INDIAN DEMOCRACY AT WORK
FDR FOUNDATION FOR DEMOCRATIC REFORMS
ISB Bharti Institute of Public Policy
हैदराबाद विश्वविद्यालय University of Hyderabad

# 'చట్టబద్ధపాలనపై హైదరాబాద్ డిక్లరేషన్ 2021' విడుదల

చట్టబద్ధపాలనపై ఐడీఏడబ్ల్యూ 9 రోజుల జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షత వహించగా, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్, ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ కె.సి సూరి, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ డైరెక్టర్ డి.ఎన్.వి కుమార గురు పాల్గొన్నారు. ఫిబ్రవరి 28 సాయంత్రం జరిగిన ఈ సమావేశంలో 'చట్టబద్ధపాలనపై హైదరాబాద్ డిక్లరేషన్ 2021' విడుదల చేశారు.

ప్రజల భద్రతకు, సమాజ శాంతి సామరస్యాలకు భరోసానివ్వటం, న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పెంపొందించటం లక్ష్యంగా స్థూల ఏకాభిప్రాయానికొచ్చిన కొన్ని సంస్కరణల ప్రతిపాదనలతో హైదరాబాద్ డిక్లరేషన్ 2021ను రూపొందించారు.

1) ఆధునిక సమాజంలో పెరుగుతున్న సవాళ్లకనుగుణంగా తగినంతమంది సిబ్బందితో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయటం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వారి మధ్య పనిచేసేలా కొంతమంది పోలీసులతో కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయటం, పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పెంచటం. 2) పోలీసులు నైపుణ్యం, సామర్థ్యంతో పనిచేసేందుకు శిక్షణ ప్రారంభ దశలోనే పోలీసింగ్‌లో ప్రత్యేక కోర్సును తప్పనిసరి చేయటం 3) ఆధునిక సమాజ అవసరాలకు తగ్గట్టు ఫోరెన్సిక్ మౌలిక వసతులను పెంచటం. పోలీస్ సర్కిల్, సబ్ డివిజన్, జిల్లా, రాష్ట్ర, ప్రధాన పట్టణ కేంద్రాలు ఇలా ప్రతి పాలనా స్థాయిలో.. జనాభా, నేరాల శాతం, నేరాల తీరుకనుగుణంగా ఫోరెన్సిక్ వసతుల ఏర్పాటు చేయాలి 4) పోలీసుల్లో నేర పరిశోధనా విభాగాన్ని శాంతి భద్రతల విభాగం నుంచి వేరు చేసి, స్వతంత్ర ప్రతిపత్తి, మౌలిక వసతులు, జవాబుదారీతనంతో నేర దర్యాప్తు సంస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మూడేళ్ల జైలుశిక్షకు అవకాశమున్న నేరాలన్నిటినీ ఈ సంస్థ పరిధిలోకి తేవాలి 5) జిల్లా స్థాయిలో బలమైన ప్రాసిక్యూషన్ వ్యవస్థను ఏర్పాటు. సమర్థత, ప్రాసిక్యూషన్ స్థాయి, స్వతంత్రత, ప్రజల విశ్వాసం, దరాప్తు–ప్రాసిక్యూషన్–న్యాయమూర్తి మధ్య సమన్వయంతో ఈ ఏర్పాటు ఉండాలి 6) విచారణ ప్రక్రియను సులభతరం, హేతుబద్ధం చేసేలా, దర్యాప్తు ప్రభావవంతంగా, పారదర్శకంగా జరిగేలా, బాధితుల హక్కులను పరిరక్షించేలా, విచారణ ప్రక్రియలో న్యాయమూర్తి పాత్ర పెంచేలా, అవసరమైన సందర్భాల్లో కస్టడీ వెలుపల శిక్షలను గుర్తించేలా క్రిమినల్ ప్రొసీజర్ చట్టాలను సవరించాలి 7) సివిల్ న్యాయవ్యవస్థను సంస్కరించేందుకు తీసుకునే చర్యలు న్యాయవ్యవస్థ, సమాజం.. సప్లయ్, డిమాండ్ రెండు వైపుల నుంచి ఉండాలి. అప్పీళ్లు, వాయిదాలు, మధ్యంతర ఉత్తర్వుల పరిధిని తగ్గించటం, మధ్యంతర ఉత్తర్వులకు కాలపరిమితి విధించటం (సన్‌సెట్ క్లాజ్), తీర్పు ఎప్పుడు వస్తుందో కచ్చితంగా తేదీని ప్రకటించటం (ఔట్‌కమ్ డే సర్టెనిటీ) వంటి పద్ధతుల్లో వేగంగా సమర్థవంతంగా విచారణ జరిగేందుకు కేసుల మేనేజ్‌మెంట్ పద్ధతిని ప్రవేశపెట్టటం.. డిమాండ్ వైపు నుంచి ఉన్న తీసుకోవాల్సిన చర్యలు 8) సుశిక్షితులైన న్యాయమూర్తుల సంఖ్యను పెంచటంతోపాటు అవసరమైన వనరుల్ని, మౌలిక వసతుల్ని కేటాయించి సమర్థవంతంగా వినియోగించుకునేలా చేయాలి. దూరాభారం, ఖర్చు తగ్గి సాధారణ పౌరులకు న్యాయవ్యవస్థ అందుబాటులోకి రావటానికి, కేసుల విచారణ వేగంగా పూర్తి చేసి పరిష్కరించటానికి చర్యలు అవసరం. న్యాయ విచారణ ప్రక్రియను అనుసరిస్తూ స్వతంత్ర న్యాయవ్యవస్థలో భాగంగా ఉండే స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేస్తే న్యాయాన్ని పేదలకు తేలిగ్గా, చౌకగా అందుబాటులోకి తేవచ్చు. దీనివల్ల న్యాయం వేగంగా అందటంతోపాటు పైస్థాయి కోర్టులపై కేసులు, పెండింగ్‌ల భారం తగ్గుతుంది 9) ఉన్నత నైపుణ్యాలున్న జ్యుడీషియల్ మేనేజర్లు, జ్యుడీషియల్ క్లర్క్‌లను నియమించటం సహా పటిష్ఠమైన కోర్టు పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయటం ద్వారా జిల్లా కోర్టులు, రాజ్యాంగ కోర్టుల సామర్థ్యాన్ని, వేగాన్ని పెంచవచ్చు. దీనివల్ల న్యాయమూర్తులు కేసుల విచారణ మీద దృష్టి సారించగలుగుతారు, పాలనా సంబంధ వ్యవహారాల్లో వృత్తి నిపుణత మెరుగుపడుతుంది 10) రాజ్యాంగానికి భాష్యం చెప్పటం, చట్టానికి సంబంధించి మౌలిక ప్రాధాన్యత గల ప్రశ్నల్లో మార్గదర్శనం చేయటానికి ప్రాథమికంగా పరిమితం చేయటం ద్వారా రాజ్యాంగ కోర్టుల్ని బలోపేతం చేయాలి. కోర్టుల్లో శాశ్వత రాజ్యాంగ బెంచ్‌లను ఏర్పాటు చేయటం, అప్పీళ్లు, రివిజన్ పిటిషన్ల సంఖ్యను తగ్గించటం, ప్రస్తుతమున్న పెండింగ్ కేసుల్ని పరిష్కరించటం ద్వారా ఇది సాధ్యమవుతుంది. పాత కేసుల భారాన్ని తగ్గించుకునేందుకు రాజ్యాంగంలోని 224ఎ ద్వారా తాత్కాలిక న్యాయమూర్తులను నియమించుకోవచ్చు 11) అత్యుత్తమ ప్రతిభాపాటవాలు కలవారిని దిగువ కోర్టులు, రాజ్యాంగ కోర్టుల్లోకి వచ్చేలా చేయాల్సిన అవసరం ఉంది. జడ్జిల వేతనాలు, సర్వీసు కండిషన్లు, పదవీ గౌరవం వంటి ప్రోత్సాహకాలను గణనీయంగా మెరుగుపరచాలి. జడ్జి పదవికి ఎంపికవటాన్ని సమర్థులైన యువ లాయర్ల లక్ష్యంగా మార్చాలి. ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయిలో పోటీ పరీక్ష ద్వారా ఎంపిక, పనితీరు ఆధారంగా వేగంగా పదోన్నతుల విధానం యువ ప్రతిభావంతులను ఆకర్షించగలుగుతాయి 12) అనుచిత ప్రవర్తనకు సంబంధించిన అంశాలను పరిష్కరించేందుకు న్యాయ ప్రమాణాలు, జవాబుదారీ వ్యవస్థను శాశ్వత ప్రాతిపదికన ఉన్నత న్యాయస్థానాల్లో ఏర్పాటు చేయాలి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను 2010 నాటి న్యాయ ప్రమాణాలు, జవాబుదారీ బిల్లులో పొందుపరిచినా, 2012లో ఆ బిల్లుకు కాలం చెల్లింది.

డిక్లరేషన్‌లోని అంశాలు కార్యరూపం దాల్చేలా అందరి సహకారంతో ప్రజాస్వామ్య పీఠం కార్యాచరణ చేపడుతుందని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.


# 'చట్టబద్ధపాలన'పై ఐడీఏడబ్ల్యూ 2వ జాతీయ సదస్సు .. కొన్ని సమావేశాల చిత్రాలు





















RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th March, 2021 Posting Date 15 &16th of every month

# హైదరాబాద్ డిక్లరేషన్‌కి మద్దతివ్వండి

'చట్టబద్ధపాలనపై హైదరాబాద్ డిక్లరేషన్ 2021' ఎజెండాను సాధించటానికి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా తమ వంతు ప్రయత్నాన్ని పార్టీలకతీతంగా ఇప్పటికే ప్రారంభించాయి. 99వ రాజ్యాంగ సవరణ, గ్రామన్యాయాలయాల చట్టం సహా పలు మౌలిక సంస్కరణల్ని ఈ రకంగానే సాధించాం. కానీ సమాజం అండ కూడా ఉంటే మార్పులు వేగంగా వస్తాయి. హైదరాబాద్ డిక్లరేషన్ అమలు కోసం గళం విప్పండి. ఈ ఎజెండాకు మద్దతివ్వటంతోపాటు స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు అవగాహనతో స్పందిస్తూ పరిష్కారంలో భాగమవ్వండి. ముఖ్యంగా యువత తమ జీవితాల్ని చూసుకుంటూనే కొంత సమయాన్ని, వనరుల్ని సమాజం కోసం వెచ్చించాలని, సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ప్రజాస్వామ్య సంస్కరణోద్యమంలో భాగమై సామాజిక నాయకులుగా ఎదగాలని విన్నపం.



- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**